ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విజయవాడ
fb.com/vaartha Digital
Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
5-5-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 93 పేజీలు: 12 వెల: 6.50

భారత్ నౌకలను అనుమతించబోం

తెరుచుకున్న బద్రీనాథ్ దేవాలయం

9లో

# మూడేళ్లలో 'అమరావతి'

## • పర్యవేక్షణ బాధ్యత మంత్రులదే • త్వరలోనే నామినేటెడ్ భర్తీ
## • కడపలో 3 రోజులు మహానాడు • టెలి కాన్ఫరెన్స్‌లో చంద్రబాబు



**విజయవాడ,మే4,ప్రభాతవార్తప్రతినిధి:** మూడేళ్లలో అమరావతి రాజధాని నిర్మాణ పనులను పూర్తి చేసి, ఘనంగా ప్రారంభోత్సవాలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.ఈ విషయంలో ఆకుంఠిత దీక్ష,సంకల్పంతో అందరు కలిసి పనిచేద్దాన్నారు. వాగ్దానం చేసాం, ఇక పనైయిపోయిందనే దిశలో కాకుండా పరిపూర్ణ కార్యచరణతో పని చేయాలన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులకు ఆకర్షించడంలో అన్ని ప్రభుత్వ యంత్రాంగాలు ఒక స్థిర లక్ష్యంతో శ్రమించాలన్నారు. ప్రధాని సభ విజయవంతమైన నేపథ్యంలో కూటమి మంత్రులు, ఎంపీలు, ఎంఎల్‌ఏలు, ఎంఎల్‌సిలు, ముఖ్య నేతలతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇక అంతా మీ చేతుల్లోనే ఉందంటూ పురపాలక శాఖ మంత్రి నారాయణకు లక్ష్యాన్ని నిర్ధేశించారు. నిర్ధేశిత లక్ష్యం మేరకు పనులు పూర్తి చేస్తామని ఈ సందర్భంగా సిఎంకు నారాయణ తెలిపారు. రాజధాని పున:ప్రారంభానికి ప్రధాని మోడీ అంకురార్పణ చేయడంతో ఇక పనులపై దృష్టి సారించినట్లు తెలిపారు.

ఇప్పటికే రూ.49వేల కోట్ల విలువైన 74 పనులకు అధికారులు ఏజెన్సీలను ఖరారు చేసి, ఎల్‌ఓఎలను అందచేశామన్నారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టరులను త్వరగా ప్రారంభించేలా చూడటంతో పాటు సకాలంలో పూర్తి చేయించడంపై దృష్టి సారించారు.ఐకానిక్ టవర్లు,హైకోర్టు,అసెంబ్లీ భవనాల లోపలి భాగాల నిర్మాణంపై చర్చిం చారు. త్వరలో ఐఐటి నిపుణుల క్షేత్ర పరిశీలన చేస్తామని తెలిపారు.నమూనాల పరిశీలన,ఖరారుకు సీఆర్డీఏ, ఐఐటి మద్రాసు మధ్య ఒప్పందం ఉంది. భవనాల డిజైన్లను ఐఐటి నిపుణులు పరిశీలించి ఆమోద ముద్ర వేస్తారు. గత ప్రభుత్వంలో ఐదేళ్లు నీటిలో నానిన ఐకానిక్ టవర్లు,హైకోర్టు పునాదుల పటిష్టతను ఐఐటీ నిపుణులు మరోసారి పరిశీలించనున్నారు. గతేడాది ఆగస్టులో నీరున్నప్పుడు ఓసారి పరిశీలించారు. నీరు తోడాక మరోసారి పరీక్షించాలని ఐఐటీ సివిల్ ఇంజనీరింగ్ విభాగానికి 2 నెలల క్రిందటే సిఆర్‌డిఎ లేఖ రాసింది. ఇప్పటికే హైకోర్టు నిర్మాణానికి టెండరు ఖరారైంది. ఐకానిక్ టవర్ల టెండర్లూ ఖరారైతే నిపుణులను అమరావతికి రప్పించాలన్న ఆలోచనలో సిఆర్‌డిఎ అధికారులు ఉన్నారు. నమూనాలు ఖరారైనందున,ఆ భవనాల్లో అధికారులు,సిబ్బంది ఛాంబర్లు ఎలా డిజైన్ చేయాలనే అంశంపై నమూనాలను పరిశీలించారు. హైకోర్టు భవనం టవర్ పైకి సందర్శకులు వెళ్తే అమరావతి నగరం మొత్తం కనిపించేలా డిజైన్‌లో స్వల్ప మార్పులు చేయాలని సూచించినట్లు మంత్రి సిఎం చంద్రబాబు నాయుడుకు వివరించారు. సచివాలయం,విభాగాధిపతుల కార్యాలయాల టవర్ల టెండర్ల గడువును 5వ తేదీ వరకు సిఆర్‌డిఎ అధికారులు పొడిగించిన విషయాన్ని సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకుని వచ్చారు. గత నెలలో 3 ప్యాకేజీల క్రింద రూ.4,689.82 కోట్ల అంచనాలతో టెండర్లు పిలిచినట్లు తెలిపారు. ప్రస్తుతం మొదటి ప్యాకేజీ క్రింద రూ.1,126.51 కోట్లతో జిఎడి టవర్ నిర్మాణం, రెండో ప్యాకేజీలో రూ.1,897.86 కోట్లతో 1.2 టవర్లు కలిపి,మూడో ప్యాకేజీ కింద రూ.1,684.45 కోట్లతో 3.4 టవర్లు కలిపి నిర్మించనున్నారు. తొలుత ఈ నెల 1 వరకే బిడ్లుదాఖలు చేసేందుకు >>2



# పాక్‌కు భారత్ మరో ఝలక్

## బాగ్‌లిహార్ డ్యామ్ గేట్లు మూసివేత

### పాకిస్థాన్ పంజాబ్ ప్రావిన్స్‌కు నీరు లేనట్లే

**న్యూఢిల్లీ, మే 4:** జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌ను అన్ని వైపుల నుంచి భారత్ దిగ్బంధిస్తోంది. ఇప్పటికే సింధు జలాల ఒప్పందాన్ని నిలిపేసిన కేంద్ర ప్రభుత్వం, తాజాగా బాగ్‌లిహార్ ఆనకట్ట నుంచి దాయాది దేశానికి నీటి సరఫరాను నిలిపివేసింది. పొరుగు దేశాన్ని ఎండగట్టే చర్యల్లో ఇది రెండోదిగా చెప్పాలి. ఓ క్షిపణిని పరీక్షించిన నేపథ్యంలో ఆ విషయం బయటకు వచ్చింది. నీటి ప్రవాహాన్ని ఆపేందుకు బాగ్‌లిహార్ డ్యామ్ స్లూయిస్ స్పిల్‌వేపై ఉన్న గేట్లను కిందకు >>2



# కడపలో మహానాడు

## 26, 27, 28 తేదీల్లో నిర్వహణ

### మహానాడు వేదిక ముస్తాబు షురూ

**కడప (పెండ్లిమర్రి) మే 4, ప్రభాత వార్త:** తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడుకు వేదిక ఖరారు అయ్యింది. మొదటిసారిగా కడపలో ఈనెల 26, 27, 28 తేదీలలో తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మహానాడును కడప నగర శివారులోని పబ్బాపురంలోని ఉపాధ్యాయులకు సంబంధించిన స్థలంలో నిర్వహిస్తున్నారు. మహానాడు వేదిక ఖరారు కావడంతో ఆదివారం కమలాపురం ఎమ్మెల్యే పుత్త చైతన్య రెడ్డి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డితో పాటు >>2

# పిడుగుపాటుకు ఇద్దరు మృతి

**నాయుడుపేట, మే 4 ప్రభాతవార్త :** తిరుపతి జిల్లా నాయుడుపేట, ఓజిలి మండలాల్లో ఆదివారం సాయంత్రం కురిసిన అకాల వర్షంతో పిడుగుపాటుకు గురై ఇద్దరు మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. నాయుడుపేట మండలం వద్దిగుంట కండ్రిగలో అల్లం భాస్కర్(45), ఓజిలి మండలం గొల్లపాళెంలో కార్తీక్ (13)అనే బాలుడు పిడుగుపాటుకు మృతిచెందారు. బాలుడు కార్తీక్ పంటపొలాల్లో వ్యవసాయ పనులు చేస్తూండగా పిడుగుపాటుకు గురై అపస్మారకస్థితిలో పడిఉండటంతో పక్కనే ఉన్న స్థానికులు గుర్తించి 108సహాయంతో చికిత్స నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.అప్పటికే బాలుడు మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. బాలుడి తల్లిదండ్రుల రోదన పలువురిని కంటతడి పెట్టిం చింది. ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం..

## ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

**జగ్గయ్యపేట, మే 4, ప్రభాతవార్త :** నేడు ప్రపంచమంతా భారతీయ యోగాను అభ్యసిస్తూ, సాధనకు ప్రాధాన్యతనిస్తున్న నేపథ్యంలో యోగా ప్రాముఖ్యత గురించి ప్రజల్లో అవగాహన విస్తరిస్తోందని, యోగసాధనతో అనారోగ్య సమస్యలను అధిగమించవచ్చునని జగ్గయ్యపేట ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ జాతీయ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలోని లయన్స్‌క్లబ్ సమావేశ మందిరంలో గాయత్రి మహిళా సంఘం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం జరిగిన అభినందన, సన్మాన సభకు రాజగోపాల్ ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఇటీవల



ఆదివారం విజయవాడ సమీపంలో బందరు రోడ్డులో చెట్టుకూలిన దృశ్యం

# రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు

## దెబ్బతిన్న ఉద్యాన పంటలు

## వరి, మొక్కజొన్నకు తీరని నష్టం

### విజయవాడలో ఈదురుగాలులతో వర్షం

**విజయవాడ,మే4,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఆదివారం ఉదయం నుంచి భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. పలు జిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడుతోంది. ఈదురు గాలుల దాటికి చెట్లనుంచి మామిడికాయలు రాలిపోయాయి. దీంతో మామిడి రైతులు లబోదిబోమంటున్నారు. పలుచోట్ల రహదారుల వెంట వృక్షాలు నేలకొరిగాయి. పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు తిప్పలు పడుతున్నారు. వర్షం ప్రభావంతో లోతట్టు ప్రాంతాల్లో ఉండే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. అధికారులు సహాయక చర్యలను ముమ్మరం చేయాలని ఆదేశించింది.

విజయవాడ నగరంలో ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. దీంతో జనజీవనం స్తంభించింది. పలుచోట్ల రహదారులపై నీరు నిల్చింది. వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. చాలా రోజులుగా వేసవి ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న విజయవాడ వాసులకు ఈ వర్షం కొంత ఉపశమనంకల్గించింది. విజయవాడలోని మొగల్రాజపురం, పటమట ప్రాంతాల్లో భారీ వర్షంతో రహదారులు జలమయమయ్యాయి. చిట్టినగర్ పరిసర ప్రాంతాల్లో నీరు నిల్చింది.పండిట్ నెహ్రూ బస్టాంట్ సమీపం లోకి వర్షపు నీరు చేరింది. భారీ వర్షాల వల్ల ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్డును మూసివేశారు. శ్రీ కనకదుర్గానగర గుండా భక్తులు రాకపోకలు కొనసాగించేలా ఏర్పాట్లు చేశారు. పెనమలూరు,గన్నవరం నియోజక వర్గాల్లోనూ భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులకు కొన్ని చోట్ల చెట్లు రోడ్లపై పడ్డాయి. ఉయ్యూరు-కాటూరు రోడ్డుపై చెట్టు పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం కల్గింది. ఎన్టీఆర్,కృష్ణాజిల్లాలో భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. వరి, మొక్కజొన్న, అరటి పంటలకు తీవ్ర నష్టం కల్గింది.ఎన్టీఆర్ జిల్లాలో భారీ వర్షం పడుతోంది. చెట్లు, హోర్డింగ్‌లు నేలకొరిగాయి. రోడ్లపై మోకాళ్ల లోతులో నీరు నిలిచింది. స్వయంగా కలెక్టర్ లక్ష్మీశా రంగంలోకి దిగారు. మోటార్లు పెట్టి నీటిని తోడించే చర్యలను కలెక్టర్ చేపట్టారు. రోడ్లపై పడిన చెట్లను యుద్ధ ప్రాతిపదికన తొలగించేలా దగ్గరుండి కలెక్టర్ లక్ష్మీశా పర్యవేక్షించారు. ఈరోజు ఈదురు గాలులతో కూడిన వర్షం పడిందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ తెలిపారు. ట్రాఫిక్‌కు అంత >>2



# టెలికమ్యూనికేషన్ బ్యూరో డైరెక్టర్‌గా రేవతి

## అంతర్జాతీయ పదవికి శ్రీకాళహస్తి మహిళ

**తొట్టంబేడు,మే 4 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి నియోజకవర్గానికి చెందిన ఓ మహిళకు అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ యూనియన్ బ్యూరో డైరెక్టర్‌గా భారత దేశం తరఫున నామినేట్ చేసారు.ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారి చేసింది. ఆదివారం ఈ సమాచారం అందటంతో పలువురు ప్రముఖులు ఆమెను అభినందించారు. గతంలో రేవతి ఇండియా తరఫున ఇంటర్నేషనల్ టెలికమ్యూనికేషన్ యూనియన్‌లో రేడియో రెగ్యులైజేషన్ బోర్డులో అడ్వకేటింగ్ సేవలో పని చేస్తున్నారు.ఆదినుంచి శ్రీకాళహస్తికి చెందిన మహిళలకు అరుదైన అవకాశం లభిస్తుంది.జాతీయ స్థాయిలో అవార్డులు పొందిన మహిళల్లో >>2

# క్రియేటివ్ ల్యాండ్ ఆసియాతో 25 వేల ఉద్యోగాలు

## భారీ స్థాయిలో విదేశీ పెట్టుబడులు: సిఎం చంద్రబాబు

**విజయవాడ,మే4,ప్రభాతవార్తప్రతినిధి:** భారతదేశపు తొలి ట్రాన్స్ మీడియా ఎంటర్‌టైన్‌మెంట్ సిటీ అయిన క్రియేటర్ ల్యాండ్‌ను ప్రజా రాజధాని అమరావతిలో ప్రారంభించడానికి రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఈ శుభపరిణామాన్ని ప్రకటించడం ఎంతో సంతోషంగా ఉందని 'ఎక్స్' వేదికగా ఆయన పేర్కొన్నారు. 25,000 ఉద్యోగాలను సృష్టించే లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్ రూపొందిందని వివరించారు. విదేశీ పెట్టుబడుల్ని ఆకర్షించడానికి పెద్ద ఎత్తున అభివృద్ధి చేయడానికి ఇది దోహదపడుతుందన్నారు. రాష్ట్రంలో స్థానికుల ప్రతిభను ప్రపంచానికి అందించే శక్తివంతమైన సాధనమిదని చెప్పారు. ఈ ప్రపంచస్థాయి సృజనాత్మక టౌన్‌షిప్ చలనచిత్రం, గేమింగ్, సంగీతం, వర్చువల్ ప్రొడక్షన్,కథల తయారీతో పాటు ఏఐ ఆధారిత కంటెంట్‌కు కేంద్రంగా ఉంటుందని వెల్లడించారు. అత్యాధునిక మౌలిక సదుపాయాలు,ప్రపంచ భాగస్వామ్యాలు మన యువతకు నైపుణ్యం కల్పించడానికి క్రియేటర్ ల్యాండ్ అకాడమీ వేదిక కానుందని తెలిపారు. సృజనాత్మక,డిజిటల్ పరిశ్రమలకు ప్రపంచ గమ్యస్థానంగా ఇది మారుతుందన్నారు. పరిపాలనా విధానాల్లో తాము తీసుకుని వస్తున్న మార్పులకు ప్రజలనుంచి అనుహ్య స్పందన లభిస్తోందని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. 'ఎక్స్' ఖాతాలోనే ఒకప్పుడు పాలనను ప్రజల వద్దకు తీసుకుని వెళ్లామని చంద్రబాబు అన్నారు..ఇప్పుడు ఏకంగా ప్రజల చేతుల్లోకే పరిపాలన వెళ్లిందన్నారు.పాలన సంస్కరణల్లో మనం తీసుకున్న ప్రతి రంగం విజయవంతమైందన్నారు. వాటప్స్ గవర్నెన్స్‌తో ప్రజలు ప్రభుత్వం నుంచి >>2



ప్రమాదంలో ధ్వంసమైన వాహనాలు

# ఒక్కచోటే మూడు ప్రమాదాలు

## ఐదుగురు మృతి

**ఒంగోలు, ప్రభాతవార్త :** ప్రకాశం జిల్లాలో దాదాపు ఒకే సమయంలో మూడు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఈ ఘటనలో ఐదుగురు మృతి చెందారు. ఆదివారం తెల్లవారుజామున ఒంగోలు మండలం కొప్పోలు సమీపంలో కోడిగుడ్ల లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా పడి ముగ్గురు మృతి చెందారు. నెల్లూరు నగరానికి చెందిన లారీ డ్రైవర్ రమణయ్య(60), నెల్లూరు జిల్లా గుడిపల్లిపాడుకు చెందిన ఆర్.బాబు(45), అదే గ్రామానికి చెందిన నాగేంద్ర (25) అక్కడికక్కడే మృతి చెందారు. బోల్తా పడిన లారీని మరో లారీ ఢీకొనడంతో పలువురికి గాయాలు అయ్యాయి. ఈ ప్రమాదంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. ఆ ట్రాఫిక్‌లో ఆగి ఉన్న కారును వెనుక నుంచి మరో లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు లారీల మధ్య ఇన్నోవా కారు నుజ్జు నుజ్జు కాగా అందులో ప్రయాణిస్తున్న టి.పావని(25), కౌషిక్(14) మృతి చెందారు. వీరు గుంటూరు జిల్లా కాకాణి నుంచి తిరుమలకు దైవదర్శనం కోసం వెళ్తున్నట్లుగా గుర్తించారు. ఈ కారులో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు.

**సంఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకున్న ఎస్పీ:** ఒంగోలు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదస్థలాన్ని స్వయంగా పరిశీలించిన >>2

# ప్రపంచస్థాయి డిజైన్లతో 'అమరావతి'

## - మంత్రి నారాయణ



**విజయవాడ,మే4,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతి నగరంలో నిర్మించే భవనాలు ప్రపంచ ప్రఖ్యాత డిజైన్లతో ఉండేరీతిలో చర్యలు తీసుకుంటున్నట్లు పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ తెలిపారు. ఆయన 'ఎక్స్' వేదికలో ఆ విషయంలో రాజీపడొద్దని రాజధానికి డిజైన్లు అందిస్తున్న నార్మన్ ఫోస్టర్స్, హాఫీజ్ కాంట్రాక్టర్, ఎల్‌అండ్‌టి సంస్థల ప్రతినిధులకు స్పష్టం చేసారు.వారితో కీలకంగా జరిపిన సమావేశంలో అసెంబ్లీ, సెక్రటేరియట్, ఇతర నిర్మాణాల్లో ఆధునికత ఉట్టిపడేలా ఉండాలని సూచించినట్లు వివరించారు. గ్రీన్ బిల్డింగ్ తరహాలో నిర్మిస్తున్న భవనాలకు తగిన విధంగా రూపకల్పన ఉండాలని సూచించారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తుది నిర్ణయం తీసుకుంటారని పేర్కొన్నారు. వీలైనంత త్వరగా డిజైన్లు సిద్ధం చేయాలన్నారు. దీనిపై ఆయా సంస్థల ప్రతినిధులు వారు >>2

# కుప్పం ఎయిర్‌పోర్టు నిర్మాణానికి భూసేకరణ సర్వే

**కుప్పం, మే 4 ప్రభాతవార్త :** కుప్పం నియోజకవర్గంలోని రామకుప్పం మండలం,శాంతిపురం మండలాల మధ్యలో ఎయిర్‌పోర్ట్ నిర్మించాలని సిఎం చంద్రబాబునాయుడు నిర్ణయించిన విషయం విదితమే. 2019లో సిఎం చంద్రబాబునాయుడు ఎయిర్‌పోర్టు నిర్మాణంకు శంకుస్థాపన చేసి 100 కోట్ల నిధులు కూడా మంజూరు చేశారు. అప్పట్లో దాదాపు 483 ఎకరాల మేర భూములను కార్గో ఎయిర్‌స్ట్రిప్ నిర్మాణం కోసం సేకరించి పలువురు రైతులకు భూపరిహారం సైతం అందించారు. అయితే అదే ఏడాది వైఎస్సార్సీ ప్రభుత్వం రావడంతో కుప్పంలో ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతేడాది జరిగిన ఎన్నికల్లో సిఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించి మరలా అధికారంలో వచ్చింది. దీంతో కుప్పంలో ఎయిర్‌పోర్టు నిర్మాణ ఆశలు రెక్కలు తొడిగాయి. శాంతిపురం మండలం అమ్మవారిపేట, రామకుప్పం మండలం కిలాక్ పోడు, విజలాపురం ప్రాంతాల మధ్య >>2

5-5pg2exHMNWJQE.qxd:5-5pg2exHMNWJQE.qxd 05/05/25 12:59 AM Page 1





ఆదివారం న్యూఢిల్లీలోని సుబ్రహ్మణ్యం ఆడిటోరియంలో కొత్తగా రూపొందించిన వరివంగడాలను ఆవిష్కరిస్తున్న కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

# మూడేళ్లలో 'అమరావతి'

>> గడువిచ్చామన్నారు. కాంట్రాక్టర్లు విజ్ఞప్తిపై మరో 4 రోజులు పొడిగించారు.ఈ సందర్భంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ అమరావతి ఒక నగరం కాదు,ఇదునూతన శక్తిగా మారుతుంది అంటూ అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవ సభలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన ప్రసంగం స్ఫూర్తి నింపిందని తెలిపారు.ప్రధాని ఇలా ఆనందం గర్వకారణమని చెప్పారు. ప్రజలందరి భాగస్వామ్యం, మూడు పార్టీల నాయకులు,కార్యకర్తల కృషితో సభ విజయవంతమైందని వెల్లడించారు. మంత్రులు,ఎంఎల్ఏలు సమన్వయంతో పనిచేశారని,ప్రభుత్వ యంత్రాంగం సమర్థంగా విధులు నిర్వర్తించిందంటూ సీఎం అభినందించారు. రాష్ట్ర వృద్ధిరేటుకు అమరావతి కేంద్రంగా ఉంటుందని ప్రధాని వ్యాఖ్యలు భవిష్యత్తు రాజధానిని ఆవిష్కరించాయని పేర్కొన్నారు. ప్రజా రాజధానికి ఆయన భరోసా ఇచ్చారని, దేశానికే అమరావతి మార్గదర్శిగా రూపొందుతుందన్నారు. ప్రజలందరి భాగస్వామ్యంతోనే సభ విజయవంతమైందని చెప్పారు. అమరావతి ఆవశ్యకతను వివరించేందుకే ప్రధాని చేతుల మీదుగా పనులు పునఃప్రారంభించామని వివరించారు. అమరావతి నగరం కాదు, ఒక శక్తిగా మారుతుందన్న ప్రధాని మాటలు స్ఫూర్తిని నింపాయని తెలిపారు. రాష్ట్ర వృద్ధి రేటుకు అమరావతి కేంద్రంగా ఉంటుందని ఆయన చేసిన వ్యాఖ్యలు భవిష్యత్ రాజధానిని ఆవిష్కరించాయని చెప్పారు. మోదీ ప్రసంగం ప్రజల పట్ల ఉన్న అభిమానానికి, రాష్ట్రాభివృద్ధిపై ఆయనకున్న చిత్తశుద్ధికి నిదర్శనంగా నిలిచిందని తెలిపారు.మంత్రులు, నేతలకు అప్పగించిన పనులను బాధ్యతగా వ్యవహరించి బ్రహ్మాండంగా పని చేశారని అభినందించారు. లక్షల మంది ప్రజలు పోటెత్తినా ఎక్కడా ఆటంకాలు కలగకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. అన్ని ప్రాంతాల ప్రజల భాగస్వామ్యంతో ఉత్సాహంగా కార్యక్రమం జరిగిందన్నారు. సభ నిర్వహణకు ప్రభుత్వ యంత్రాంగం సమర్థవంతంగా పనిచేసిందని వివరించారు. ఈ కార్యక్రమంపై అన్ని వర్గాల ప్రజల్లో సానుకూలత వ్యక్తమైందని మంత్రులు పార్థసారధి, సత్యకుమార్, నాదెండ్ల మనోహర్,తమ అభిప్రాయాలు చెప్పారు. మూడేళ్లలో నిర్మాణాలు పూర్తిచేస్తే ప్రారంభోత్సవాలు కూడా జరపాలని చంద్రబాబు ఆకాంక్షించారు. మూతబడే స్థితిలో ఉన్న విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు ఊపిరిపోసి రూ.11,400 కోట్లు కేంద్రం నిధులు కేటాయించేలా చేసుకున్నాం. ఉత్తరాంధ్ర వాసుల కల అయిన రైల్వేజోన్ సాధించాం.

మూతబడే స్థితిలో ఉన్న విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు ఊపిరిపోసి రూ.11,400 కోట్లు కేంద్రం నిధులు కేటాయించేలా చేసుకున్నాం. ఉత్తరాంధ్ర వాసుల కల అయిన రైల్వేజోన్ సాధించాం. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు తీసుకొస్తున్నాం. బీపీసీఎల్, ఆర్సెలార్ మిట్టల్, నీమ్‌లో గ్రీన్ ఎనర్జీ ప్లాంట్స్, ఒర్వకల్లు, కొప్పర్తి ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటు చేసుకుంటున్నాం. లేపాక్షికొప్పర్తి కారిడార్ తీసుకొస్తాం. ఐటీలు 11 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఇ పార్కులు ప్రారంభించాం. త్వరలో అన్ని నియోజకవర్గాల్లో పార్కులు ఏర్పాటు చేస్తాం. కడపలో 27, 28, 29 తేదీల్లో మూడు రోజుల పాటు మహానాడు..

**మిగిలిన నామినేటెడ్ పదవులు త్వరలోనే భర్తీ చేస్తామన్న సీఎం చంద్రబాబు..**

రాజధాని పనుల పునఃప్రారంభ కార్యక్రమం విజయవంతంలో కార్యకర్తల కృషి అభినందనీయమని ముఖ్యమంత్రి అన్నారు.ప్రభుత్వం ఏ మంచి కార్యక్రమం చేసినా వైఎస్సార్సీ చౌకబారు విమర్శలు చేస్తోంది..తిప్పికొట్టండని శ్రేణులకు సూచించారు.

# పాక్‌కు భారత్ మరో ఝలక్

>> దించేశారు. దీంతో పాక్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌కు ఇక్కడ నుంచి నీటి సరఫరా నిలిచిపోయింది. ఇది స్వల్పకాల చర్యగా అక్కడి అధికారి ఒకరు వెల్లడించారు. దీంతో అవసరమైతే భారత్ కఠిన చర్యలు తీసుకోగలదని పాక్‌కు తెలియజేసినట్లైందని చెప్పారు. బాగ్ లిహార్ డ్యామ్‌ను 900 మెగావాట్ల జలవిద్యుత్తు ఉత్పత్తి నిమిత్తం చినాబ్ నదిపై 2008లో నిర్మించారు. డ్యామ్ పొడవు దాదాపు 145 మీటర్లు కాగా, సింధు జలాల ఒప్పందం కింద పాక్‌కు అత్యధిక వాటా నీళ్లు లభించిన నదుల్లో చినాబ్ కూడా ఒకటి. పంజాబ్ ప్రావిన్స్‌లో ఎక్కువగా పంటపొలాలు దీనిపై ఆధారపడి ఉన్నాయి. ఉగ్రదాడి జరిగిన తర్వాత ఏప్రిల్ 26న సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపేసింది. ఆ తర్వాత 29 నాటికే ఈ డ్యామ్ నుంచి పాకిస్థాన్‌కు వెళుతున్న జలాలు నిలిచిపోయినట్లు ఉపగ్రహ చిత్రాలు బయటకు వచ్చాయి. పాక్‌లోని సియాల్ కోట్ వద్దకు వచ్చేసరికి చినాబ్ పూర్తిగా ఎండిపోయింది. పాక్‌లోని పంజాబ్‌లో పత్తి, వరి సాగుకు ఈ నీరు చాలా ముఖ్యం. గత వారం జీలం నది వరద ప్రవాహం పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను భయపెట్టింది. అక్కడి ముజఫరాబాద్ సమీపంలో గత వారం జీలం నదిలో నీటి మట్టం ఒక్కసారిగా కొన్ని అడుగులు పెరిగిపోయింది. దీంతో స్థానిక అధికారులు హట్టియాన్ బాలా అనే ప్రాంతంలో ఎమర్జెన్సీ ప్రకటించాల్సి వచ్చింది.

**ఎయిర్‌చీఫ్‌తో ప్రధానిమోడీ ఎమర్జెన్సీ మీట్**

పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న తరుణంలో ప్రధాని నరేంద్ర మోడీ సైనికాధికారులతో వరుస భేటీలు నిర్వహిస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. తాజాగా ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ తో ప్రధాని భేటీ అయ్యారు. ఢిల్లీలోని ప్రధాని నరేంద్రమోదీ నివాసంలో ఈ సమావేశం జరిగింది. ఉగ్రదాడికి ప్రతిగా భారత సైన్యం తీసుకుంటున్న చర్యలపై ఈ సమావేశంలో చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఇదిలావుంటే ముందురోజు భారత నౌకాదళాధిపతి, అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠీ కూడా ప్రధానితో సమావేశమయ్యారు. ప్రధాని నివాసానికి వెళ్లి ఆయనను కలిశారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ కూడా రెండుసార్లు సమావేశమైంది. తొలి భేటీలో భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌కు సింధూ జలాల పంపిణీని నిలిపివేయాలని, ఉగ్రదాడికి ప్రతిగా ధీటైన జవాబు చెప్పాలని నిర్ణయించారు. రెండో భేటీలో ఉగ్రవాదులపై చర్యలు తీసుకునేందుకు త్రివిధ దళాలకు పూర్తి స్వేచ్ఛను ఇస్తున్నట్లు ప్రకటించారు. దాడి చేయాల్సిన లక్ష్యాలు, దాడి సమయం త్రివిధ దళాలే నిర్ణయిస్తాయని తెలిపారు. గతవారం యుద్ధ సన్నద్ధతలో భాగంగా ఉత్తరప్రదేశ్‌లోని గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై వాయుసేన యుద్ధ విమానాల ల్యాండిగ్, టేకాఫ్ విన్యాసాలను నిర్వహించింది. 2019లో పుల్వామా దాడికి ప్రతీకారంగా భారత వాయుసేన పాకిస్థాన్‌లోకి ప్రవేశించి దాడి చేసింది. నాటితో పోల్చుకొంటే రఫెల్ యుద్ధ విమానాలు, ఎస్400 ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలతో ఐఏఎఫ్ శక్తి గణనీయంగా పెరిగింది.

# 25 వేల ఉద్యోగాలు

>> అవసరమైన సేవలు అందుకుంటున్నారన్నారు. గతంలో నేను ప్రజల వద్దకు పాలన ప్రవేశపెట్టాను. ఇప్పుడు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వాట్సాప్ గవర్నెన్స్ తీసుకొచ్చి ప్రభుత్వ సేవలు అందిస్తున్నామని సిఎం చంద్రబాబు అన్నారు. ప్రపంచం వేగంగా మారుతోంది. ఈ పోటీ ప్రపంచంలో నూతన ఆవిష్కరణలు జరుగుతూనే ఉండాలి. ప్రతి ఒక్కరూ హార్డ్ వర్క్ కాకుండా స్మార్ట్ వర్క్ చేయాలి. కేవలం 25 ఏళ్లలోనే అమెరికన్ల కంటే రెండింతలు ఆదాయం సంపాదించింది మన తెలుగువారే అయినందుకు నాకు గర్వంగా ఉంది. నేనూ, ప్రధాని మోడీ, మిత్రులు పవన్ కల్యాణ్ ఆలోచించేది ఒకటే. మన రాష్ట్రం, దేశం బాగుండాలని. ప్రపంచంలో మనదేశం అగ్రస్థానంలో ఉంటే, దేశాన్ని నడిపించే శక్తి తెలుగుజాతికి ఇవ్వాలని ఆ భగవంతుణ్ని కోరకుంటున్నాను.గత ప్రభుత్వ పాలనతో రాష్ట్రం కళ తప్పిందన్నారుజ. గత ప్రభుత్వ పాలనలో ఆ ఐదేళ్లూ రాష్ట్రం కళ తప్పింది. అందరం కూర్చుని సంతోషంగా మాట్లాడుకునే పరిస్థితి లేదు. గడిచిన ప్రభుత్వం సృష్టించిన సమస్యలు నా సుదీర్ఘ రాజకీయ అనుభవంలో ఏనాడు చూడలేదు. అన్నీ చిక్కుముడులే. ఒక్కో చిక్కుముడిని విడదీస్తూ వ్యవస్థను సరిచేస్తున్నాం. ఈ ఏడాది రూ. 3.22 లక్షల కోట్ల బడ్జెట్ పెట్టాం. ప్రజల ఆదాయం పెరగాలి. తద్వారా జీవన ప్రమాణాలు పెరిగి అందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలి. మనం విశాలతతో ఆలోచించాలి. టెక్నాలజీని యువత అందిపుచ్చుకోవాలన్నారు. ఆనాడు నేను హైటెక్ సిటీ నిర్మించాను. ఐటీని ప్రమోట్ చేశాను. దీంతో వేలాది మంది ఐటీ నిపుణులు పుట్టుకొచ్చారు. వారంతా దేశ, విదేశాల్లో ఆర్థికంగా స్థిరపడ్డారు. వారి తల్లిదండ్రులు సంతోషంగా ఉన్నారు. అప్పుడు ఐటీ ప్రమోట్ చేశాను. ఇప్పుడు ఎఐ, క్వాంటమ్ వ్యాలీ గురించి మాట్లాడుతున్నాను. అలాగే ఆనాడు నేను సెల్ ఫోన్లను ప్రమోట్ చేస్తే దాన్ని కూడా కొందరు ఎగతాళి చేశారు. ఈరోజు సెల్ ఫోన్ లేకపోతే మనం ముందుకు వెళ్లలేని పరిస్థితి ఉంది. అయితే సెల్ ఫోన్‌ను సక్రమంగా వినియోగించుకుంటే జీవితంలో అనూహ్య మార్పులు వస్తాయి. వ్యసనంగా మారితే మాత్రం సమస్యలు వస్తాయి.పేదరిక లేని రాష్ట్రమే గమ్యం.అందుకే పీ4ను తీసుకుని వచ్చాను.ప్రపంచం మొత్తం అధ్యయనం చేసి పీ4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని సిఎం చంద్రబాబు తెలిపారు. ఇది డబ్బుతో పరిష్కారమయ్యేది కాదని మనస్సు పెట్టి పనిచేసి సమస్యను పరిష్కరించేదని చెప్పారు. సాయాజీరావు చేసిన సాయం అంబేద్కర్ ఎదుగుదలకు ఎలా ఉపయోగపడిందో మార్గదర్శిలు స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

ఇలా కొందరు గొప్ప వ్యక్తులుగా ఎదగడానికి వెనుకుండి దోహదపడిన వారు ఉన్నారని గుర్తుచేశారు. ఎన్టీఆర్ లేకుంటే తానూ సాధారణ వ్యక్తిగానే ఉండేవాడినని చంద్రబాబు పేర్కొన్నారు. ఆయన వద్ద నేర్చుకున్న క్రమశిక్షణ, పట్టుదలే తన ఎదుగుదలకు ఆదర్శమని వెల్లడించారు. పీ4 విధానం సరికొత్త చరిత్రకు శ్రీకారం అవుతుందన్నారు. రాష్ట్రాన్ని పేదరికం లేని ఆంధ్రప్రదేశ్‌గా మార్చేందుకే ఉగాది నాడు ఈ విధానానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. గత ఐదు దశాబ్దాలుగా రాజకీయరంగంలో తనను ఆదరిస్తున్న తెలుగు ప్రజలకే ఈ జీవితం అంకితం తప్ప వేరే ఆలోచనలు లేవని సీఎం స్పష్టంచేశారు. జనసంపద కొందరికే పరిమితం కాకూడదు. ప్రతి ఒక్కరికీ మెరుగైన జీవన ప్రమాణాలు అందినప్పుడు సమసమాజ స్థాపన సాధ్యమవుతుంది.

ఈ 9 నెలల్లో ఎన్డీఏ ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా పీపుల్స్ ఫస్ట్ నినాదంతోనే పాలన సాగిస్తున్నాం. ఓవైపు సంక్షేమం, అభివృద్ధి అందిస్తూనే మరోవైపు రాష్ట్రానికి పెట్టుబడులు తెస్తున్నాం. ఇప్పటి వరకూ అనుకున్న ఏ ప్రణాళిక విఫలం కాలేదు. అలాగే పీ4 కూడా విజయవంతమవుతుందనే నమ్మకం ఉంది. సమాజంలో ఉన్నతస్థాయిలో ఉన్న 10 శాతం మంది నిరుపేదలుగా ఉన్న 20 శాతం మందితో కలిసి పనిచేయడమే ఈ విధానం. ప్రజల్ని ఆస్తిగా తీసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత కావాలి. మట్టిలో మాణిక్యాల్ని అబ్దుల్ కలాంల్లా తయారు చేద్దాం. బంగారు కుటుంబాల జీవితాల్లో మార్పు తెచ్చే వరకూ నా ప్రయత్నాన్ని వదిలిపెట్టనుఅని చంద్రబాబు స్పష్టంచేశారు.

# రావిగుంటపల్లిలో పిడుగుపాటుకు వ్యక్తి మృతి

**రాపూరు (నెల్లూరు), మే 4, ప్రభాతవార్త :**రాపూరు మండలంలోని రావిగుంటపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం పిడుగుపాటుకు గురై తాటిబోయిన చిన్నయ్య(51),మృతి చెందాడు. మృతుడు గ్రామానికి సమీపంలోని అడవులలో గొర్రెలు మోపుతుండగా ఒక్కసారిగా వచ్చిన ఈదురుగాలులు, ఉరుములు,మేరుపులతో కూడిన గాలికి పిడుగుపడటంతో పిడుగు పాటుకు గురైనాడు.సహచర గొర్రెల కాపరుల సమాచారంతో చిన్నయ్య కుటుంబ సభ్యులు, సహచరులు అక్కడికి వెల్లి చూడగా చిన్నయ్య మృతి చెంది వున్నాడు. మృతునికి బార్య,కుమారుడు,కుమార్తె వున్నారు. నీరుపేద కుటుంబం అయిన మృతుని కటుంబాన్ని అదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# కడపలో మహానాడు

>> పలువురు నాయకులు పరిసరాలను పరిశుభ్రం చేసే కార్యక్రమానికి పూజ చేశారు. సుమారు 10 జేసీబీలను, ప్రొక్లెన్లను ఏర్పాటు చేసి స్థలాన్ని చదును చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ నెల 9వ తేదీన భూమి పూజ కార్యక్రమాన్ని ప్రారంభించి పనులను మొదలు పెట్టనున్నారు. నాలుగు లైన్ల రింగురోడ్డు కావడంతో ఎవరికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని అధికారులు పేర్కొన్నారు. సుమారు నగరానికి పది కిలోమీటర్ల దూరంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు గానీ మరే ఇతర సమస్యలు తలెత్తకుండా ఉండేందుకే ఈ ప్రాంతాన్ని ఎంపిక చేసినట్లు తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొన్నారు.

# ప్రపంచస్థాయి డిజైన్లతో 'అమరావతి'

>> రూపొందించిన డిజైన్లకు సంబంధించిన పద్ధతి, అలా ఎందుకు ఏర్పాటు చేశామనే అంశాలను మంత్రికి వివరించారు. దీనిపై మంత్రి మాట్లాడు తూ.. వీలైనంత త్వరగా వాటిని ఖరారు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గతంలో రాజధాని నిర్మాణానికి సంబంధించి మాకీ అసోసియేట్స్, నార్మన్ ఫోస్టర్స్, వాస్తుశిల్పి సంస్థలు ప్రణాళికలు రూపొందించాయి. వీటిల్లో తొలుత మాకీ అసోసియేట్స్ ప్లాను ఎంపిక చేశారు. అనంతరం వాటిని వద్దనుకున్నారు. తరువాత నార్మన్ ఫోస్టర్స్ రూపొందించిన ప్లానును ఆమోదించారు. ప్రస్తుతం అదే ప్లానును అమలు చేయాలని నిర్ణయించారు.రాజధాని .పునఃప్రారంభ పనులు మొదలైన నేపథ్యంలో ఆలస్యం చేయడానికి వీల్లేదని సూచించారు. అయితే ప్రస్తుతం ఉన్న ప్లాను నార్మన్ ఫోస్టర్స్ సంస్థ ఇచ్చిన నేపథ్యంలో వాటిని మెరుగుదల చేయడం, మరింత అధునాతనంగా రూపొందించే అంశంపై మంత్రి నారాయణ పలు సూచనలు చేశారు.

## వారం - వర్జ్యం

తేది : 05-05-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, శుక్ల పక్షం
అష్టమి ఉ.7.37
ఆశ్లేష మ.2.05
వర్జ్యం రా.3.00–తె.4.43
దు.మ.12.31–మ.1.22, 2) మ.3.04–3.55
రాహుకాలం – ఉ.7.30–9.00

## వార్తాఫలం

**మేషం:** ఉద్యోగాలు నిదానిస్తాయి. ఆకస్మిక ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి.

**వృషభం :** కొత్త ఋణ యత్నాలు చేస్తారు. బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు.

**మిథునం:** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఆరోగ్యంపట్ల మెలుకువ అవసరం.

**కర్కాటకం:** ఉద్యోగాలలో పనిభారం పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు.

**సింహం:** కొత్త వ్యక్తుల పరిచయాలు పెరుగుతాయి. పాతబాకీలు వసూలవుతాయి. వస్తువులు సేకరణ.

**కన్య :** వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.ఉద్యోగాలలో హోదాలు పొందుతారు. ఇంటా బయటా అనుకూలం.

**తుల :** దీర్ఘకాలిక సమస్యలు తీరి ఊరట చెందుతారు. అప్పుల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**వృశ్చికం:**నూతన పరిచయాలు విస్తరిస్తాయి. జీవిత భాగస్వామి నుండి ధనలాభం పొందుతారు. వాహనయోగం.

**ధనుస్సు:** వ్యాపారాలలో లాభాలు పొందుతారు. ఉద్యోగాలలో మరింత ఉత్సాహంగా సాగుతారు. వస్తులాభం.

**మకరం:**సన్నిహితులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి.

**కుంభం:** ఋబాధలు ఎదురై చికాకులు పెడతాయి. పనులలో జాప్యం జరిగినా నిదానంగా సాగుతాయి.

**మీనం:** గృహనిర్మాణ ఆలోచనలు నిదానంగా కార్యరూపం దాలుస్తాయి. వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు

>> రాయం లేకుండా చర్యలు చేపట్టామని అన్నారు. కూలిన చెట్లను వెంటనే తొలగించామని చెప్పారు. రేపు, ఎల్లుండి కూడా ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడతాయని అన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చెట్ల కింద నిల్చోవద్దని, వాహనాలు రక్షణగా ఉండే ప్రదేశాల్లో పార్కింగ్ చేయాలని చెప్పారు. వర్షాలు పడే సమయంలో తప్పని సరైతేనే ప్రజలు బయటకు రావాలని అప్రమత్తం చేశారు. కల్కెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఎవరికి ఎలాంటి ఇబ్బంది వచ్చినా కాల్ చేయాలని కలెక్టర్ లక్ష్మీశా సూచించారు.

ఇక అల్లూరి, అనకాపల్లి, శ్రీసత్యసాయి జిల్లాల్లో శనివారం పలుచోట్ల భారీ వర్షం కురిసింది. వర్ష బీభత్సవానికి పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. శ్రీసత్యసాయి జిల్లాలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో రెండు గంటలపాటు ఏకధాటిగా కుండపోత వర్షం పడింది. ఉరుములు, మెరుపులతో పలుచోట్ల పిడుగులు పడ్డాయి. అరకులోయ సహా పలు ప్రాంతాల్లో వానకు గాలి తోడైంది. రాజవొమ్మంగిలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎంపిడిఒ కార్యాలయం సమీపంలోని భారీ మామిడి చెట్టు పడి వ్యవసాయ శాఖ కార్యాలయ భవనం దెబ్బతింది. కొయ్యూరు మండలం కొమ్మిక పంచాయతీ కొత్త బొర్రంపేటలో ఈదురుగాలులకు ఇంటి పైకప్పులు ఎగిరిపోయాయి. అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలంలో భారీ వర్షానికి పలు గ్రామాల్లో రోడ్లు జలమయమయ్యాయి. నక్కపల్లిలో మోటమర్రి సత్రం వద్ద చెట్టు విరిగి షాపులపై పడింది. వైసిపి కార్యాలయంతోపాటు అక్కడ ఉన్న పలు దుకాణాలు దెబ్బతిన్నాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. రాజయ్యపేటలో విద్యుత్ స్తంభం, కొబ్బరి చెట్టు విరిగిపోయాయి. మాడుగుల మండలం ఘాట్‌రోడ్డు, పాడేరు వెళ్లే ప్రధాన రహదారిలో చెట్లు పడిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. శ్రీ సత్యసాయి జిల్లాలో వర్షం కన్నా విపరీతమైన ఈదురు గాలుల వల్ల ఎక్కువ నష్టం జరిగింది. బుక్కపట్నం, నల్లమాడ, ధర్మవరం, కదిరి మండలాల్లో సుమారు వెయ్యి ఎకరాల్లో మామిడి పంటకు నష్టం వాటిల్లింది. 22 ఎకరాల్లో అరటి చెట్లు నేలకు ఒరిగినట్లు అధికారులు తెలిపారు. భీమవరంలో ఉదయం నుంచి కుండపోతగా వర్షం కురుస్తోంది. భారీ ఈదురుగాలులకు పలు ప్రాంతాల్లో వృక్షాలు నేలకూలాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి పట్టణంలోని రహదారులు జలమయమయ్యాయి. ఉండి, భీమవరం, ఆకివీడు, కాళ్ల మండలాలల్లో ఆరబెట్టిన ధాన్యం రాసులు వర్షానికి తడిసి ముద్దమడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏలూరు జిల్లా పోలవరం, జంగారెడ్డిగూడెం నియోజకవర్గాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరపిలేని వర్షంతో జనజీవనం స్తంభించింది. రహదారులన్నీ జలమయమయ్యాయి. పోలవరం, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి, కొయ్యలగూడెం, జంగారెడ్డి టగూడెం మండలాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. వర్షాలతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో ప్రజలు వేసవితాపం నుంచి ఉపశమనం పొందారు. కోనసీమజిల్లాలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. అమలాపురం, అంబాజీపేట, అయినవల్లి, మామిడికుదురు, కొత్తపేట, పి.గన్నవరం మండలాల్లో జోరు వాన కురిసింది. వర్షం కురవడంపై కొబ్బరిరైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. అకాల వర్షానికి ధాన్యం తడవడంతో వరి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిప్రాంతాల్లో పొలాల్లో కోతకోసి ఆరబెట్టిన ధాన్యం తడవకుండా రైతులు పట్టలు కప్పుతున్నారు.



ఆదివారం ఎమ్మెల్యే బాలకృష్ణను సత్కరిస్తున్న అనిల్, నాగరాజు దంపతులు

# ఎమ్మెల్యే బాలకృష్ణకు సన్మానం

**హిందూపురం మే 4 ప్రభాతవార్త :** తెలుగు సినీ పరిశ్రమ దిగ్గజం, హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ పద్మభూషణ్ పురస్కారాన్ని అందుకున్న శుభ సందర్భంగా ఏర్పాటు చేసిన పౌర సన్మాన సభ సంబరాలు అంబరాన్ని అంటాయి. ఆదివారం స్థానిక ఎంజీఎం క్రీడా మైదానంలో సాయంత్రం ఆహ్లాదకరమైన వాతావరణంలో భారీ ఎత్తున ఏర్పాటు చేసిన వేడుకలను వీక్షించేందుకు నియోజకవర్గం నుంచి కాకుండా జిల్లా నలుమూలల నుంచి వేలాదిమంది నందమూరి అభిమానులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చారు. సాయంత్రం 7:40 గంటలకు వేదిక వద్దకు బాలయ్య, వసుంధర దేవి దంపతులు రాగానే ప్రాంగణమంతా జై బాలయ్య నినాదాలతో హోరెత్తించింది. బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శులు డాక్టర్ సురేంద్ర, శ్రీనివాస్ రావు, పిఏలు వీరయ్య, బాలాజీ లతోపాటు మున్సిపల్ ఛైర్మన్ రమేష్, మాజీ ఛైర్మన్ అనిల్ కుమార్, సీనియర్ నాయకులు గ్రీన్ పార్క్ నాగరాజు కార్యక్రమం నిర్వాహకులుగా సక్సెస్ అయ్యారు. ముఖ్య అతిథులుగా మంత్రి సవితమ్మ ఎమ్మెల్యేలు పరిటాల సునీత, పల్లె సింధూర రెడ్డి, కందికుంట వెంకటప్రసాద్, ఎంపీ పార్థసారథి, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు వడ్డే అంజనప్ప, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే ఈరన్న మొదలగు నాయకులు హాజరయ్యారు. మంత్రి సవితమ్మ మాట్లాడుతూ హిందూపురం ప్రజల దాహార్తి తీర్చిన బాలయ్య దేవుడు అని పొగడ్తలతో ముంచేత్తారు. బాలకృష్ణ సినిమాల్లో పంచ్ డైలాగులను పల్లె రఘునాథ్ రెడ్డి వేదికపై చెప్పడంతో బాలయ్య అభిమానులు కేరింతలు కొట్టారు. అనంతరం బాలకృష్ణ మాట్లాడుతూ తండ్రి ఎన్టీఆర్ మంచి స్ఫూర్తి పొంది సినీ, రాజకీయ రంగాల్లో ప్రజల ఆశీస్సులను పొందాలని అన్నారు. పద్మభూషణ్ అవార్డు తనకు రావడం తల్లితండ్రుల ఆశీర్వాదం అన్నారు. హిందూపురం అభివృద్ధికి తన వంతు కృషి ఎల్లప్పుడూ ఉంటుందని వివరించారు. తనపై అభిమానంతో నాయకులు ఇంత పెద్ద ఎత్తున పౌర సన్మాన సభ చేయడం పై అభినందనలు తెలియజేశారు. అనంతరం బాలయ్యను పెద్ద ఎత్తున పార్టీ నాయకులు కార్యకర్తలు సన్మానం చేశారు. హైదరాబాద్ శ్రేయ సంస్థ నేతృతంలో ఏర్పాటు చేసిన భారీ వేదికపై డాన్సర్లు బాలయ్య పాటలకు స్టెప్పులేసి అదరహో అనిపించారు. పలువురు సంగీత కళాకారులు అద్భుతమైన రీతిలో పాటలు ఆలపించి శభాష్ అనిపించుకున్నారు.

# టెలికమ్యూనికేషన్ బ్యూరో డైరెక్టర్‌గా రేవతి

>> మొదటి మహిళ శ్రీకాళహస్తికి చెందిన ఉపాధ్యాయురాలు కావటం విశేషం. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో రేవతికి గుర్తింపు రావటం శ్రీకాళహస్తికి గర్వకారణం అని పలువురు అభినందించారు. వివరాలు ఇలా ఉన్నాయి.తొట్టంబేడు మండలం చిన్నకనపర్తికి చెందిన కోడలు ఎం.రేవతి. భారత ప్రభుత్వం సారథ్యంలో రేడియో కమ్యూనికేషన్ శాఖలో అత్యున్నత స్థాయిలో విధులు నిర్వహిస్తున్నారు. తన ప్రతిభా పాటవాలతో అంచెలంచెలుగా ఎదిగిన రేవతి రెండేళ్ల క్రితం ఇండియా తరఫున ఇంటర్నేషనల్ రేడియో కమ్యూనికేషన్ సలహా కమిటి సభ్యురాలుగా ఎంపికయ్యారు. 136 దేశాలు మద్దతుతో రెండేళ్ల క్రితం ఎంపికైన రేవతి ప్రస్తుతం అరుదైన బ్యూరో డైరెక్టర్‌గా ఎంపికయ్యారు.

అంతర్జాతీయ స్థాయిలో మొట్టమొదటి సారిగా టెలికమ్యూనికేషన్ రంగంలో ఓ మహిళ డైరెక్టర్‌గా ఎంపికయ్యారు. ఈ గొప్పదనం భారత దేశానికి దక్కింది. అది కూడా శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రానికి చెందిన కోడలికి దక్కటం ముదావహం అని పలువురు ప్రశంసించారు.అత్యంత జనాభా కల్గిన ఆసియా,ఆఫ్రికా,ఆస్ట్రేలియా ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించే అరుదైన అవకాశం అందుకున్న మొట్టమొదటి మహిళ శ్రీకాళహస్తికి చెందిన వారు కావటం ఈ ప్రాంతంలోని ప్రతిభకు నిదర్శనంగా చెప్పవచ్చు. రేవతి టెలిస్పక్టమ్ సాటిలైట్ అర్బిటర్ మేనేజ్‌మెంట్ విభాగంలో సుమారు 30 సంవత్సరాలుగా విశేష సేవలందిస్తున్నారు.ఆమెకు శివయ్య ఆశీర్వదంతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రావటం శివయ్య ప్రసాదంగా చెబుతున్నారు.

## రాహుల్ గాంధీని హిందూమతంనుంచి బహిష్కరిస్తున్నాం.. బద్రీనాథ్ స్వామీ అవిముక్తేశ్వరానందజీ సంచలనం

**డెహ్రాడూన్, మే 4:** కాంగ్రెస్ నాయకుడు రాయ్‌బరేలి ఎంపి రాహుల్‌గాంధీ శ్రీరాముడిపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఈక్రమంలో జ్యోతిర్మఠానికి చెందిన శంకరాచార్య స్వామి అవిముక్తేశ్వరానంద సరస్వతి సంచలన ప్రకటనచేసారు. రాహుల్ గాంధీ ఇకపై హిందూ మతంలో భాగం కాదని అన్నారు. ఆతడిని హిందూ మతంనుంచి బహిష్కరిస్తామని ప్రకటించారు. బద్రీనాథ్‌లోని శంకరాచార్య ఆశ్రమంలో స్వామి అవిముక్తేశ్వరానంద మాట్లాడుతూ రాహుల్‌గాంధీ నిత్యం హిందువుల మనోభావాలు దెబ్బతీసేవిధంగా వ్యాఖలుచేస్తున్నారని, మనుస్మృతికి సంబంధించి రాహుల్‌గాంధీ పార్లమెంటులోచేసిన ప్రకటన సనాతన ధర్మ అనుచరులందరినీ బాధకు గురిచేసిందన్నారు.

# భూసేకరణ సర్వే

>> పూర్తిస్థాయిలో ఎయిర్‌పోర్ట్ నిర్మాణంకు సిఎం చంద్రబాబు అంగీకరించారు. దీంతో గతంలో సేకరించిన ఎయిర్‌పోర్టు భూములకు అదనంగా మరో 600 ఎకరాల భూసేకరణ చేసి పూర్తిస్థాయి ఎయిర్‌పోర్ట్ నిర్మాణం చేపట్టడంతో పాటు ఇక్కడే విమానాల మరమ్మత్తుల కేంద్రం ఏర్పాటుకు సైతం ప్రభుత్వం తగు చర్యలు చేపడుతోంది. ప్రస్తుతం ఓ పక్క రెవెన్యూ మరో పక్క ఆర్అండ్‌బి అధికారులు భూముల్ని గుర్తించి సర్వే పనుల్లో నిమగ్నమవుతున్నారు. సుమారు 1100–1200 ఎకరాల విస్తీర్ణంలో కుప్పం ఎయిర్‌పోర్టును నిర్మించనున్నారు. శనివారం రాష్ట్ర ఉన్నతాధికారి ఎయిర్‌పోర్ట్ ప్రతిపాదిత స్థలాలను స్థానిక అధికారులతో కలసి పరిశీలించారు. ప్రతిపాదిత భూములను సమీప గ్రామాల ప్రజలు ఇబ్బంది పడకుండా భూసేకరణకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారని తెలిసింది. భూసేకరణ సాధ్యాసాధ్యాలపై త్వరగా నివేదిక అందించాలని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. అవసరమైన రోడ్ల నిర్మాణంపై కూడా చర్చించినట్లు తెలిసింది. ఏది ఏమైనా సాధ్యమైనంత త్వరగా ఎయిర్‌పోర్ట్ నిర్మాణంకు అవసరమైన భూములు సేకరించి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఎఐ) అనుమతులు రాగానే కుప్పంలో ఎయిర్‌పోర్టు నిర్మాణపనులు ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

# ఒక్కచోటే మూడు ప్రమాదాలు

>> ప్రకాశం జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్ ప్రమాద కారణాలపై ఆరా, రోడ్డు ప్రమాదాల నివారణపై పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. వాహన చోదకులు వేగ పరిమితుల పట్ల జాగ్రత్త వహించి వాహనాలను నడపాలని, రహదారి భద్రత సూత్రాలను పాటిస్తూ సురక్షితంగా, క్షేమంగా గమ్యానికి చేరుకోవాలని ఎస్పీ కోరారు. ఎన్‌హెచ్–16 నేషనల్ హైవే కొప్పోలు ఫ్లైఓవర్ బ్రిడ్జి ఒంగోలు నుండి నెల్లూరు వైపు మార్గంలో ఆదివారం తెల్లవారుజామున మూడు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మరణించడం అత్యంత బాధాకరంగా ఉందని ఎస్పీ తెలిపారు. ఈ ప్రమాదం చాలా దురదృష్టకరమని మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదం జరిగిన తీరు, కారణాలను పరిస్థితిని నిశితంగా సమీక్షించి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకోవడానికి సమగ్ర విచారణ జరుపుతామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ దామోదర్, ఒంగోలు ఉప రవాణా కమీషనర్ సుశీల అన్నారు. కొప్పోలు నేషనల్ హైవే మీద ఆగి ఉన్న లారీని వెనుక వస్తున్న కోడిగుడ్ల లారీ ఢీకొనడంతో లారీ తిరగబడిన ప్రమాదంలో ముగ్గురు మరణించారని, అదే మార్గంలో సుమారు 500 మీటర్ల సమీపంలో ఆగి ఉన్న కారు, ట్రాక్టర్‌ను అదే మార్గం వైపు నుండి వెళ్తున్న లారీ రెండింటిని ఢీకొనగా ఎటువంటి ప్రమాదం జరగలేదని, సుమారు 500 మీటర్ల సమపంలో అదే మార్గంలో ఆగి ఉన్న కారును, నెల్లూరు వైపు వెళ్తున్న కారును వెనుక ఉన్న లారీ బలంగా ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు మరణించగా ఒకరికి తీవ్ర గాయాలు అయ్యాయని ఎస్పీ తెలిపారు. గాయపడిన వారిని అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్ సంఘమిత్ర ఆసుపత్రికి పంపించడం జరిగింది. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. రెండు కిలోమీటర్ల వరకు ట్రాఫిక్ జామ్‌ను ప్రొక్లెన్‌ల సహాయంతో త్వరితగతిన చర్యలు చేపట్టి ట్రాఫిక్ క్లియర్ చేశారని ఎస్పీ తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ అడ్మిన్ కే.నాగేశ్వరరావు, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఒంగోలు తాలూకా సీఐ అజయ్‌కుమార్, ఒంగోలు ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, గిద్దలూరు సీఐ సురేష్, నేషనల్ హైవే అధికారులు, ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.

05-5Pg3FB.qxd:05-5Pg3FB.qxd 05/05/25 12:54 AM Page 1





# డిప్యూటీ స్పీకర్‌పై చర్యలు తీసుకోండి

### సీఎం చంద్రబాబుకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు బహిరంగ లేఖ

**విజయవాడ,మే4,ప్రభాతవార్తప్రతినిధి:** పశ్చిమ గోదావరి జిల్లా ఉండి నియోజకవర్గంలో డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే కె.రఘురామకృష్ణం రాజుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆదివారం బహిరంగలేఖ రాశారు. కె.రఘురామకృష్ణంరాజు ఆదేశాలు, ప్రోద్బలంతో పేదలకు ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్ళను, చిన్నదు కాణాలను బుల్డోజర్లతో తొలగించటం. పాలకోడేరు అల్లూరి సీతారామరాజు నగర్ పేదలపై, మహిళలపై మగపోలీసుల బలప్రయోగాన్ని ప్రదర్శించటంపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజకవర్గం పాలకోడేరు, ఆకివీడు, ఉండి, కాళ్ల మండలాలు కలిగి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్థానిక ఎమ్మెల్యేకె.రఘురామకృష్ణంరాజు ప్రోద్బలంతో ప్రారంభంలో ఆకివీడు మండలంలో 355, పాలకోడేరు మండలంలో 165, కాళ్ల మండలంలో 100 మొత్తం 700 పైగా పేదల ఇళ్లను, ఉండిలో చిన్న దుకాణాలు అక్రమంగా కూల్చేశారు. నియోజకవర్గంలో ఇంకా పెద్దసంఖ్యలో కూల్చడానికి పేద ప్రజలకు నోటీసులు కూడా ఇచ్చియున్నారు. మే 15లోగా అన్ని ఇళ్ల కూల్చేస్తామని బహిరంగంగా ప్రకటించారు. ప్రభుత్వం పట్టాలు ఇచ్చిన ఇళ్లను సైతం కూల్చేస్తామనడం చాలా అన్యాయం అమానుషం. అందరికీ ఇళ్ళు ఇస్తామని చెబుతున్న ప్రభుత్వ నిర్ణయానికి, స్ఫూర్తికి ఇది పూర్తి విరుద్ధం.

# అభివృద్ధిని అటకెక్కించిన గత ప్రభుత్వం: మంత్రి నారాయణ

**నెల్లూరు, మే 4, ప్రభాతవార్త-వైద్యం:** వ్యక్తులపై అక్రమ కేసులు బనాయించడంపై పెట్టిన శ్రద్ధతో పదోవంతు దృష్టి కూడా విద్యాలయాలపై వైసీపీ ప్రభుత్వం పెట్టలేదని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు. ఐదేళ్ల పాటు సాగిన జగన్ సర్కార్ అస్తవ్యస్థ పాలనతో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా తయారైందన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో మూతపడ్డ వీఆర్ హైస్కూల్‌ని ఆధునీకరించి నిరుపేద విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తామన్నారు. ఆదివారం సాయంత్రం మంత్రి నారాయణ వీఆర్‌సీ పాఠశాల పునర్నిర్మాణ పనులను కమీషనర్ నందన్‌తో కలిసి పరిశీలించారు. అన్ని తరగతి గదులను పరిశీలించి తగు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ విద్యార్థుల ఆటపాటలకు అనుకూలంగా గ్రౌండ్‌లో ఉన్నటు వంటి పాత శిధిలమైన భవనాలను తొలగించి మైదానాన్ని నిర్మించాలని ఆదేశించామన్నారు. నెల్లూరు నగర బొడ్డులో మూడు షిఫ్టుల్లో 8 వేలకు పైగా విద్యార్థులు



ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

చదువుకున్న ప్రతిష్టాత్మక కాలేజీని గత ప్రభుత్వ నిర్వాహకులు నిర్వీర్యం చేశాన్నారు.

గత ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విధంగా పాఠశాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి నగరంలోని పేదలు, నిరుపేదలకు ఉన్నత స్థాయి విద్యను అందిస్తామన్నారు. ఎన్ఎంసీ కంపెనీ ఆధ్వర్యంలో పునర్నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. అన్ని పనులు అనుకున్న విధంగా పూర్తి చేసి వచ్చే విద్యాసంవత్సరం పాఠశాలలు ప్రారంభించే నాటికి పూర్తి స్థాయిలో సిద్ధం చేస్తామన్నారు. మొదటి సంవత్సరంలో వేయి మంది పేదలకు అడ్మిషన్స్ కల్పిస్తామని, ఉచిత బస్సు, భోజన వసతితో పాటు సాయంకాలం ఆటపాటల అనంతరం స్నాక్స్ అందించి వారి ఇళ్ల వద్ద దించుతామన్నారు. ఆ విధంగా వచ్చే విద్యాసంవత్సరం పేదల అడ్మిషన్లు రెండు వేలకు పెంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీ జడ్పీటీసీ విజేతారెడ్డి, నగర టీడీపీ అధ్యక్షులు మామిడాల మధు, స్థానిక కార్పొరేటర్లు, టీడీపీ నేతలు, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# అమ్మవారి అండదండలతో రాష్ట్రాభివృద్ధి: మంత్రి ఆనం



**వరికుంటపాడు (నెల్లూరు), మే 4, ప్రభాతవార్త** మండలంలోని పెద్దిరెడ్డిపల్లి గ్రామంలో నూతనంగ అత్యంత ప్రతిష్టాత్మకంగ నిర్మించిన అంకాళమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి,నెల్లూరు పార్లమెంటుసభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి,ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్,కనిగిరి శాసనసభ్యుడు ఉగ్ర నరసింహారెడ్డి,ఎంఎల్‌సిలు బీదా రవిచంద్ర,కంచర్ల శ్రీకాంత్‌లు అమ్మవారి సన్నిధికి చేరుకొని గ్రామ దేవత అంకాళమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేకపూజలు నిర్వహించారు.గ్రామ పెద్దలు,పురోహితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.అనంతరం గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అదే గ్రామంలో విపిఆర్ అమృతధారలో భాగంగ విపిఆర్ ఫౌండేషన్ ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంటును మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి,ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి,ఎంఎల్ఎలు కాకర్ల సురేష్,ఉగ్ర నరసింహారెడ్డి,ఎంఎల్‌సిలు బీదా రవిచంద్ర, కంచర్ల శ్రీకాంత్‌లు ప్రారంభించారు. అనంతరం మహిళలకు బిందెలతో నీటినిఅందజేశారు. ఈకార్యక్రమంలో మాజి ఎంఎల్ఎ కంభం విజయరామిరెడ్డి,మాజి ఎంఎల్ఎ కొమ్మి లక్ష్మీనాయుడు,మండలపార్టి కన్వీనర్ చంద్ర మధుసూదన్‌రావు,మాజి జట్‌పి చైర్మన్ చెంచల్‌బాబుయాదవ్, నాయకులు ముజ్జె లక్ష్మీనారాయణ,నాదెండ్ల రాజేంద్ర, పోలు బోయిన శ్రీకాంత్‌యాదవ్, ఎంఎల్ఎ పొలిటికల్ మేనేజర్ మాలేపాటి చైతన్య, కాకర్ల వెంకట్,జట్‌పిటిసి రావెళ్ళ నాగేంద్ర,వివిధ గ్రామాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

# ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

### వాల్ పోస్టర్స్ విడుదల చేసిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్ర బాబు

**విజయవాడ,మే4,ప్రభాతవార్తప్రతినిధి:** నరేంద్రమోదీ అధికారంలోకి వస్తే ప్రతి ఏటా 2కోట్ల ఉద్యోగాలు ఇస్తానని బీజేపీ ఎన్నికల ముసాయిదాలో ప్రకటించి మోసగించారని అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్ర బాబు అన్నారు. ఈ సందర్భంగా పరుచూరి రాజేంద్ర బాబు, మాట్లాడుతూ యువతను అన్ని రకాలుగా మోసం చేస్తున్న పాలకులపై ఉద్యమించడానికి ఈ మహాసభలు వేదిక కానున్నాయని వారు తెలిపారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 17వ జాతీయ మహాసభల వాల్ పోస్టర్స్‌ను రైతు పేట చంద్ర రాజేశ్వర రావు భవన్ నందు విడుదల చేసారు,మోదీ మూడో సారి అధికారంలోకి వచ్చినా ఇప్పటికి ఆ హామీ అమలు కాలేదని, తాను చెప్పిన ఏటా 2 కోట్ల ప్రకారం ఇప్పటికి 12సంవత్సరాల కాలంలో 24కోట్ల ఉద్యోగాలు భర్తీ కావాలని,



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్ర బాబు తదితరులు

మోడీ మాటలన్నీ నీటి మూటలేనని వారు ఎద్దేవా చేశారు. ఈ నేపథ్యంలో మోడీ ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని బలవంతంగా దేశంలో మత ఉన్మాదం అనే కాషాయ విష బీజాలను విద్యార్థులు, యువత మెదలల్లో చొప్పించడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాడని ధ్వజమెత్తారు.దేశంలో ఎన్నికల సంస్కరణలు జరగాలని, సామాజిక న్యాయం కొరకు ఉద్యమించాలని, భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించి, అమలుచేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐయస్ఎఫ్ రాష్ట్ర నాయకులు ఉప్పుటూరి అరుణ్ కుమార్, ఎఐవైఎఫ్ నాయకులు ఎం. ఈశ్వరాచారి, విష్ణు, మనోజ్ లు పాల్గొన్నారు.

# చికిత్స పొందుతూ మహిళ మృతి

**నెల్లూరు క్రైమ్, మే 4, ప్రభాతవార్త :** స్థానిక బుజబుజ నెల్లూరులో విజయ్ అనే దుండగుడు కత్తితో దాడి చేసిన ఘటనలో మహిళ చికిత్స పొందుతూ ఆదివారం మరణించారు. వివరాల్లోకి వెళితే బుజబుజ నెల్లూరుకు చెందిన మాబున్నీసా తన పిల్లలతో కలిసి వెళుతున్న సందర్భంలో అదే ప్రాంతానికి చెందిన విజయ్ అనే వ్యక్తి కత్తితో దాడికి దిగాడు. ఈ క్రమంలో తీవ్ర గాయాల పాలైన మాబున్నీసాను స్థానికులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం ఆమె మృతి చెందారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న వేదయపాలెం పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# చిత్తూరులో భారీ వర్షం

### ఎండ నుండి ప్రజలకు ఉపశమనం

**చిత్తూరు రూరల్, మే 4 ప్రభాతవార్త:** చిత్తూరు, దాని పరిసర ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం 3 గంటల నుండి భారీ వర్షం కురిసింది. గత నెల రోజులుగా తీవ్ర ఎండలతో ఉక్కిరి బిక్కిరి అయిన ప్రజలకు ఈ వర్షం ఉపశమనం కల్పించింది. మార్చి నెల మధ్య నుండి జిల్లాలో భారీ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఎండలు తీవ్రంగా వుండటంతో గత నెల రోజుల నుండి ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ప్రజలు రోడ్లపై కన్పించడం లేదు. ఈ పరిస్థితుల్లో ఆదివారం ఒక్కసారిగా ఒక ఒక గంట పాటు ఓ స్థాయిలో వర్షం కురవడంతో ప్రజలకు ఎండల నుండి భారీ ఉపశమనం కల్గించినట్లైంది. ఈ వర్ష సమయంలో చిత్తూరు, దాని పరిసర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఈదురు గాలులు వీచాయి. చిత్తూరు కొంగారెడ్డిపల్లి గాండ్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ వర్షానికి పెద్ద చెట్టు నేల కూలింది. చిత్తూరు నగర పరిధిలోని కొన్ని ప్రధాన రోడ్లలో చిన్న చెట్లు నేల కూలడంతో ట్రాఫిక్‌కు కొంత అంతరాయం ఏర్పడింది. చిత్తూరు పరిసర ప్రాంతాలైన యాద మరి, బంగారుపాళ్యం, గుడిపాల,



కొంగారెడ్డిపల్లి గాండ్లపల్లి పాఠశాల వద్ద కూలిన చెట్టు

తవణంపల్లి మండలాల్లో సైతం ఓ మోస్తరు వర్షం కురవడంతో అక్కడి ప్రజలు ఎండల నుండి ఉపశమనం పొందారు. చిత్తూరు పరిసర ప్రాంతాల్లో సైతం పెద్ద ఎత్తున గాలులు వీయడంతో మామిడి పంటకు తీరని నష్టం వాటిల్లింది. ఇప్పటికే పంట సరిగా లేదని బాధపడుతున్న రైతులకు ప్రస్తుత ఆకాల వర్షంతో మరింత నష్టం కలుగనుంది.

# భారీ వర్షంతో ఘాట్‌రోడ్డు మూసివేత

**ఇంద్రకీలాద్రి, మే 4, ప్రభాతవార్త:** దుర్గమ్మవారి ఆలయానికి చేరుకునే భక్తుల భద్రతా దృష్ట్యా ఘాట్‌రోడ్డును ఆదివారం మూసివేశారు. ఈ సందర్భంగా భక్తులను కనకదుర్గానగర్ నుండి రాకపోకలు సాగే చర్యలను ఇఓ కె రామచంద్ర మోహన్ తీసుకున్నారు.

**దుర్గమ్మ భక్తుల భద్రతలో లోటుపాట్లు లేవు: స్పష్టం చేసిన ఇఓ:** దుర్గమ్మవారి ఆలయంలో అమ్మవారిని దర్శించుకునే భక్తులు, మహిళా సెక్యూరిటీ సిబ్బంది భద్రతకు ఎటువంటి లోటు పాట్లు లేవని ఇఓ కె రామచంద్రమోహన్ స్పష్టం చేశారు. దేవస్థానంలో విధి నిర్వహణలో వున్న మహిళా సెక్యూరిటీగార్డు ఉదంతంలో భాగంగా పోలీస్‌స్టేషన్లో కంప్లైంట్ ఇచ్చామన్నారు. ఈ సంఘటనపైప్రాథమిక విచారణ చేశామన్నారు.

**దుర్గమ్మవారి ఆలయంలో భక్తుల రద్దీ:** దుర్గమ్మ దర్శనానికి ఆదివారం సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఆలయంలో జరిగే నిత్యపూజలు, శాంతి కళ్యాణం,



చండీహోమం, లక్షకుంకుమార్చన తదితర ఆర్జిత సేవల్లో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు త్వరితంగా దర్శనమయ్యేలా ఇఓ చర్యలు తీసుకున్నారు.

**జగన్మాతకు నృత్యకళార్చన:** సనాతన ధర్మప్రచారం, లలిత కళలకు ప్రోత్సాహం అందించేందుకు సకల కళలకు ఆరాధ్యదేవత ఆదిపరాశక్తి, జగన్మాత శ్రీ కనకదుర్గమ్మవారి సన్నిధిలో ఆదివారం నూతన రాజగోపుర ప్రాంగణంలో కూచిపూడి నృత్య ప్రదర్శనతో నృత్య కళార్చన నిర్వహించారు. బెంగుళూరుకు చెందిన నృత్యగురువు మునిపల్లి మహతి ఆధ్వర్యంలో విద్యార్థులు 19 మంది లయబద్ధంగా నృత్య ప్రదర్శన చేసి భక్తుల మన్ననలందుకున్నారు. వారికి శ్రీ దుర్గమ్మ వారి దర్శనం ఏర్పాట్లు చేసి, ప్రసాదం, మెమొంటోలు అందించారు. వేదాశీర్వచనాలందించారు.

# ఆఫీసులో అసాంఘిక కార్యకలాపాలు

### టూరిజం ఉద్యోగి తీరుపై విమర్శలు

**విజయవాడ,మే4,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలోని ఓ ప్రభుత్వ కార్యాలయాన్ని తన అవాంఛనీయ వ్యక్తిగత అవసరాల కేంద్రంగా ఒక ఉద్యోగి మార్చుకున్నాడు. పనివేళలు పూర్తయ్యాక ఆఫీసుకు తాళం వేసి అందరూ ఇంటికి వెళ్లిపోయిన తర్వాత సదరు ఉద్యోగి తిరిగి ఆఫీసుకు వచ్చాడు. వస్తూ ఓ యువతిని తీసుకుని వచ్చేవాడు. బహుశా అతను పనిమీద ఆఫీస్ వచ్చేవాడనుకునే వారు వాచ్‌మెన్‌లు, అయితే ఈ విషయాన్ని నిత్యకృత్యం చేసాడతను.తన వెంట వచ్చేమహిళతో కలిసి అదేపనిగా రావడం వారికి అనుమానం కలిగించింది.ప్రతి రోజు ఇద్దరూ లోపలికి వెళ్లి కొద్ది సమయం తర్వాత తిరిగి బయటకు వచ్చారు. ఆపై ఆఫీసుకు తాళం వేసి వెళ్లిపోయాడు. ఈ ఘటన విజయవాడ టూరిజం డివిజనల్ ఆఫీసులో చోటు చేసుకుంది. ఈ విషయం తీవ్ర అనుమానాలకు దారితీసింది. టూరిజం డివిజనల్ ఆఫీసులో కీలక ఉద్యోగి కావడంతో తనను అడిగే వారు లేరనే ధైర్యమో లేక మరేమిటో కానీ మహిళతో దర్జాగా తన ఇంట్లోకి వెళ్లినట్లు ఆఫీసు తాళం తెరిచి లోపలికి వెళ్లడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారం సదరు డిపార్టుమెంట్‌లో కలకలం రేపింది. కార్యాలయం ప్రవేశ ద్వారంలో, లోపలా అమర్చిన సీసీటీవీ కెమెరాల్లో సదరు ఉద్యోగి నిర్వాకం రికార్డైంది. దీనిపై విచారణకు ఆదేశించామని, నివేదిక అందగానే సదరు ఉద్యోగిపై చర్యలు తీసు కుంటామని ఉన్నతాధికారులు వివరించారు. అయితే సదరు ఉద్యోగి చేసిన పని ఇప్పుడు ఆ శాఖలో కలకలం రేపింది.సదరు ఉద్యోగి ఒక్కరేనా ఇంకా ఎవరైనా ఇలా చేస్తున్నారా అనేసందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

# మల్లన్న క్షేత్రంలో భక్తుల రద్దీ

**శ్రీశైలంప్రాజెక్టు,మే4,ప్రభాతవార్త:** అష్టదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలం మహాపుణ్య క్షేత్రం ఆదివారంనాడు భక్తులతో క్యూలైన్లన్నీ రద్దీని తలపించాయి.భక్తులు పెద్ద సంఖ్యలో శ్రీశైలంకు తరలివచ్చారు.ఈక్రమంలోనే శ్రీశైలం రహదారులన్ని వాహనాలతో కిక్కిరిసి పోయాయి.అదే విధంగా శ్రీశైలంకు చేరుకున్న భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో ముందుగా తమ మొక్కులను తీర్చుకునేందుకు పాతళగంగలో పుణ్యస్నానాలు అచరించి తలనీలాలు సమర్పిస్తూ తదుపరి శ్రీస్వామిఅమ్మవార్ల దర్శనం కోరకు క్యూలైన్ల వద్దకు చేరుకుంటున్నారు. మల్లన్న దర్శన బాగ్యం కోరకు వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా దేవస్థానం కార్య నిర్వహణాదికారి యం.శ్రీనివాసరావు ఏర్పాట్లపై అధికారులను ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకున్నారు.



# తిరుమల సమాచారం

## ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.1.50 కోట్ల విరాళం

**తిరుమల, మే 4, ప్రభాతవార్త ప్రతినిధి:** బెంగుళూరుకు చెందిన సుయుగ్ వెంచర్స్ ఎల్ఎల్పీ సంస్థ చైర్మన్ యతీష్ సూరినేని ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు ఆదివారం రూ.1.50 కోట్లు విరాళంగా అందించారు. తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఉదయం చైర్మన్ బీ.ఆర్. నాయుడుకు విరాళం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా దాతను చైర్మన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇఓ లోకనాథం, పేష్కార్ రామకృష్ణ పాల్గొన్నారు.



## తిరుమలలో విశ్రాంతి భవనాలకు భగవంతుడి పేర్లు

**తిరుమల, మే 4, ప్రభాతవార్త ప్రతినిధి:** పరమ పవిత్రమైన తిరుమల పుణ్యక్షేత్రంలో ఆధ్యాత్మిక శోభ మరింత ఉట్టిపడేలా, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తీసుకుంటున్న నిర్ణయాలు ఒక్కొక్కటిగా కార్యరూపం దాల్చితున్నాయి. అందులో భాగంగా తిరుమలలోని పలు గెస్ట్ హౌస్‌లకు దాతలు తమ స్వంత పేర్లు పెట్టుకొని ఉండటాన్ని చైర్మన్ తీవ్రంగా వ్యతిరేకించారు. తిరుమలలో ఎదైనా సరే భగవంతుని నామంతో ఉండాలని, గోవిందా నామ స్మరణ మాత్రమే వినబడాలని, దాతల నిర్మించిన టీటీడీకి ఇచ్చిన విశ్రాంతి భవనాల్లో 42 వాటికి దాతల సొంత పేర్లు ఉన్నాయి. వెంటనే వాటిని మార్చాలని గత డిసెంబర్ నెల 24వ తేదీ జరిగిన పాలకమండలి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. భగవంతుడికి సంభందించి 75 పేర్లను సూచించి, వాటిలో ఎదైనా ఒకటి గెస్ట్ హౌస్‌కు పేరుగా పెట్టుకోవాలని బోర్డు అదేశించింది. ఈ మేరకు 42 గెస్ట్ హౌస్‌లకు పేర్లు మారాయి. జిఎంఆర్ విశ్రాంతి భవనానికి ఆనంద నికేతనం, మాగుంటనిలయంకు, రాఘవ నిలయం, మైహోమ్ పద్మాప్రియకు పద్మాప్రియ నిలయం, సుధాకృష్ణ నిలయంకు, వైకుంఠ నిలయం, శ్రీరచన కు విధాత నిలయం, పాండవ విశ్రాంతి భవనంకు విరజా నిలయంగా పేర్లు మార్పుచేసారు దాతలు. ఇకపై నిర్మాణాలు జరిగే ఏ కార్యాలయమైనా, విశ్రాంతి భవనమైనా, భగవంతుడి నామాలతోఉండాలని చైర్మన్ అధికారులకు సూచించారు.

## యోగాలో జాతీయ స్థాయి అవార్డు సాధనే లక్ష్యం

### తిరుమల ఆలయం ముందు కాకినాడ చిన్నారి యోగాసనాలు



**తిరుమల, మే 4 ప్రభాతవార్త ప్రతినిధి:** జాతీయ స్థాయిలో అవార్డు సాధించాలనేది తన లక్ష్యమని కాకినాడకు చెందిన రేఖాడు చైత్ర వాసుకి పేర్కొంది. ఆదివారం తిరుమలలో శ్రీవారి దర్శనం అనంతరం ఆమె ఆలయం ముందర యోగాసనాలు వేసి ఆకట్టుకుంది. ఈసం దర్భంగా వాసుకి మాట్లాడుతూ తాను జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని రాణించాలని అందుకు స్వామివారి ఆశీస్సులు కోరినట్లు తెలిపింది. ఇదివరకే తాను 300కుపైగా యోగాసనాల్లో శిక్షణ పొందానని, ఎన్నో యోగా కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు చెప్పింది. తమ పాఠశాల ఉపాధ్యాయుడు యోగాలో తనకు ఆదర్శమని తెలిపింది. తన తల్లిదండ్రుల ప్రోత్సాహం యోగాలో మరింత ముందుకు సాగే దిశగా తీసుకెళ్లిందని పేర్కొంది.

# తిరుపతిలో గాలివాన బీభత్సం

### నేలకూలిన వృక్షాలు.. విరిగిన విద్యుత్ స్థంభాలు

### రెండుకార్లు.. నాలుగు టు వీలర్లు ధ్వంసం, భారీ నష్టం

**తిరుపతి, మే 4 ప్రభాతవార్త ప్రతినిధి:** మండే ఎండలకు ఉపశమనంగా ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా గాలివాన భీభత్సం సృష్టించింది. ఎండలనుంచి వరుణదేవుడు కరుణించాడని జనం సంబర పడేలోపు తిరుపతి నగరంలో చాలాచోట్ల గాలిధాటికి భారీ చెట్లు నేలకూలాయి. వాటికి అనుబంధంగా ఉన్న విద్యుత్ స్థంభాలు విరగడం, నేలవాలడంతో విద్యుత్ వేర్లు తెగి కిందకుపడ్డాయి. దీంతో ఒక్కసారిగా నగరంలోని అనేక కాలనీలు చీకటిమయంగా మారాయి. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో మొదలైన బలమైన వానకు గాలి తోడైంది. దీంతో గంట సమయం కురిసిన వానకు, ఈదురుగాలుల ధాటికి భారీగానే నష్టం వాటిల్లింది. ప్రధాన ప్రాంతం పెద్ద కాపు లేఔట్, గంగమ్మగుడి, డిఆర్ మహల్, కర్నాల వీధి, దొడ్డాపురం వీధి, టాటా నగర్ తదితర ప్రాంతాల్లో చెట్లు కూలాయి. దీంతో ఆయా చోట్ల కార్లు, స్కూటర్లు భారీగా ధ్వంసమయ్యాయి. వెంటనే విద్యుత్ అధికారులు సరఫరా నిలిపేశారు. మధ్యాహ్నం 1గంటనుంచి రాత్రి 11గంటల దాకా చెట్లు తొలగించడం, విద్యుత్ స్థంభాలు నుంచి లైన్లు పునరుద్ధరణ కాలేదు. అర్థరాత్రి దాకా తిరుపతి నగరంలో అనేక ప్రాంతాలు, కాలనీలు చీకట్లో అలమటించాయి. భారీగా కూలిన చెట్లను తొలగించేందుకు నగర పాలక సంస్థ కమీషనర్ మౌర్య, హెల్త్ అధికారి, విద్యుత్ అధికారులు దాదాపు తొమ్మిది గంటలకు పైగా శ్రమించారు. ఆదివారం కావడంతో జనం ఇళ్లలోనే ఉండడంతో ప్రాణనష్టం జరగలేదు. ప్రజలకు ఇబ్బంది కలిగిన ప్రాంతాల్లో ఎపి యాదవ సంక్షేమం మరియు అభివృద్ధి సంస్థ చైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్‌సి మునికృష్ణ తదితరులు పర్యటించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి విద్యుత్ పునరుద్ధరణ, చెట్లు



తొలగించే కార్యక్రమాల్ని దగ్గరుండి పర్యవేక్షించారు. కర్నాల వీధి రైల్వే గేటు పక్కన ఓ మహావృక్షం నేల కూలడంతో అక్కడి కార్పోరేటర్ నరసింహాచారి పర్యవేక్షణలో తొలగించారు. 12వ డివిజన్ కార్పోరేటర్ ఎస్‌కె బాబు డిఆర్ మహల్ వద్ద పడ్డ చెట్లను తొలగించే కార్యక్రమాలు చేపట్టారు.తాతయ్య గుంట గంగమ్మ ఆలయం రోడ్డులో ఆటో డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. అలాగే ఒకారు, ఓఆటో, ఓ జీపు, రెండు బైకులు, రెండు దుకాణాలు దెబ్బతిన్నాయి. యాదవ కార్పోరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్‌సి మునికృష్ణ మాట్లాడుతూ ప్రజలంతా గంగజాతర వస్తున్న సందర్భంగా తిరుపతిలో వర్షాలు పడడం సహజంగా జరుగుతుందన్నారు. ఇలాంటి ఘటనలు జరిగినపుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమాల్లో మాజీ కౌన్సిలర్ ఈతమాకుల హేమంత్‌కుమార్, నాగప్రతాప్, దొడ్డారెడ్డి రామకృష్ణారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సుధాకర్ బాబు, సుబ్రమణ్యం, శరవణ, రామారావు పాల్గొన్నారు.



# ఎపి సినీ ప్రొడక్షన్స్ ఎగ్జిక్యూటివ్స్ మేనేజర్ యూనియన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

**విజయవాడ, మే 4, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాంయస్ ఫెడరేషన్‌కు అనుబంధ సంస్థ ఆంధ్రప్రదేశ్ సినీ ప్రొడక్షన్స్ ఎగ్జిక్యూటివ్స్ మేనేజర్ యూనియన్‌కు నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం విజయవాడలో జరిగింది. యూనియన్ అధ్యక్షుడుగా బండ్రెడ్డి శశికుమార్, ఉపాధ్యక్షులుగా మోటెపల్లి శ్రీనివాసరావు, ప్రదాన కార్యదర్శి కొడదల శివప్రసాద్‌రెడ్డి, కోశాధికారి ఉబా ప్రసాద్, కార్యదర్శి బండారు నారాయణరాజు, కార్య నిర్వహక కార్యదర్శిగా అందవరపు ఏడుకొండలు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా పూజారి భాస్కర్ రాజు, దాసరి రాజు బాలకృష్ణ, అలంక రవికుమార్, మిర్తిపాటి నరేష్, షేక్ మెహబూబ్‌భాషా, బొచ్చు హేమంత్ కిషోర్ తదితరులు ప్రమాణ స్వీకారం చేయగా పలువురు యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.


పంజాబ్ నేషనల్ బ్యాంకు ...విశ్వాసానికి మరో పేరు! punjab national bank ...the name you can BANK upon!

(భారత ప్రభుత్వరంగ సంస్థ)

సాధారణ పరిపాలన విభాగం-జోనల్ ఆఫీస్: 6-1-73, 2వ అంతస్తు, సయీద్ ప్లాజా, లక్డి-కా-పూల్, హైదరాబాద్-500004. ఈ-మెయిల్: zohydgad@pnb.co.in ఫోన్: (040)-24475113/18

**ఎంపానెల్‌మెంట్ నోటీసు**

పంజాబ్ నేషనల్ బ్యాంక్, హైదరాబాద్ జోనల్ ఆఫీస్, "వివిధ కేటగిరీల పనుల కోసం ఆర్కిటెక్ట్‌లు/ఆర్కిటెక్చరల్ సంస్థలను ఎంప్యానెలింగ్ చేయడానికి దరఖాస్తులను" ఆహ్వానిస్తుంది.

అర్హత, నిబంధనలు & షరతులు మరియు దరఖాస్తు ఫారమ్‌ల వివరాలు బ్యాంక్ వెబ్‌సైట్ **https://www.pnbindia.in/Tender.aspx**లో అందుబాటులో ఉన్నాయి, వీటిని **05.05.2025**న 10:00 గంటల నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

మద్దతునిచ్చే అన్ని పత్రాలతో నిర్ణీత నమూనాలో పూర్తి చేసిన పత్రాలను "చీఫ్ మేనేజర్, GAD, పంజాబ్ నేషనల్ బ్యాంక్, జోనల్ ఆఫీస్: హైదరాబాద్, 6-1-73, రెండవ అంతస్తు, సయీద్ ప్లాజా, లక్డి-కా-పూల్ - 500 004"కి **04.06.2025** నాటికి సాయంత్రం 5.00 గంటల లోగా పంపవలెను.

బ్యాంకు ప్రస్తుత ప్యానెల్‌లోని అన్ని ఆర్కిటెక్ట్స్ /ఆర్కిటెక్చరల్ సంస్థలన్నీ ఈ జాబితా ప్రక్రియలో పరిశీలించబడుటకు తాజాగా దాఖలు చేసుకొనవలసి ఉంటుంది. ప్రస్తుతం ఉన్న ప్యానెళ్లు నూతన ప్యానెళ్లు ఆమోదం పొందిన తరువాత రద్దు అవుతాయి.

పైన పేర్కొన్న పనికి సంబంధించి ఏదైనా సవరణ/స్పష్టీకరణ పైన పేర్కొన్న బ్యాంక్ వెబ్‌సైట్‌లో మాత్రమే విడుదల చేయబడతాయి. కావున బ్యాంకు వెబ్ సైట్ ను తరచుగా సందర్శించగలరు.

చీఫ్ మేనేజర్



**ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY**
Lenin Centre, Governorpet, Vijayawada - 520 002 (A.P.)

**E PROCUREMENT SHORT TENDER NOTICE**

**NIT No. 23/MAU61-ADMN0IS(INDC)/2/2025-IS, dated: 01-05-2025**

**Name of Work:** APCRDA-" Supply & Installation of Rack Servers (02 no's) for O/o APCRDA, Vijayawada" - Estimate Contract Value: **Rs.21,00,000/- (Excl. of all taxes).**

The bid can be downloaded on AP e-procurement portal from **05.05.2025** to **12.05.2025 up to 14.00 Hrs.** Due date for submission of Bid is **12.05.2025** up to **15.00 Hrs,** Technical bid opening **12.05.2025 @16.00 Hrs.** For further details Please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in.**

**E-PROCUREMENT TENDER NOTICE**

**NIT No. 05/ MAU61-USI0HB(OTH)/103/2025-HB Dt.03.05.2025**

**Name of Work:** "Providing required facilities for the persons having loco-motor disabilities, visual impairment, hearing impairment and psychological disabilities in the premises of the A.P. High court Building"- **Estimate Cost Rs. 50,00,000/-**

**NIT No. 24/MAU61-ADMN0IS(INDC)/1/2025-IS, dated: 01-05-2025**

**Name of Work:** APCRDA -" Supply & Installation of Enterprise Backup Software and Appliances along with 3 years Subscription @ O/o APCRDA, Vijayawada" - Estimate Contract Value: **Rs.21,10,100/- (Excl. of all taxes).**

The bid can be downloaded on AP e-procurement portal from **05.05.2025 to 20.05.2025** up to **14.00 Hrs.** Due date for submission of Bid **20.05.2025** up to **15.00 Hrs,** Technical bid opening **20.05.2025 @ 16.00 Hrs.** For further details please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in**

Sd/- Commissioner, APCRDA, Vijayawada

వార్త

సోమరిలా, బలహీనంగా నూరేళ్లు బతకడం కన్నా దృఢసంకల్పంతో కొద్ది కాలమైనా జీవించడం ఉత్తమం.

-అరిస్టాటిల్


# మనిషి ద్రోహమే!

విశ్వవ్యాప్తంగా మానవ తప్పిదాల వల్లనే విపత్తులు ఒకదానివెంట ఒకటి తోసుకువస్తున్నాయి. అపార ప్రాణ,ఆస్తినష్టాలకు కారణమవుతున్నాయి. వాతావరణంలో తలెత్తుతున్న అనూహ్యమైన మార్పులు ప్రకృతి వైపరీత్యాలకు దారితీస్తున్నాయి. ఇందుకు ప్రధానంగా తప్పుపట్టాల్సింది, నిందించాల్సింది మానవుడినే. మానవుడి పర్యావరణ విధ్వంస చర్యలే ఈ బీభత్సానికి, విపత్తులకు కారణమవుతున్నాయని ఎన్నో అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. పర్యావరణాన్ని కాపాడుకోలేకపోతే మానవుడి మనుగడే భవిష్యత్‌లో ప్రశ్నార్థకంగా మారుతుందని ఎందరో పర్యావరణ శాస్త్రవేత్తలు ప్రేమికులు దశాబ్దాల తరబడి పదేపదే చెబుతూ ఆందోళన వ్యక్తంచేస్తున్నా పట్టించుకునే నాథుడే లేకుండాపోతున్నాడు. పర్యావరణాన్ని కాపాడడంఅటుంచి తూట్లు పొడవడం దురదృష్టకరం. అభివృద్ధి పేరుతో ప్రభుత్వాలు చేపడుతున్న కొన్ని కార్యక్రమాలు పర్యావరణానికి చేటు చేస్తున్నాయి. ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాల నుంచి మొదలుపెడితే కొండలు తొలచి ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణాలు, నగరీకరణ పేరుతో ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది ఎకరాల పంటపొలాలను జనావాసాలు మార్చడం ఒకటేమిటి ఎన్ని రకాలుగా పర్యావరణానికి నష్టం చేయగలుగుతారో అన్నిమార్గాల్లో నిత్యం అన్వేషణ కొనసాగుతూనే ఉన్నది. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం భారత జనాభా నూటయాభై కోట్లకు చేరుకోవడానికి ఇంకెంతో సమయం పట్టదు. కానీ అందుకు తగినట్లుగా దేశంలోని సహజవనరులపై పెరగనున్న ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలనే విషయంలో పటిష్టమైన ప్రణాళికలు లేకపోవడం దురదృష్టకరం. ప్రధానంగా అటవీ సంపద ఊహించని విధంగా హరించుకుపోతున్నది.భారతదేశంలో రోజుకు మూడువందల ఎకరాలకుపైగా అటవీ భూమి అదృశ్యమైపోతుందని ఐక్యరాజ్యసమితి గతంలో వెల్లడించింది. బొగ్గుగనులు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, పరిశ్రమలు ప్రాజెక్టుల కోసం యథేచ్ఛగా అడవులను నరికివేస్తున్నారు. ఇలాంటి కారణాలు ఎన్నో పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నాయి. ఇక ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించలేకపోతున్నారు. ఇందువల్ల పర్యావరణానికి జరుగుతున్న నష్టం అంతా ఇంతా కాదు. కొన్ని ప్లాస్టిక్ వస్తువులను నిషేధించినా అవి కాగితాలకే పరిమితమైపోతున్నది. ఇక పెట్రోల్, డీజిల్ లాంటి ఇంధనాల్ వాడకం గూర్చి చెప్పక్కర్లేదు. వాహన కాలుష్య నియంత్రణ మాటలకే పరిమితమవుతున్నది. పెరుగుతున్న వాహనాల సంఖ్యకు రెట్టింపు స్థాయిలో వాహన కాలుష్యంతోపాటు పరిశ్రమలు వదులుతున్న పొగ, ధుమ్ముధూళి, అన్ని కలిపి వాయు కాలుష్యాన్ని పెంచుతున్నాయి. ఇలాంటి రకరకాల కారణాలతో భూమి ఉష్ణోగ్రత పెరిగిపోక తప్పదు. ఇదే పరిస్థితి కొనసాగితే ఉష్ణోగ్రత పెరిగి ప్రపంచంలోని తీరప్రాంతాలు దీవులతోసహా అనేక దేశాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఏనాడో పర్యావరణ శాస్త్రవేత్తలుహెచ్చరించారు. ఇలా ప్రకృతితో మనిషి ఆటలాడుకుంటుంటే అందుకు ప్రతిగా ప్రకృతి తీవ్రంగానే స్పందిస్తున్నది. పర్యావరణం సమతుల్యం దెబ్బతిన్న కారణంగా సకాలంలో వర్షాలు కురవకపోవడం, కురిస్తే ఒకేసారి ఒకే ప్రాంతంలో కుంభవృష్టి కురవడం ఇటీవల కాలంలో పెరిగిపోతున్నది. ముఖ్యంగా భారతదేశంలో ఈ అకాల వర్షాలు వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో గత ఎనిమిది వారాలుగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ఈదురుగాలులు, వడగండ్ల వానలు, రైతులను అతలాకుతలం చేస్తున్నాయి. చేతికి అందాల్సిన పంటలు నీటిపాలైపోతున్నాయి.పండ్ల తోటల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఒక్క తెలుగు రాష్ట్రాలకే ఈ అకాల వర్షాలు పరిమితం కాలేదు. దేశమంతా విస్తరిస్తూనే ఉన్నాయి. వీటితోపాటు వరదలు, తుఫాన్‌లు భూకంపాలు లాంటి ఉపద్రవాలు పర్యావరణానికి హాని కలిగించిన కారణంగా జనారణ్యాలపై దాడులు చేస్తున్నాయి. ఏటా సగటున దాదాపు మూడువందల ఎనభైకి పైగా ప్రపంచవ్యాప్తంగా ఉపద్రవాలు సంభవిస్తున్నట్లు అధికార రికార్డులు వెల్లడిస్తున్నాయి. లక్షలాది మంది ఈ ఉపద్రవాలతో ప్రాణాలు వదులుతుంటే కోట్ల సంఖ్యలో బాధితులుగా మారుతున్నారు. మరెందరో రోగపీడితులు అవుతున్నారు. ఇక ఆస్తుల నష్టం గురించి చెప్పాల్సిన పనిలేదు. అయితే పాలకులు తీసుకుంటున్న ముందు జాగ్రత్త చర్యల కారణంగా ప్రాణ,ఆస్తుల నష్టం కొంత వరకు నియంత్రించలేకపోతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఎంత సంపాదించినా ఆధునికంగా ఎంత పురోభివృద్ధివైపు పయనించినా ప్రకృతి ముందు తలవంచని పరిస్థితుల నుండి మానవుడు బయటపడలేకపోతున్నాడు. ఆర్థికంగా, సాంకేతికపరంగా ఎన్నో రంగాల్లో సాటిలేని అభివృద్ధి సాధించామని విర్రవీగే చైనీయులు ప్రకృతి ముందు తలవంచక తప్పలేదు. మొన్న ఆ మధ్య చైనాలోని సెంట్రల్ వానన్ ప్రావెన్సీలో ఒక్కరోజే ఏకంగా 457.5 మిల్లీమీటర్ల కుంభవృష్టి కురిసింది. ఎల్లో నది ఉగ్రరూపం దాల్చి ముంచెత్తింది. ప్రజాజీవనం అస్తవ్యస్తమైంది. ఒక్క చైనాయేకాదు ప్రపంచంలోని అనేకదేశాలు ఈ పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. భారత్‌లో అయితే పరిస్థితి మరింత దారుణంగా ఉన్నది. చిన్నచితక వానలకే దేశంలోని అనేక నగరాల పరిస్థితి అస్తవ్యస్తంగా మారుతున్నది. ముంబయి నగరానికి ప్రతి వర్షాకాలంలో వరద ముంపు తప్పడం లేదు. ఉత్తరాఖండ్ పరిస్థితి అంచనాలకే అందదు. ఏదిఏమైనా ఉపద్రవాల నియంత్రణకు పర్యావరణాన్ని కాపాడేందుకు త్రికరణశుద్ధిగా కృషి చేయాలి. ప్రధానంగా ప్రజల్లో అవగాహన కల్పించాలి. ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా భారీ మూల్యం చెల్లించక తప్పదు.



నిస్వార్థత ఎంత అధికంగా ఉంటుందో, విజయం అంత అధికంగా లభిస్తుంది.

బెర్నార్డ్ షా



మిక్కిలి ధనంగానీ, గొప్ప విద్య కానీ, గొప్ప అధికారం కానీ పొందినప్పటికీ గర్వం లేక ఏ వ్యక్తి ప్రవర్తిస్తాడో అతడే పండితుడు.

ప్లినీ

# దేశ భద్రతే 'ప్రయార్టీ ఐటమ్'

**అమెరికా, రష్యా, బ్రిటన్‌లు కూడా కంటితుడుపు చర్యగానే ఆ రిజల్యూషన్‌ను భావించారు. ఫ్రాన్స్ కోఆర్డినేట్ చేయాల్సిన పరిస్థితులలో సెక్యూరిటీ కౌన్సిల్ మెంబర్లందర్నీ ఏకతాటిపై నడిపించి మతపరమైన చర్యగా పహల్గాం ఘటనను భావించి, ఉగ్రవాదులు న్యాయానికి పట్టుబడే విధంగా చర్యలు తీసుకున్నట్లయితే యు.యన్.ఎస్.సి ప్రకటన సముచితంగా ఉండేది. ఉక్రెయిన్ హమాస్ సంఘర్షణలప్పుడు యు.యన్ జనరల్ బాడీసమావేశమై ఏవిధంగా స్పందించిందో ఆ విధంగానే పహల్గాంలో ఉగ్రవాద దాడిని ఖండించే విధంగా స్పందింపచేయాల్సిన అవసరాన్ని గుర్తించాలి. భారత్ ఆ విషయంలో తగు చర్యలు తీసుకొని ఉగ్రవాదానికి, వెనకుండి నడిపిస్తున్న పాకిస్థాన్‌కు గ్లోబల్ ఖండనను తెలియచేసినప్పుడే వెనుకడుగు వేస్తుంది. భారత్ రక్షణ జాగ్రత్తల బాధ్యతను ప్రయారిటీ ఐటమ్‌గా పెట్టుకోక తప్పదు.**



రావులపాటి సీతారాంరావు

ప్రపంచంలోని అన్ని దేశాలూ అభివృద్ధి సాధనలో అహర్నిశలూ కృషి చేస్తూనే ఉన్నాయి.కానీ దేశాల భద్రత దృష్ట్యా అపరిమితంగా సైన్యాల పెంపుదల కోసం, ఆయుధాల ఉత్పత్తి, దిగుమతుల కోసం, మరీ ముఖ్యంగా అణ్వాయుధాల నిమిత్తం విపరీతంగా ఖర్చు చేస్తున్న మాట వాస్తవం. దేశ సంపదలో అభివృద్ధి కోసం కొంత భాగం వినియోగపడుతుంటే, మిలటరీ దళాల కోసం ఖర్చు ఎక్కువగా ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్న విషయాన్ని ఎవరూ కాదనలేని పరిస్థితి. నిజం మాట్లాడుతే ఈ పరిస్థితిని చాలా దేశాలు ఎదుర్కోక తప్పటం లేదు. అలాంటి గత్యంతరం లేని పరిస్థితినే ఇండియా ఎదుర్కోవాల్సి వస్తున్నది. పహల్గాం ఘటన ఈ సందర్భంగా ప్రస్తావించక తప్పదు. జమ్మూ,కాశ్మీరు ప్రాంతం ఈ మధ్యనే పెద్దగా అలజడులు లేకుండా ఆర్థికాభివృద్ధి సాధించే దిశగా పయనిస్తున్న తరుణంలో ఈ సంఘటన కాశ్మీర్ టూరిజం మీద ఎదుర్కోలేని దెబ్బకొట్టింది. కాశ్మీర్ ఆర్థిక సంపద ఎక్కువ భాగం పర్యాటక వ్యవస్థ మీదనే ఆధారపడి ఉన్నది. అక్కడి ప్రకృతి సౌందర్యంతోపాటు సహజమైన ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదించటానికీ, అనుభవించడానికి ఎంతో మంది యాత్రికులు ప్రపంచం నలుమూలల నుంచీ వస్తుంటారు. ఈ మధ్య వారి రాపిడి విపరీతంగా పెరిగింది. ఆర్థిక సంపద కాశ్మీర్‌లో కొత్త పంథాలో నడుస్తున్న సమయంలో ఈ దురదృష్టకర మారణకాండ కోలుకోలేనంతగా కాశ్మీర్ వ్యవస్థను దెబ్బతీసింది. దీనివల్ల ఒక్క కాశ్మీరే కాదు దేశంలోని ఆర్థిక వనరులు, రక్షణ భద్రత నిమిత్తం ఖర్చుపెట్టాల్సిన అగత్యం ఏర్పడింది. ఎన్ని మాటలు ప్రభుత్వాలు చెప్పినా, మిలటరీ సాయుధ సంపత్తి సమకూర్చలేకపోతే దేశానికి అన్ని వేళలా భద్రత కల్పించడం కష్టం. అభద్రత లోపాలులేకుండా ఉన్నప్పుడే సమగ్ర రక్షణ దేశానికి ఏర్పడుతుంది. ఒకసారి ప్రపంచంలోని ముఖ్య దేశాలు మిలటరీ వ్యవస్థ కోసం పెట్టిన ఖర్చును పరిశీలిస్తే సామాన్యులు ఆశ్చర్యానికి లోనుకాక తప్పదు. ఈ మధ్యనే స్వీడిష్ థింక్ ట్యాంక్ పేరిట మిలటరీ కోసం చేస్తున్న ఖర్చువిషయంలో చేసిన స్టడీ వెలుగులోకి వచ్చింది. 2024 సంవత్సరం బేస్‌గా పెట్టుకొని ఆ స్టడీ కొన్ని ఆశ్చర్యకరమైన విషయాలు బయటపెట్టింది. 2024లో భారతదేశం తొమ్మిదిరెట్లు పాకిస్థాన్ కంటే ఎక్కువగా మిలటరీ నిమిత్తం ఖర్చుపెట్టింది. పహల్గాం తరువాత అంటే 2025సంవత్సరం నుంచి సైనిక దళాలూ, ఆయుధ సంపత్తి కోసం మరింతగా ఖర్చుపెట్టక తప్పదు. మనదేశం ఈ ఖర్చు విషయంలో అయిదవ స్థానంలో ఉంది. 86.1 బిలియన్ డాలర్ల నుంచి 1.6 శాతం పెరిగింది. పాకిస్థాన్ 10.2 బిలియన్లు పెట్టిందని స్టాక్ హోం ఇంటర్ నేషనల్ పీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సిప్రి) కూడా తెల్పింది. యు.యస్.ఏ, చైనా, రష్యా, జర్మనీ, ఇండియా ఎక్కువగా రక్షణ నిమిత్తం ఖర్చుపెట్టే ప్రథమ ఐదుస్థానాల్లో వరుసగా ఉన్నాయి. మొత్తం గ్లోబల్ టోటల్‌లో ఈ అయిదు దేశాలు పెట్టే ఖర్చు కలుపుతే దాదాపు 60శాతం ఉంటుంది. ఈ అయిదు దేశాలు కలిసి 1.035 బిలియన్ డాలర్లు ఖర్చు పెట్టున్నాయి. చైనా దేశం తన భద్రత ఖర్చును ఏడు శాతం ఎక్కువ చేసింది. ఆసియా దేశాలతో పోలుస్తే చైనా చేసే ఖర్చు 50 శాతం ఉంటుంది. రష్యా కూడా ఖర్చు బాగానే ఎక్కువగా పెట్టున్నది. ఉక్రెయిన్ యుద్ధం వల్ల రష్యా మిలటరీ ఖర్చు దాదాపు 149 బిలియన్ డాలర్లకు 2024 చేరుకుంది. ఇది 8శాతం 2023 సంవత్సరం ఖర్చు కంటే ఎక్కువ. ఉక్రెయిన్ మొత్తం ఖర్చు (మిలటరీ కోసం) 2.9 శాతం పెరిగి 64.7 బిలియన్ల డాలర్లకు చేరుకుంది. ఈ ఖర్చుల విషయం ప్రస్తావించడానికి కారణం ఒక్కటే. యుద్ధమేఘాలు దేశాల మధ్య కమ్ముకున్నప్పుడు ఏ దేశమూ భద్రత విషయంలో ఖర్చుపెట్టడానికి వెనుకాడదు. అభివృద్ధి తప్పక కుంటుపడుతుంది. అది వేరే విషయం. కానీ దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడవల్సిన బాధ్యత పదవిలో ఉన్న ప్రభుత్వానిదే! ఇవ్వాల పాకిస్థాన్ అస్తవ్యస్తంగా ఉండటానికి కారణం ఆర్థిక పురోభివృద్ధిని సాధించడానికి ప్రణాళికలను ఏర్పరుచుకొని తగు చర్యలు తీసుకోలేకపోవటమే. కేవలం మతపరమైన భావజాలంతో మిలటరీపరంగా బలాన్ని పెంచుకొని దాయాది ఇండియాను అన్నివిధాల దెబ్బతీయాలనే దురాలోచనే పాకిస్థాన్‌ను బలహీనపర్చింది. ఆర్థికాభివృద్ధి ప్రక్కన పెట్టి ఆర్మీ సహాయాంతో ఇండియాను జయించాలనుకుంటే కుదరదు. ప్రజాస్వామ్య పద్ధతులకు తిలోదకాలు ఇచ్చి చైనాతో జట్టుకట్టి ఇండియా మీద పైచేయి సాధించాలనుకోవటం పాకిస్థాన్ చేసిన పెద్ద తప్పిదం. అందుకే ప్రస్తుత స్థితిని అనుభవించక తప్పటంలేదు. భారతదేశం మొదటి నుంచీ ఏ దేశం జోలికి పోలేదు. తగాదాలు పెట్టుకొని ప్రపంచ నాయకత్వాన్ని పొందాలని ఎన్నడూ ఆశించలేదు. అభివృద్ధి సాధించడంలో ఇతర దేశాలతో పోటీపడిన మాట వాస్తవం. అభివృద్ధి వరకే పోటీని పరిమితం చేయడం వల్ల ప్రపంచ దేశాల్లో గౌరవ ప్రధానమైన స్థానాన్ని పొందగలిగింది. చైనాతో కానీ, పాకిస్థాన్‌తో కానీ కావాలని ఇండియా ఎన్నడూ యుద్ధాలు తెచ్చుకోలేదు. ఆ రెండు దేశాలు తమ బలాలను నిరూపించుకోవడానికి సరిహద్దును తారుమారు చేసి పైచేయి సాధించాలని ప్రయత్నించినప్పుడు దీటుగా జవాబివ్వటమే కాదు. తిరుగులేని రీతిలో దాడులను త్రిప్పికొట్టింది. భద్రతకు సంబంధించినంత వరకు మిలటరీ పరంగా అన్ని అవసరాలను క్రమపద్ధతిలో తీర్చింది. ఆధునిక ఆయుధాలను, యుద్ధవిమానాలను అణ్వాయుధాలను సమకూర్చుకొని శాంతి సూత్రాన్ని పక్కనపెట్టలేదు. ఇండియా తన మీద దాడి చేసినప్పుడు మాత్రమే దేశ రోక్షణ కోసం తగువిధంగా జవాబిచ్చింది. మంచి ఊపులో దేశ ఆర్థిక పురోభివృద్ధి ఉన్నప్పుడు పాకిస్థాన్ పహల్గాం ఘటన ఆధారంగా ఆర్థికంగా బలహీనపర్చేందుకు వేసిన ఎత్తుగడ. యుద్ధం కొనసాగిస్తే పాకిస్థాన్‌కు మంచిది. ఇండియాకు కాదు. అగ్రదేశాలు భారతదేశంతో శత్రుత్వం కావాలని ఎన్నడూ తెచ్చుకోలేదు. కానీ భారతదేశం అగ్రదేశాల సరసన అణుశక్తిగా ఎదగటం ఒక విధంగా ఆ దేశాలకు ఇష్టం లేదు. అందుకే పాకిస్థాన్ వెనుకవుండి ప్రోత్సహిస్తున్న ఉగ్రవాదాన్ని నిర్దాక్షణ్యంగా ఖండించి నిర్మూలించే పనికి అమెరికా,రష్యా లాంటి దేశాలు పూనుకున్నట్లయితే అఫ్ఘానిస్థాన్, బెలూచిస్థాన్, అంతెందుకు బంగ్లాదేశ్ ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలు అసలు తలెత్తకనేపోయేవి. అమెరికా తన తప్పిదాన్ని ట్విన్‌టవర్ నిర్మూలనతో తెలుసుకోగలిగింది. వియత్నాం విషయంలో ఇతర చిన్నచిన్న దేశాలలో అవసరమున్నా, లేకపోయినా అమెరికా తలదూర్చిన తర్వాత తనే విచారించింది. అయినా తగురీతిలో యు.యస్ స్పందన ఇప్పుడు లేదన్నది వాస్తవం. ట్రంప్ సమాధానాలు ఎవరికీ అర్థంకాని పరిస్థితిలో చైనా, రష్యాలు ఎలాంటి విధానాలు అమలు చేస్తాయో ఎవరూ ఊహించలేకపోతున్నారు. ఉగ్రవాదాన్ని అన్ని దేశాలూ కలిసి కట్టుగా సమిసిపోయేట్లు చేస్తేనే ప్రపంచంలో శాంతికి విఘాతం ఉండదు.యునైటెడ్ సెక్యూరిటీ కౌన్సిల్ పహల్గాం విషయంలో కొన్ని రోజుల క్రిందట ఆమోదించిన ప్రకటన ఉండాల్సిన విధంగా ఉండకపోవడం వల్ల గ్లోబల్ సమస్యలు, ఉగ్రవాదం వల్ల మరింతగా పెరిగే అవకాశాన్ని అనవసరంగా కల్పించినట్లయింది. పాకిస్థాన్ సభ్యత్వం ఎస్.సిలో నాన్ పర్మినెంట్ మెంబరుగా (2025-2026) ఉండటం వల్ల లభించింది. చైనా పర్మినెంట్ మెంబర్ అవటం వల్ల ఆ రిజల్యూషన్‌ను పటిష్ట రీతిలో ఉగ్రవాదాన్ని నిర్మూలించే విధంగా తయారు చేయనివ్వలేదు. అమెరికా, రష్యా, బ్రిటన్‌లు కూడా కంటితుడుపు చర్యగానే ఆ రిజల్యూషన్‌ను భావించారు. ఫ్రాన్స్ కో ఆర్డినేట్ చేయాల్సిన పరిస్థితులలో సెక్యూరిటీ కౌన్సిల్ మెంబర్లందర్నీ ఏకతాటిపై నడిపించి మతపరమైన చర్యగా పహల్గాం ఘటనను భావించి, ఉగ్రవాదులు న్యాయానికి పట్టుబడే విధంగా చర్యలు తీసుకున్నట్లయితే యు.యన్.ఎస్.సి ప్రకటన సముచితంగా ఉండేది. ఉక్రెయిన్ హమాస్ సంఘర్షణలప్పుడు యు.యన్ జనరల్ బాడీ సమావేశమై ఏ విధంగా స్పందించిందో ఆ విధంగానే పహల్గాంలో ఉగ్రవాద దాడిని ఖండించే విధంగా స్పందింప చేయాల్సిన అవసరాన్ని గుర్తించాలి. భారత్ ఆ విషయంలో తగుచర్యలు తీసుకొని ఉగ్రవాదానికి,వెనుకుండి నడిపిస్తున్న పాకిస్థాన్‌కు గ్లోబల్ ఖండనను తెలియచేసినప్పుడే వెనుకడుగు వేస్తుంది. భారత్ రక్షణ జాగ్రత్తల బాధ్యతను ప్రయారిటీ ఐటమ్‌గా పెట్టుకోక తప్పదు. •



# అమరావతి ప్రగతి సంకేతం

**తరిగోపుల నారాయణస్వామి**

ఆంధ్రప్రదేశ్ విభజన తరువాత రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవానికి, పాలనా సామర్థ్యానికి, భవిష్యత్ అభివృద్ధికి ఒక సమగ్ర రాజధాని అవసరమైంది. ఈ నేపథ్యంలో 2015లో అమరావతిని రాజధానిగా ప్రకటించడం జరిగింది. ఈ ప్రక్రియలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజల ఆశలు అమరావతిపై స్థిరపడ్డాయి. కృష్ణా నదీ తీరంలో, అభివృద్ధికి అనువైన ప్రదేశంగా భావించబడిన అమరావతి, భౌగోళికంగా మధ్యలో ఉండటం, తక్కువగా అభివృద్ధి చెందిన ప్రాంతం కావడం దీన్ని మరింత ప్రత్యేకంగా చేశాయి. అమరావతిని నిర్మించేందుకు 33,000 ఎకరాల భూమిని రైతులు స్వచ్ఛందంగా సమర్పించారు. ఇది దేశంలోనే విశేషమైన ప్రజా భాగస్వామ్య ఉదాహరణగా నిలిచింది. రైతులు తమ భూములను ఇవ్వడమే కాక, భవిష్యత్తులో అక్కడ అభివృద్ధి జరగాలని ఆశతో ఎంతో నమ్మకంతో వ్యవహరించారు. వారి త్యాగం భారత ప్రజాస్వామ్యంలో ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకుంది. అయితే 2019లో రాష్ట్ర ప్రభుత్వం మూడు రాజధానులు ప్రకటించడంతో, అమరావతికి తీవ్ర అన్యాయం జరిగింది. ఇది రైతుల నమ్మకాన్ని, ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసింది. అప్పటి నుండి వేలాది మంది రైతులు నిరవధికంగా ఆందోళనలో పాల్గొంటూ, రాజధాని హక్కు కోసం పోరాటం కొనసాగించారు. ఇదిభారతదేశంలో ఒక అరుదైన ప్రజా ఉద్యమంగా చరిత్రలో నిలిచింది. ఈ నేపథ్యంలో 2022లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అమరావతినే శాశ్వత రాజధానిగా ప్రకటిస్తూ కీలక తీర్పును వెలువరించింది. ప్రభుత్వ విధానాలు ప్రజలనమ్మకానికి విరుద్ధంగా ఉండకూడదన్న సందేశాన్ని కోర్టు స్పష్టంగా తెలిపింది. అయినప్పటికీ, అమలులో అసంపూర్ణత కొనసాగుతుండగా ఇప్పుడు కేంద్రం అడుగులు వేయడం రాష్ట్రప్రజలకు కొత్త నమ్మకాన్ని కలిగిస్తోంది. 2025 మే 2న, గౌరవ ప్రధాని నరేంద్ర



మోడీ అమరావతిలో పునరుద్ధరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇది కేవలం పాలనా కార్యక్రమం మాత్రమేకాదు, రాష్ట్ర భవిష్యత్తు అభివృద్ధికి బలమైన సంకేతం. కేంద్ర ప్రభుత్వం ఈ దశలో అమరావతిని శాశ్వత రాజధానిగా గుర్తించి, చట్టబద్ధతను కల్పించి రైతుల ఆశల్ని నిలబెట్టాల్సిన బాధ్యతను భుజాన వేసుకోవాలి. రైతులకు సరైన నష్ట పరిహారం, పునరావాసం, జీవితాంత భరోసా కావాలి. భూములు ఇచ్చిన రైతులు అభివృద్ధిలో భాగస్వామ్యంగా మారేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఉపాధి అవకాశాలు, రైతు సంక్షేమ పథకాలు అమలయ్యే విధంగా విధానాలు రూపొందించాలి. ఇది కేవలం ఓ భరోసా మాట కాదు, ఒక బాధ్యతగా మారాలి. ఇక అభివృద్ధి ప్రణాళికను చూస్తే, అమరావతిని ప్రపంచ స్థాయి మౌలిక వసతులతో తీర్చిదిద్దే దిశగా నడవాలి. విశ్వవిద్యాలయాలు, సాంకేతిక విద్యాసంస్థలు, పరిశోధన కేంద్రాలు ఏర్పాటుచేయాలి. ఐటి హబ్‌గా అభివృద్ధి చేసి, యువతకు లక్షలాది ఉద్యోగాలు కల్పించాలి.అదేవిధంగా ఆటోమేషన్, బయోటెక్నాలజీ వంటి ఆధునిక రంగాల్లో పెట్టుబడులకు ప్రోత్సాహం ఇవ్వాలి. అంతర్జాతీయ ప్రమాణాల క్రీడా ప్రాంగణాలు, స్టేడియాలు ఏర్పాటు చేయడం ద్వారా క్రీడా అభివృద్ధికి మార్గం వేయవచ్చు. యువతలో స్ఫూర్తిని పెంపొందించడంతోపాటు,క్రీడా పర్యాటనకు దోహదం చేయవచ్చు.అలాగే,ఆధునిక వైద్యశాలలు, ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు నాణ్యమైన ఆరోగ్యసేవలు అందించవచ్చు. ఈమౌలిక వసతులు అమరావతిని ఒక సమగ్ర జీవన కేంద్రంగా తీర్చిదిద్దతాయి. ఇవన్నీ కలిపిచూస్తే, అమరావతి అభివృద్ధి కేవలం రాజధాని నిర్మాణం మాత్రమే కాదు. అది ఒక రాష్ట్రం ఆత్మగౌరవానికి, ప్రజల భవిష్యత్తుకి నిలకడగా మారే మార్గం. ఇది రైతుల త్యాగానికి గౌరవంగా నిలవాలి. కేంద్రప్రభుత్వం చట్టబద్ధత, నిధులు, ప్రాజెక్టులు సమర్థంగా అందించాలి.రాష్ట్ర ప్రభుత్వం ప్రజలతోకలిసి ముందుకు నడవాలి.అప్పుడు మాత్రమే అమరావతి ఒక అభివృద్ధి చిహ్నంగా నిలుస్తుంది. •

# భారత్‌కు సకల దేశాల మద్దతు

**కనుమ ఎల్లారెడ్డి**

పాక్ కు ఎప్పటికి బుద్ధి వస్తుందో తెలియదు కాని ఉగ్రవాదంతో చెట్టా పట్టాల్ వేసుకుంది. భారత్ పై అంత అక్కసు ఉంటే పహల్గాం దాడి కాకుండా, అమాయక పర్యాటకుల ప్రాణాలు తీసి చాలా పెద్ద తప్పు చేసింది. భారత్ పై ఎందుకు దాయది దేశం ఇటువంటి చర్యలకు పాల్పడుతోందో అర్థం కావడం లేదు. ఇప్పటికే భారత్ చాలా నిగ్రహంగా ఉంది. అది భారత్‌ను తక్కువ అంచనా వేస్తోందా! అన్న అనుమానాలు రేకెత్తుత్తున్నాయి. అగ్రదేశాలయిన అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలు పాక్ పై గుర్రుమంటున్నాయి. ముఖ్యంగా అఫ్ఘానిస్థాన్‌లోని తాలిబాన్ ప్రభుత్వం కూడా భారత్ పక్షాన ఉండటం, ఉగ్రవాదాన్ని తరిమికొడతాం అని చెప్పడం ప్రశంసనీయం. కాగా పహల్గాం దాడిని అల్ జీరియా, గ్రీస్, సియోర్ర లియాన్, గయాన, సోమాలియా, పనామా దేశాలు భారత్‌కు సంఫీభావం ప్రకటించాయి. చివరికి ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ అంటోనియా గుటేర్రస్ కూడా ఉగ్రవాదాన్ని తీవ్రంగా ఖండించారు. ముందుగానే అంతత మాత్రాన ఉన్న భారత్, పాక్ సంబంధాలు ఈ దాడితో విపరీత పరిణామాలు చోటు చేసుకుంటాయి అని ఆందోళన వెలిబుచ్చారు. ఉగ్రవాదాన్ని ఖండించి భారత్‌కు మద్దతు ప్రకటించిన దేశాలకు భారత విదేశాంగా మంత్రి జై శంకర్ కృతజ్ఞతలు చెప్పారు. పాక్ లక్ష్యం ఒకటే భారత్‌ను ఎలాగైనా అస్థిర పరచాలనే తలంపుతో ఉంది. ఆ నేపథ్యంలో పర్యాటకులను లక్ష్యంగా పెట్టుకుంది. భారత్‌తో ఇప్పటికే దంకిలు, దెంకీలు తిన్న పాక్‌కు బుద్ధి రాకపోవటం శోచనీయం.పాక్‌పై దాడికి భారత్‌లోని సైనికులు అవసరం లేదు. భారత తల్లుల గర్భంలోని పసికందులు చాలు. వారి రక్తం సలాసలా కాగిపోతోంది. భారత్ ఇక ఎంత మాత్రం ఉపేక్షించరాదు. ఏ దేశం పాక్‌కు మద్దతు ఇవ్వదు. అందు నిమిత్తమే కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కూడా పహల్గాంలో 28మంది పర్యాటకుల ప్రాణాలు బలిగొన్న ఉగ్రమూకలకు కఠినంగా శిక్ష పడాల్సిందేనని, దానికి తాము పూర్తి మద్దతు ఇస్తామని స్పష్టంచేశారు. మరో వైపు భారత్ మాపై దాడి చేస్తుంది అని, పహల్గాం దాడిని, భారత్ ఒక సాకుగా వాడుకోవాలని చూస్తుందని, పాక్ సమాచార, ప్రసార శాఖ మంత్రి తరార్ చెప్పడం విడ్డూరం. తప్పు చేసి దాన్ని ఒక



సాకు అని పాక్ చెప్పడం సహించరాని విషయం. పైగా తమపై దాడి చెస్తే భారత్ తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందేనని చెప్పడం హేయం. తరర్ మతి ఉండి మాట్లాడుతున్నాడో లేదో అతనికే తెలియాలి. రుజువులు కళ్ల ముందు కనిపిస్తున్నా, పలు దేశాలు పాక్‌ను విమర్శిస్తున్నా పాక్ కు బుద్ధి రాకపోవడం ఆ దేశానికే సిగ్గు చేటు. భారత్‌తో, పాక్ యుద్ధం చెస్తే ఏదేశం కూడా పాక్‌కు మద్దతు ప్రకటించదు. భారత్‌పై పాక్ ఎన్ని ఆంక్షలు విధించినా ఆ దేశానికే నష్టం. ఇప్పటికే చీనాబ్ నది నీరు లేక పూర్తిగా అడగంటి పోయింది. ప్రధాన నీటి వనరు కనుమరుగు కావటం పాక్‌కు తొలి దెబ్బ. పాక్‌లో ఆర్థిక వ్యవస్థ కుదేలు అయింది. భారత్ దాడి చేస్తుంది అని ఆ దేశానికి భయం పుట్టుకుంది. అందుకే భారత్ పై తప్పుడు ప్రచారం చేస్తోంది. యుద్ధానికి భారత్ విముఖంగా ఉందని ఒక ఫేక్ వార్తను ప్రచారం చేస్తోంది. ఇది భారత్ ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీయడానికే ఇటువంటి అసంబద్ధ వార్తలు ప్రచారం చేయడం పాక్ కే చెల్లింది. పాక్‌ను దెబ్బ కొట్టాల్సిందేనని భారత్ కృత నిశ్చయంతో ఉంది. ఈసారి దాడి చెస్తే పాక్‌కు మామూలుగా ఉండదు. అసలు భారత్ అంటే ఏమిటో రుచి చూపిస్తుంది. మళ్లీ భారత్ వైపు కన్నెత్తి చూడకుండా గట్టి గుణపాఠం చెప్పే రోజు ముందుంది. అందుకే పాక్ వణికిపోతోంది. అమాయకులైన పర్యాటకులను పొట్టన బెట్టుకోవడం కాదు దమ్ము, ధైర్యం ఉంటే నేరుగా భారత్ ఆర్మీని ఎదుర్కోండి మీ సత్తా ఏమిటో, మా సత్తా ఏమిటో బయట పడుతుంది అని ప్రతి భారతీయుడు పిడికిలి బిగిస్తున్నాడు. ఇక ఎక్కడైనా పాక్ ఉగ్రవాదులు దాడి చెస్తే మాత్రం సహించలేదు. చార్‌ధామ్ యాత్ర ప్రారంభమైన దరిమిళ భక్తులకు పూర్తి రక్షణ కల్పిస్తున్నామని భారత్ ఆత్మ విశ్వాసంతో చెప్పింది. భారత్‌కు వివిధ దేశాలు మద్దతు ప్రకటించడం పట్ల, పాక్ ఇప్పటికైనా భారత్‌కు క్షమాపణ చెప్పాలి. అయినా పర్యాటకుల ప్రాణాలు తీయడం ఏ దేశ సంస్కృతి కాదు. పర్యాటకులకు మర్యాద, గౌరవం, తగిన సహాయ, సహకారాలు ఇవ్వాలి. అది భారత్‌ను చూచి పాక్ నేర్చుకోవాలి. ఇంత వరకు భారత్ ఎంతో సంయనం ప్రకటించింది. పర్యాటకుల ప్రాణాలు పోవడంతో ఇక భారత్ వెనక్కి తగ్గదు. ఏ క్షణంలో నైనా పాక్ పై భారత్ దాడి చేయాల్సిందే. దానికి మిగతా దేశాలు కూడా కలసిరావాలి. అప్పుడు కాని పాక్‌కు బుద్ధిరాదు. ఇక ఎప్పటికి ఉగ్రదాడి చేయదు అనే విధంగా పాక్‌కు గట్టి హెచ్చరిక చేయాలి. అప్పుడే పాక్ అదుపులోకి వస్తుంది. •

# ప్రజావాక్కు

## మహిళల భాగస్వామ్యం అవసరం

దేశంలో జీడీపీ లెక్కల గొడవలో పడీ అసలైన అభివృద్ధికి కొలబద్దగా నిలిచే మహిళ భాగాస్వామ్యంలో రావాల్సిన లేదా పెరగాల్సిన వృద్ధిని పెంచలేకపోతున్నాం. సమానత్వంసాధించకుండావచ్చే అభివృద్ధి ఒకఅభివృద్ధేనా అన్నా అనుమానం రాకమానదు. ఇకపోతే మహిళలు పని చేయడానికి అనువైన పరిస్థితులు కల్పించాలి అని విశాఖ కేస్‌లో చెప్పినప్పటికీ ఆదిశగా అడుగులు పడుతున్నాయా అనేదిపెద్దప్రశ్న. ఇకపోతే దేశంలో సమానత్వం అందించే ఏకీకృత చట్టం,ఉపాధిహామీ ఒకటే అయితే కేంద్రం మితి మీరిన పోకడలువల్ల రాష్ట్ర భౌగోళిక పరిస్థితిని ఆధారంగా పనుల ఎంపికచేసుకునే స్వేచ్ఛలేకపోవడం వల్ల ఆ చట్టం మహత్తర స్ఫూర్తిదెబ్బతింటున్నది.మహబూబ్‌నగర్ వలసలు నివారించేవిధంగా ఆజిల్లా భౌగోళికపరిస్థితికి తగ్గట్టు పనులరూప కల్పన జరగాల్సిన అవసరం ఉంది.

- భారత అవినాష్, జనగామ

## వృక్షో రక్షతి రక్షితః

శబ్ద, వాయుకాలుష్యంతో మానవుడు కకావికలం అవుతున్నాడు.ఇక పశుపక్ష్యాదుల సంగతిసరేసరి.ప్రకృతి అసమతుల్యత వైపు పయనిస్తూ ఆపదలతో విలయతాండవం చేస్తున్నా నరుడుమేలుకోలేదన్న విషయం ఆందోళనకరం. ఇదిముమ్మాటికి మానవతప్పిదం.మనం ఎంత భయంకర వాతావరణంలో ఉన్నామనేది ఏదో ఒకచోట పుడమి తల్లి కన్నెర్ర కారణంగా తుఫాన్, సునామి రక్కసి విరుచుకుపడడమే ఇందుకు నిదర్శనం. అటవి సంపద, చెరువులు, భూగర్భజలాలు, ఇంకుడు గుంతలను పరిరక్షించుకోవాలి. అభివృద్ధినెపంతో ఇష్టానుసారంగా పరిసరాలకు హాని తలపెట్టే పనులు ఇకనుంచి అయినా మానుకోవాలి.

- ఎం. రాజేష్ నల్గొండ

## మద్యంపై నియంత్రణ అవసరం

మద్యం, మాదకద్రవ్యాలుఊరూరా విచ్చలవిడిగా లభిస్తూ నవతరాన్ని దారితప్పిస్తున్నాయి. వీటిని అణచివేసేందుకు ఉక్కుపాదంమోపాలి. నవతరాన్నికాపాడాలి.మద్యం, మాదకద్రవ్యాలు యువతకు అందకుండా ప్రభుత్వం నిఘా ఏర్పాటు చేయాలి. ఎవరైనా వీటిని అమ్మినట్లు తెలిసినా, చూసినా వారినివెంటనే అదుపులోకి తీసుకొనికఠిన శిక్షలు విధించాలి. తిరిగిఅలాంటి పనులు చేయకుండా చూడాలి.

- మా.శ్రీ.రాజు, పాల్వంచ

## ఆరోగ్యమే మహాభాగ్యం

ప్రపంచంలో ఊబకాయంతో బాధపడుతున్న వాళ్లు కోకొల్లలు. మనదేశంలో కూడా తక్కువేమీకాదు. ఈ ఒబెసిటికి ప్రధాన కారణం వ్యాయామలేమి. జంక్‌ఫుడ్ ఎక్కువ తీసుకోవడం అని నిపుణులు చెబుతుంటారు. మంచి ఆరోగ్యం పొందాలంటే చిరుతిళ్లు నిద్ర ముఖ్యంగా మానసిక ప్రశాంతత ఎంతో అవసరం. రోజుకు కనీసం పది నిమిషాలపాటు ధ్యానం చేయాలి. కష్టాలు కలకాలం ఉండవని గ్రహించాలి. నీరు ఎక్కువగా తాగాలి. శారీరకంగా, మానసికంగా దృఢంగాఉండాలి.పొగతాగడం, మందు వగైరాలకు వెంటనే స్వస్తి పలకాలి. భక్తి, భుక్తి మితంగా ఉండాలి.అప్పుడు వృత్తిలోకూడా ఎదగడానికి ఆస్కారంఎంతో ఉంది.

-ఆర్.వెంకటేష్ చరన్, బెంగళూరు

## సీనియర్లకు ప్రమోషన్స్ ఇవ్వాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు ట్రాన్స్ఫర్లు చేయాలని ఒక చట్టం రూపొందించింది.అన్ని డిపార్ట్మెంట్లకు ప్రమోషన్ వస్తున్నాయి. కానీ టీచర్లకు ప్రమోషన్లు ఒక కలగానే మిగిలిపోతూ ఉన్నది. ప్రమోషన్లలోరిజర్వేషన్లు ఉండడం వలన సీనియారిటీకు ప్రాధాన్యత ఇవ్వడం లేదు. కొంతమంది పుట్టిన తారీఖు నుండి ప్రమోషన్లు ఇచ్చేయమని అప్పీలుచేశారు. ఇంకొంతమంది సెకండరీ టీచర్లు డైట్ కాలేజీ లెక్చరర్‌గా, ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్లుగా ప్రమోషన్ లో తమకు కొంత శాతం ఇవ్వాలని అప్పీల్ చేశారు. డ్రిల్ మాస్టర్లు కూడా ఏకంగా డిగ్రీ కాలేజీల పీడీలుగా ప్రమోషన్లు ఇమ్మని అడుగుతున్నారు. ఎవరికి తోచిన అప్పీల్ వారు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సెకండరీ టీచర్లు కొంతమంది హైస్కూల్లో జాయిన్ అయ్యి ,స్కూల్ అసిస్టెంట్స్ వర్క్ చేయవలసి వస్తుంది.

- వి. భాస్కర్ రావు, విజయనగరం జిల్లా

## డిప్యుటేషన్ రద్దు చేయాలి

గురుకులాలలో టీచర్స్ పోస్టులను గత సంవత్సరంలో భర్తీ చేయడం జరిగింది. సంవత్సరం పూర్తికాకముందే మళ్లీ డిప్యూటేషన్ అని అంటున్నారు. ఈ విధానానికి స్వస్తి పలకాలి. టీచర్స్ లెక్చరర్స్ ప్రస్తుతం పని చేస్తున్న గురుకులంలో కుటుంబ సమేతంగా క్వార్టర్స్‌లలో ఉండి విధులు నిర్వహిస్తున్నారు. ఈ విధానాన్ని రద్దు చేయాలి. డిప్యూటేషన్ విధానం వలన వికలాంగులైన టీచర్స్ లెక్చరర్స్, మహిళా టీచర్స్ లెక్చరర్స్ ఇబ్బందులు పడుతున్నారు.

-రాపాక, రవీందర్ జనగాం

మన వి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలి

## -కౌన్సిలింగ్‌లో పోలీసు అధికారులు

**విజయవాడ కార్పొరేషన్,మే 4,ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ ఎలాంటి నేరాలకు పాల్పడకుండా నేర ప్రవృత్తిని మాని మంచి నడవడికతో, సత్ప్రవర్తనతో మెలగాలని,ఎటువంటి అసాంఘిక పాల్పడకుండా నేర ప్రవృత్తిని మాని మంచి నడవడికతో,సత్రవర్తనతో మెలగాలని,ఎటువంటి అసాంఘిక కార్యక్రమాల్లో పాల్గొనడం చేయరాదని, ఎవరైనా చట్ట వ్యతిరేక



కార్యక్రమాల్లో పాలుపంచుకోకూడదని పోలీసు అధికారులు రౌడీషీటర్లు,సస్పెక్ట్ షీటర్లకు హితవు పలికారు. ఎన్టీఆర్ జిల్లా ఇన్చార్జి పోలీస్ కమీషనర్ సర్వశ్రేష్ట త్రిపాఠి ఆదేశాల మేరకు కమీషనరేట్ పరిధి లోని అన్ని పోలీస్ స్టేషన్లలో పోలీసు అధికారులు వారి సిబ్బందితో కలిసి ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లకు,లా అండ్ ఆర్డర్,క్రైం సస్పెక్ట్‌లకు,చెడునడత కల్గిన వ్యక్తులకు వివిధ సమయాల్లో కౌన్సిలింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎలాంటి నేరాలకు కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అంతేకాకుండా గంజాయి,ఇతర మత్తు పదార్థాల వినియోగం,అక్రమ రవాణా చేయకుండా సత్ప్రవర్తన మార్గంలో నడవాలని ప్రతి ఒక్కరు చెడు వ్యసనాలకు దూరం చేసుకొని మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ప్రతి ఒక్కరిపై పోలీస్ వారి నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎవ్వరైనా ఎక్కడైనా గొడవలు,ఇతర నేరాలతో పాల్గొంటే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

# విజయవాడ వార్త



# నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

## -కమిషనర్ ధ్యానచంద్ర




**విజయవాడ కార్పొరేషన్,మే 4,ప్రభాతవార్త:** ప్రజల ప్రతి సమస్యకు పరిష్కారం చూపే విధంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ఈ సోమవారం కూడ విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయంలో కూడ ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని కమీషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. ప్రజలు విజయవాడ నగరపాలక సంస్థ సంబంధిత సమస్యలను సోమవారం ఉదయం 10 నుండి 1 గంట వరకు ప్రధాన,జోనల్ కార్యాలయాల్లో తమ ఫిర్యాదులను ధరఖాస్తు చేసుకొని అధికారులకు అందించవచ్చని తెలిపారు.నగరం లోని ప్రజలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలను అధికారులకు తెలియచేసి త్వరితగతిన పరిష్కారం పొందగలరని కమీషనర్ విజ్ఞప్తి చేశారు.

# స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ దివాస్‌తో పారిశుద్ధ్య పనులు భేష్



**ఎ కొండూరు, మే 4, ప్రభాతవార్త :** స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా ఎ కొండూరు మండలం కృష్ణారావుపాలెం గ్రామంలో గ్రామ సర్పంచ్ పర్వతనేని నాగమల్లేశ్వరి చంద్రమోహన్‌రావు సెక్రటరీ డాలు రాకేష్‌ల ఆధ్వర్యంలో డ్రైన్లలో పూడికతీత రహదారి వెంబడి పిచ్చి మొక్కల తొలగింపు పారిశుధ్య చర్యల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. అలాగే గ్రామ పంచాయతీ పరిధి స్టీల్‌ప్లాంట్ వరకు పరిధికి చెందిన ఐరన్‌బోర్డు పెద్ద చెరువుకు సమీపం సరిహద్దు బోర్డులు ఏర్పాటు చేశారు. దీనివల్ల చీమలపాడు పంచాయతీ పరిధి ప్రారంభం మరియు ముగింపు ఎ కొండూరు హద్దులను సూచిస్తూ సర్పంచ్ నాగమల్లేశ్వరి చంద్రమోహన్‌రావు ఏర్పాటు చేసిన పంచాయతీ పరిధి ప్రారంభం ముగింపు సూచికల బోర్డులతో అటు పోలీసులకు ఇటు గ్రామ ప్రజలకు పరిధి అర్థమయ్యే రీతిలో ఏర్పాటు చేయడం పట్ల ఆయా గ్రామాల ప్రజలు ప్రయాణీకులు ప్రశంసించారు.

# ఎ కొండూరు మండల వైకాపా అధ్యక్ష స్థానం గిరిజన లంబాడాలకు కేటాయించాలి

## - హై కమాండ్‌కు భూక్యా నాగరాజు నాయక్ వినతి

**ఎ కొండూరు, మే 4, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండల వైసిపి అధ్యక్ష స్థానాన్ని ఎస్టీ గిరిజన లంబాడాలకు కేటాయించాలని మండల వైసిపి ఎస్టీ నాయకుడు భూక్యా నాగరాజు నాయక్, పలువురు మండల ప్రాంత ఎస్టీ లంబాడాలు వైసిపి అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండలంలో ఎస్టీలు 22వేల మంది ఉండగా తిరువూరు విసన్నపేట గంపలగూడెం మండలాల్లో ఓసిలు మండల వైసిపి అధ్యక్షులుగా ఉన్నారు. వైసిపి ఆవిర్భావం నుండి ఈ మండలంలోని ఎస్టీలను పార్టీ ఆదరిస్తుందని, గతం నుండి ఎస్టీలే మండల పార్టీ అధ్యక్షుడిగా పనిచేస్తున్నారని ఇదే పంథాను ఈ సారి కూడా కొనసాగించి ఎస్టీలకు కేటాయిస్తే ఈ మండలంలోని ఎస్టీలకు సముచిత స్థానం



కల్పించి తగు న్యాయం చేసినట్లుగా ఉంటుందని నాగరాజు నాయక్ పలువురు ఎస్టీలు హైకమాండ్‌ను కోరారు. ఈ మండల వైసిపి అధ్యక్ష స్థానాన్ని తనకు కేటాయిస్తే మండల కేంద్రంలో పార్టీ కార్యాలయం ఏర్పాటుతో పాటు వైసిపి కార్యకర్త ఎవరైనా చనిపోతే రూ.5వేలు ఆర్థిక సాయం లంబాడాల సాంప్రదాయ ప్రకారం హోలి పండుగ నాడు ప్రతి తండా గ్రామానికి రూ.5వేలు అందచేస్తానని ఏ కార్యకర్తకు ఆపదవచ్చిన ఏ సమస్య వచ్చినా తనకు ఫోన్ చేసిన మరుక్షణమే వచ్చి వారికి అండగా ఉంటానని నాగరాజు నాయక్ ఆదివారం మీడియా సమావేశంలో తెలిపారు. తనకు పదవులపై ఆశ లేదని కేవలం వైసిపి పటిష్టతకు బలోపేతానికి ఎస్టీ లంబాడాలను సంఘటితపర్చి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు అసెంబ్లీ ఎన్నికల్లో పులివెందుల పులి రాజన్నబిడ్డ మాజీ సిఎం జగనన్నను తిరిగి సిఎం చేయడమే ధ్యేయంగా పనిచేస్తానని నాగరాజు నాయక్ పేర్కొన్నారు.

# వృషభరాజముల ప్రదర్శన ధూళిపాళ్ళ కుటుంబానికే సాధ్యం

## -కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మెసాని చంద్రశేఖర్

పొన్నూరు, మే 4,ప్రభాతవార్త: దృఢమైన శరీరం, నడకలో రాజసం, పందెంలో పౌరుషం నింపుకున్న ఒంగోలు జాతి ఎడ్ల పందాలు నిర్వహించడం ఒక్క ధూళిపాళ్ళ కుటుంబానికే దక్కుతుందని కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మెసాని చంద్రశేఖర్ అన్నారు.



చేబ్రోలు మండలం, వడ్లమూడి క్వారీ శ్రీ బాలకోటేశ్వరస్వామి దేవాలయం వద్ద జరుగుతున్న ఒంగోలు జాతి వృషభరాజముల ఎండ్ల పందాల పోటీల్లో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి జ్ఞాపకార్థం ఆయన తనయుడు, ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ నిర్వహించడం అభినందనీయమన్నారు. స్వర్గీయ ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి నుంచి నేటి ఎమ్మెల్యే ధూళిపాళ్ళ వరకు పాడిపరిశ్రమాభివృద్ధికి చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. సంగం డెయిరీ అభివృద్ధిలో ధూళిపాళ్ళ కుంటుంబానిది ఎనలేని కృషి ఉందన్నారు. నరేంద్రకుమార్ పోటీలను చాలా అద్భుతంగా నిర్వహిస్తూ ఈ ప్రాంత వాసులకు హుషారును ఇస్తున్నారన్నారు. గెలుపొందిన ఎడ్ల జతకు ఇచ్చే నగదు బహుమతులు చూస్తే ఆశ్చర్యంగా ఉందన్నారు. లక్షలాది రూపాయలు విలువ చేసే బైకులను అందిస్తున్నారన్నారు. ఈ బహుమతులు చూస్తుంటే గెలిచినవారికి అదృష్టంగా ఉండబోతుందన్నారు. తెలుగు జాతి సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేవిధంగా ఇక్కడ పోటీలను చూస్తే తెలుస్తుందన్నారు. ఆర్థికశాఖామంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ మరుగున పడిపోతున్న ఎడ్ల ప్రదర్శనకు జీవం పోస్తున్న ఘనత ధూళిపాళ్ళ నరేంద్రకుమార్‌కు దక్కుతుందన్నారు. ఇక్కడి ఎడ్ల పందాలు చూస్తుంటే ఐపిఎల్ మ్యాచ్‌ను తలపిస్తున్నట్లు ఉందన్నారు. ఐదు రోజులపాటు ఎడ్ల పందాలు నిర్వహించడం అంటే ధూళిపాళ్ళకు పశువులపై ఎంత మమకారం ఉందో అర్థమవుతుందన్నారు. ఈ ప్రాంతానికి రాయలసీమ ప్రాంతానికి తేడా ఉంది. అదేమంటే ఈ ప్రాంత వాసులకు సంబంధించి ఎడ్లపాకకు, ఇంటికి దూరం ఉంటుంది. రాయలసీమ ప్రాంతంలో అయితే ఎడ్లపాక దాటిన తర్వాత మాత్రమే ఇంటికి వెళ్ళాల్సి ఉంటుందన్నారు. ఇలాంటి పశు సంపద చూసినప్పుడు రైతులకు, పశువులకు ఉన్నటువంటి గాఢమైన అనుబంధం అర్థమవుతుందన్నారు. పాత సంస్కృతి కోసం ప్రయత్నం చేస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ళకు పయ్యావుల



ధన్యవాదాలు తెలిపారు. నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ప్రస్తుతం యంత్రాలతో వ్యవసాయం చేసే రోజులు వచ్చాయని, అయినప్పటికీ ఒంగోలు జాతి పశు సంపదను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ధూళిపాళ్ళ నరేంద్రకుమార్‌కు పాడిపరిశ్రమాభివృద్ధిపై ఎంతో మమకారం ఉందని, అందుకే సంగం డెయిరీని ఉన్నతస్థితిలోకి తీసుకెళ్ళేందుకు కృషి చేస్తున్నారన్నారు. సంగం డెయిరీకి పాలు పోసే రైతుల కోసం, పాడిపశువుల కోసం కూడా వివిధ పథకాలను తీసుకొచ్చి అమలు చేస్తున్నారన్నారు. ఇది చాలా శుభపరిణామమన్నారు. గెలుపొందిన గిత్తల యజమానులకు నగదు పారితోషికాలను అందజేశారు.

# క్యాన్సర్ అంటువ్యాధి కాదు : డా.ఫణిరాజ్ కుమార్

**తిరువూరు, మే 4, ప్రభాతవార్త :** సరైన ఆహార నియమాలు వాక్సినేషన్ స్క్రీనింగ్‌లతో క్యాన్సర్‌ను ఎదుర్కోవచ్చునని డా.ఫణి రాజకుమార్ తెలిపారు. జనవిజ్ఞాన వేదిక తిరువూరు, రమేష్ హాస్పిటల్స్ విజయవాడ వారి సంయుక్త ఆధ్వర్యంలో తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగిన క్యాన్సర్ అవగాహన సదస్సులో ఆస్టర్ రమేష్ హాస్పిటల్లో సర్జికల్ అంకాలజిస్ట్‌గా పనిచేస్తున్న డా.ఫణి రాజ్‌కుమార్ ఆ క్రమంలో మాట్లాడుతూ ప్రస్తుత పరిస్తితిలో క్యాన్సర్‌కు బయపడే అవసరం లేదని, క్యాన్సర్ అంటువ్యాధి కాదని, పేషెంట్లను దూరంగా




ఉంచనవసరం లేదని, మరణం తప్పదు కనుక మందులతో జీవితకాలాన్ని పొడిగించకోవచ్చనేది అపోహ మాత్రమేనని, సరైన ఆహార నియమాలను పాటించడం రెగ్యులర్ హెల్త్ చెకప్‌లు వాక్సినేషన్‌లతో క్యాన్సర్‌ను నియంత్రించవచ్చని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు డా.రవీంద్ర, డా.రామకోటేశ్వరరావు, డా.సుభాష్, డా.సత్యతేజ, డా.మధుకీర్తి, జనవిజ్ఞాన వేదిక నాయకులు గంగాధర్, హరికృష్ణ, సుధాకర్, సుదర్శన్, పాపారావు పాల్గొన్నారు.

# పెదకూరపాడులో ట్రాఫిక్ నియంత్రణ ఎక్కడ.?

## - ప్రియ హోటల్ సెంటర్‌లో రోడ్డుపై పండ్లు, కూరగాయలు, జ్యూస్ పాయింట్లు - రథం సెంటర్లో ట్రాఫిక్ సమస్య

**పెదకూరపాడు, మే 4 ప్రభాతవార్త :** ప్రజల సమయాన్ని ట్రాఫిక్ సమస్య వలన వృధా అవుతుందని వాహనదారులు, స్థానిక ప్రజలు ఆరోపించారు. నిత్యం పెదకూరపాడు లో లగడపాడు రోడ్డు రథం సెంటర్ సమీపంలో, కచేరి సెంటర్ సమీపంలో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంటుందని, ఎదురుగా దగ్గరగా వాహనాలు వచ్చి ట్రాఫిక్‌లో ఇరుక్కుని తమ విలువైన సమయాన్ని కోల్పోతున్నామని వాహనదారులు వాపోతున్నారు. మార్జిన్‌ను ఆక్రమణ చేసి పండ్లు, కూరగాయలు, దుకాణాలు, తోపుడు బళ్ళు, జ్యూస్ పాయింట్‌లు ఏర్పాటు చేయడం వలన ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందన్నారు. కాలచక్ర ప్రధాన రోడ్డు చెరువుకోట సమీపంలో కుప్పలు కుప్పలుగా పట్టలు రోడ్డు పైనే వేయడం వల్ల వాహనాలు కనిపించక ప్రమాదాలకు నెలవుగా మారుతుందని ఆరోపించారు. బస్టాండ్ సెంటర్‌లో ప్రధాన రోడ్డుపైనే వాహనాలను, ద్విచక్ర వాహనాలు నిలిపి ట్రాఫిక్ సమస్యకు అంతరాయం కలిగిస్తున్నారని ప్రజలు




ఆరోపిస్తున్నారు. ఉదయం, సాయంకాలంలో ట్రాక్ పిక్ సమస్యను నియంత్రించేందుకు ఒక పోలీస్ కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. నిత్యం ట్రాఫిక్ సమస్య వలన



ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రజలు తమ అనుభవాలను వివరించారు. ఈ విషయమై పోలీస్‌శాఖ అధికారులు స్పందించి ట్రాఫిక్‌కు గల కారణాలను, సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ, వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.


# ఘనంగా అజ్మీర్ హజరత్ ఖ్వాజా బాబా ఛట్టీ షరీఫ్

**ఎ కొండూరు, మే 4, ప్రభాతవార్త :** అరేబియా దేశంలోని మక్కా అంతటి పవిత్ర పుణ్యక్షేత్రం తర్వాత భారతదేశంలో గల రాజస్థాన్‌లోని అజ్మీర్ షరీఫ్‌లో వేంచేసి వున్న హుజుర్ హజరత్ సర్కార్ సయ్యద్ హిందల్ వలి అతా యె రసూల్ ఖ్వాజయె ఖ్వాజగాన్ ఖ్వాజా మొయినుద్దీన్ హసన్ చిష్టి సంజరి అజ్మీరి గరీబ్ నవాజ్ దస్తగిరి బేకసా అజ్మీర్ షరీఫ్ (ర.అ) వారి ఛట్టీ షరీఫ్‌ను ఆదివారం ఎఎంటికె దర్బార్ బాబె ఎ బాగ్దాద్‌లో హజరత్ అతావుల్లా బాబా ఆశీస్సులతో పీఠాధిపతి మొహమ్మద్ ఖాజా బాబా భక్తి శ్రద్దలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి కులమతాలకతీతంగా దర్బార్ అండ్ దర్గాకు వెళ్లిన భక్తులకు మహాదివ్య అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎండి జాఫర్ షరీఫ్, బొగ్దాది తాజ్ ఖాదర్ బాబు, గౌస్, జానీ బాబు తదితరులు పాల్గొన్నారు.

# డిసిసి బ్యాంకు ఛైర్మన్‌గా నెట్టెం రఘురామ్

## హర్షం వ్యక్తం చేసిన 'అలవాల'

**ఎ కొండూరు, మే 4, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మాజీ మంత్రి నెట్టెం రఘురామ్‌ను ఉమ్మడి కృష్ణ డిసిసి బ్యాంక్ ఛైర్మన్‌గా సిఎం నారా చంద్రబాబునాయుడు నామినేటెడ్ పదవుల కేటాయింపులో భాగంగా రఘురామ్‌ను నియమించడం పట్ల తిరువూరు ఎఎంసి



మాజీ ఛైర్మన్ అలవాల రమేష్ రెడ్డి హర్షం ప్రకటించారు. ఈ సందర్భంగా రమేష్‌రెడ్డి జగ్గయ్యపేటలో నెట్టెం రఘురామ్ ఇంటికి వెళ్లి రఘురామ్ హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రమేష్‌రెడ్డి మాట్లాడుతూ రఘురామ్ పార్టీకి నిబద్దతతో క్రమశిక్షణతో పనిచేసి పార్టీ బలోపేతానికి కృషిచేస్తూ సార్వత్రిక ఎన్నికల్లో తెదేపా కూటమి విజయపథంలో పయనించడానికి విశేష కృషి చేశారని అలాగే ఆ కృషి ఫలితంగానే రఘురామ్‌కు రాష్ట్ర ఆబ్కాబ్ ఛైర్మన్ పదవిని సిఎం చంద్రబాబు కేటాయిస్తారని అలవాల రమేష్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంకా రమేష్ రెడ్డి వెంట తెలుగు యువత అధ్యక్షుడు పిట్టా చైతన్య టిడిపి లీగల్ సెల్ రామ్‌ప్రసాద్ రెడ్డి బిసిసెల్ మండల అధ్యక్షుడు చీమలపాడు టిడిపి అధ్యక్షుడు బెజవాడ శంకర్, గొర్ల రమేష్‌రెడ్డి, చల్లపల్లి కృష్ణ, రాంబాబు, మాజీ సర్పంచ్ చంద్రు నాయక్ కిషోర్, మహేష్, రాజ్‌కుమార్, శౌరి (మేస్త్రీ) సోమయ్య, దారా బుజ్జి తెదేపా తదితరులు కుటుంబ సభ్యులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమాజ సేవ దేవుని వరం

## -గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్

**గుంటూరుతూర్పు,మే4,ప్రభాతవార్త :** అంజుమన్‌ఏఇస్లామియా కమిటీ,ముస్లిం యూత్ కమిటీ ఆధ్వర్యంలో పేద ముస్లింల పిల్లలకు ఉచితంగా ఖత్నా నిర్వహించడం అదృష్టమని, సమాజ సేవ దేవుని వరమని



గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. ఆదివారం గుంటూరులోని అంజుమన్‌ఏఇస్లామియా స్కూల్లో పేద పిల్లలకు ఉచితంగా ఖత్నా, పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ పేద కుటుంబాలకు చెందిన 350 మంది చిన్నారులకు ఖత్నా నిర్వహించి వారికి అవసరమైన మందులు ఉచితంగా అందించడం అభినందనీయమన్నారు. పిల్లలతో వచ్చిన తల్లిదండ్రులకు ఉచితంగా భోజనవసతితోపాటు రవాణా ఖర్చులు సైతం అందించారని, ఇది గొప్ప కార్యక్రమమని చెప్పారు. తొలుత పౌష్టికాహారానికి సంబంధించిన ప్యాకెట్లు, మందులు పరిశీలించి వైద్యులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఆరిఫ్, రౌఫ్, సలీం, రెహమాన్, షౌకత్, జిలాని, ముస్లిం యూత్ అసోసియేషన్ మిటీ సభ్యులు తదితులు పాల్గొన్నారు.

# ఇస్సపాలెం ఆర్యవైశ్య అన్నదాన సత్రంలో అన్నదానం

**నరసరావుపేట టౌన్, మే 4 ప్రభాతవార్త :** మండలంలోని ఇస్సపాలెం గ్రామంలో ఉన్న ఆర్యవైశ్య అన్నదాన సత్రంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం జరిగింది. నిర్వాహకులు బత్తుల మురళీ వివరాలను తెలియజేశారు. అన్నదాన సత్రంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖులు స్వర్ణ చిన్నరామిరెడ్డి, రవిలు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో గణపతి ప్రార్థన, పూజా కార్యక్రమాలు, మహిళలచే గీతా పారాయణం జరిగిందన్నారు.

# రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది : ఎమ్మెల్యే అరవింద్‌బాబు

**నరసరావుపేట, మే 4 ప్రభాతవార్త :** రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. ఆదివారం పల్నాడు జిల్లా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల, ఉద్యోగుల మహాజన సభను నిర్వహించారు.



పట్టణంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబుతో పాటు ప్రముఖులు కపలవాయి విజయ్‌కుమార్ హాజరయ్యారు. ఎమ్మెల్యే అరవింద్‌బాబు మాట్లాడుతూ ఉద్యోగులు రైతులకు అండగా నిలవాలన్నారు. ఎటువంటి సమస్యలు ఉన్నా నేరుగా తమ దృష్టికి తీసుకురావచ్చున్నారు. ప్రభుత్వం రైతుల కొరకు చేస్తున్న మంచి పనులను వారికి అందించేందుకు వారధిలా పని చేయాలన్నారు. ఉద్యోగుల సమస్యలకు సంబంధించి తప్పకుండా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. నరసరావుపేట నియోజకవర్గంలో ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘాలకు అండగా నిలుస్తామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెండింగ్‌లో ఉన్న పిఆర్‌సిల గురించి, రూ.10 లక్షల వరకు గ్రాడ్యూటీ పెంపుదలపై, పదవీ విరమణ వయస్సు 60-62 సంవత్సరాలకు పెంపుదలపైన సంఘ సభ్యులు చర్చించారు. సంఘం నాయకులు ఆరాధ్యుల శ్రీనివాసరావు, ఏరువ వెంకటనారాయణ, దొప్పలపూడి శ్రీనివాసరావు, నాగప్రసాద్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతిలో వేదాంతు లెర్నింగ్ సెంటర్ ప్రారంభం

**విజయవాడ, మే 4, ప్రభాతవార్త :** ప్రముఖ విద్యావేదిక వేదాంతు ఆదివారం తిరుపతి న్యూ మారుతి నగర్లో ప్రారంభించారు. అధిక నాణ్యత గల విద్యనందించడమే లక్ష్యంగా దేశమంతటా జెఇఇ, నీట్, స్టేట్‌బోర్డు పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు కొత్త బెంచ్‌మార్క్‌ను నిర్దేశిస్తుందని నిర్వహకులు పేర్కొన్నారు.

# శాంసంగ్ ఫ్యాబ్ గ్రాబ్ ఫెస్ట్‌లో భారీ తగ్గింపు

**విజయవాడ, మే 4, ప్రభాతవార్త :** ఈవేసవిని మరింత వేడెక్కిస్తూ ఫ్యాబ్ గ్రాబ్‌ఫెస్ట్‌ను మళ్లీ తెస్తున్నట్లు శాంసంగ్ ఇండియా ప్రతినిధులు తెలిపారు. అదు భ్తతమైన పరిమితకాలపు ఆఫర్లలో భాగంగా గాడ్జెట్లు, ఉపకరణాలపై భారీ తగ్గింపులందిస్తున్నామన్నారు.

# శిరిగిరిపాడు గ్రామంలో పోలీసుల కార్డెన్ సెర్చ్

**వెల్దుర్తి,మే4,ప్రభాతవార్త:** శిరిగిరిపాడు గ్రామంలో పోలీసుల కార్డెన్ సెర్చ్‌పల్నాడుజిల్లా మాచర్ల నియోజకవర్గం వెల్దుర్తి మండలం పరిధిలోని శిరిగిరిపాడు గ్రామంలో ఒకే సామాజిక వర్గానికి చెందిన టిడిపి,వైసిపి పార్టీకి చెందిన వర్గీయుల మధ్య గొడవ నేపథ్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గురజాల డి.ఎస్.పి ఆధ్వర్యంలో గురజాల సర్కిల్లోని అన్ని పోలీస్ స్టేషన్లలోని సిబ్బందితో కలిసి వెల్దుర్తి మండలం లో ఈరోజు ఉదయం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ కార్డెన్ సెర్చ్ లో భాగంగా సరైన ధ్రువీకరణపత్రాలు లేని 21 మోటార్ సైకిల్లు,కత్తులు, గొడ్డళ్లు, గడ్డ పలుగులు, ఇనుపరాడ్లు, కర్రలు,కారం నీటితో కలిపిన బాటిల్లు, బడిసెలు, గోతాలతో నింపిన రాళ్లను పోలీసులు గుర్తించారు. శిరిగిరిపాడు గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు



# ప్రధాని నరేంద్ర మోదీ చెప్పిన గ్రహణం వైకాపానే : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు కార్పొరేషన్,మే4,(ప్రభాతవార్త :** జగన్ మోహన్ రెడ్డి మెప్పుకోసం, అంబటి రాంబాబు ప్రాకులాట... ఎమ్మెల్యే గళ్ళా మాధవి...అమరావతి పై వైసిపి నేతలు నోరు పారేసుకుంటే ప్రజల నుండి తీవ్ర ప్రతిఘటన



తప్పదు...అమరావతి పునఃనిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ చెప్పిన గ్రహణం వైసీపీనే అని, అది ఇంకా ఆంధ్ర ప్రజలను వదలలేదని, జగన్ రెడ్డి కో రూపంలో పట్టి పీడిస్తుందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి మండిపడ్డారు. ఆదివారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో ప్రజలు, పార్టీ నేతల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ అమరావతి పర్యటనకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుండి భారీగా జన సమీకరణ చేసి విజయవంతం చేయటానికి కృషి చేసిన నేతలు ప్రజలకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పార్టీ శ్రేణులను ఉద్దేశించి ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... ఆంధ్రుల కలల రాజధాని అమ రావతికి ఇక తిరుగు లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యలతో స్పష్టమైనది అన్నారు. కనీవిని ఎరుగని రీతిలో అమరావతి పునః ప్రారంభం సభ విజయవంతం చేసి, ఆంధ్రులు తమ ఆకాంక్షను బలంగా చాటి చెప్పారని, దీనిని చూసి వైసిపి నేతల వెన్నుల్లో వణుకు పుట్టి ఇష్టానుసారం మీడియా ముందు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సత్తెనపల్లి మాజీ ఎమ్మెల్యే అంబటి రాంబాబును ఇంచార్జీ పదవి నుండి తొలగించిన నాటి నుండి భయం పట్టుకుందని, వైసీపీలో తన మనుగడ కోసం, జగన్ మోహన్ రెడ్డి మెప్పు కోసం అంబటి రాంబాబు ప్రాకులాడుతున్నారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఎద్దేవా చేశారు. గడిచిన 5ఏళ్ల కాలంలో అమ రావతిని స్మశానం అని, రైతులను పెయిడ్ ఆర్టిస్టులు అని, అక్రమ కేసులు బనాయించి, మహిళల పట్ల కర్కశంగా వ్యవహరించిన విషయం ప్రజలు ఎవరు మర్చిపోలేదన్నారు. అమరావతి సభకు జగన్ రెడ్డిని ఆహ్వానించిన కూడా రాకుండా ఉండటం ప్రజలను అవమానించటమేనన్నారు. దీనిని కప్పిపుచ్చుకోవడానికి అంబటి రాంబాబు వంటి నేతలు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ వచ్చే ప్రాంతాల్లో అలజడి సృష్టించాలన్న లక్ష్యంతో పైపులు వంటివి తగలబెట్టటం, నేడు శిలాఫలకాలు ధ్వంసం చేయడం వెనుక కుట్ర దాగి ఉందని, దీనికి బాధ్యులైన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుందన్నారు. వైసిపి నేతలు ఎన్ని కుట్రలు చేసిన అమరావతిలో ఒక్క ఇటుక రాయిని కూడా కదిలించలేరని, మీ తీరు మార్చుకోకపోతే వైసిపి నేతల ఇళ్ళు,కార్యాలయాలు ప్రజలే ముట్టడిస్తారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హెచ్చరించారు.

## నేడే ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో పౌరాణిక నాటికలు

**పెదకూరపాడు, మే 4 (ప్రభాతవార్త :** కళల కోసం కాదు కల ప్రజల కోసం ప్రజా చైతన్యం నీ కోసం సాంప్రదాయ కళలను ప్రోత్సహించండి కళాకారులను ఆదుకోండి అనే నినాదంతో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో శ్రీ సాయి నటరాజనాట్యమండలి సమర్పణ ఈ నెల 5,6 తేదీలలో నిర్వహిస్తున్నట్లు ఏపి ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి బైరాపట్నం రామకృష్ణ తెలిపారు. అమరావతిలోని బస్టాండ్ వద్ద 5వతేదీ సాయంత్రం 7 గంటలకు, అలాగే 6వ తేదీ మంగళవారం సాయంత్రం 7 గంటలకు ఉచిత నాటక ప్రదర్శనలు ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. అలాగే కార్యక్రమంలో కవులు, కళాకారులు, వర్ధమాన సినీనటులకు ఆత్మీయ సత్కారం జరుగుతుందన్నారు. సమావేశంలో పెదకూరపాడు నియోజకవర్గ ప్రజానాట్య మండలి కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు, జాస్తి సత్యమూర్తి, సి.హెచ్.ఉదయ్‌శేఖర్, శ్రీనివాసరెడ్డి, యం.నాగేశ్వరరావు, గుంటూరు రాజు, బత్తిన రామయ్య, ఎన్.శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తాం

-ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్


**పొన్నూరు, మే 4,(ప్రభాతవార్త):** దేవాలయాలను అభివృద్ధి చేసేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తామని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. పట్టణంలో వేంచేసియున్న సాక్షి శ్రీ భావనారాయణస్వామివారి దేవాలయంలో పురాణ కాలక్షేప మండపానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. భక్తులకు



మెరుగైన వసతులు కల్పించేలా చర్యలు తీసుకొంటున్నట్లు చెప్పారు. దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వంతో పాటు ప్రజలు, దాతలు భాగస్వామ్యం కావాలన్నారు. ప్రజలు, భక్తుల భాగస్వామ్యంతో ఎంతో అభివృద్ధిని సాధించవచ్చన్నారు. సీజీఎఫ్ నిధులు, దేవాలయం నిధులు వెరసి రూ.45లక్షలతో పురాణ కాలక్షేప మండపం నిర్మాణం చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పట్టణంలో అతిపురాతనమైన దేవాలయం సాక్షి భావన్నారాయణ ఆలయమన్నారు. ఈ ఆలయం గత పాలకుల నిర్లక్ష్యంతో వెనుకబడిపోయిందన్నారు. గత ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వల్ల దేవాలయానికి అనుబంధంగా ఉన్నటువంటి ఓరియంటల్ పాఠశాల, సంస్కృత కళాశాలలు కూడా మాయమయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలోని అన్ని దేవాలయాలను ఏ విధంగా అభివృద్ధి చేయాలన్న ఆలోచనతో, ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, అర్చకులు నారాయణం రాంబాబు, గోవర్ధనం రామకృష్ణ, రొంపిచర్ల రాజాకృష్ణమాచార్యులు, నాయకులు చెన్నుపాటి శ్రీనివాసరావు, మాదల వెంకటేశ్వరరావు, యరసాని శ్రీరామమూర్తి, కత్తు రవికిరణ్, యన్నం నాయుడు, గోవాడ వెంకటకృష్ణారావు, చెన్నుపాటి భాస్కర్, బండ్లమూడి బాబూరావు, పఠాన్ పిరోజ్‌ఖాన్, తదితరులున్నారు.

## శ్రీశృంగేరి శ్రీవిరూపాక్ష శ్రీపీఠంలో వైభవంగా శ్రీభారతి మహోత్సవాలు

**గుంటూరు విద్య,మే 4,(ప్రభాతవార్త :** శ్రీ మహా కామేశ్వరీ ధర్మ పరిపాలన సంఘం ఆధ్వర్యంలో స్థానిక అరండల్‌పేట 4/2లో కొలువైఉన్న శ్రీశృంగేరి శ్రీవిరూపాక్ష శ్రీపీఠంలో 3రోజులుగా జరుగుతున్న శ్రీభారతి మహోత్సవాలు ఆదివారం నిత్యపూజలు



అనంతరం శ్రీపీఠాధిపతి శ్రీ శ్రీ రాజరాజేశ్వరీ ప్రతాప భారతి పదవేశ అనుగ్రహంతో పరమహంస పరివ్రాజకాచార్య జగద్గురు శ్రీగంభీరానంద భారతి స్వామి వే శ్రీశృంగేరి శ్రీవిరూపాక్ష శ్రీపీఠంకు పరమహంస పరివ్రాజకులు శ్రీవర శివానంద భారతీ స్వామి వారికి ఉత్తర పీఠాధిపతిగా పట్టాభిషేక మహోత్సవం అశేష భక్తజనుల సమక్షంలో వైభవంగా నిర్వహించారు. శిష్యులకు తీర్థప్రసాద వినియోగం అనంతరం అన్న ప్రసాద వితరణ గావించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీశ్రీ గంభీరానంద భారతీ మహా స్వాములు అనుగ్రహ భాషణం చేస్తూ శుక్రవారం శంకరజయంతి, శనివారం విద్యారణ్య భారతీ స్వామి వారి జయంతి, ఆదివారం శ్రీప్రతాప భారతి అమ్మవారి ప్రతిష్ఠా దివసము పట్టాభిషేకం సంకల్పం పట్టాభిషేకం జరిపామన్నారు. సోమవారం శ్రీ కళ్యాణానంద భారతి మాంతాచార్య మహాస్వామి వారి జయంతి కూడా జరుగుతుందని తెలియజేశారు. హిందూ కళాశాల అధ్యక్షులు శ్రీ ఎ.వి.ఎస్ సోమయాజి ఆధ్వర్యంలో అక్షరాభ్యాస జ్ఞాపికను గంభీరానంద భారతీ స్వామిజీ ద్వారా పట్టాభిషిక్తులైన వర శివానంద భారతీ స్వామి వారికి అందజేశారు. కార్యక్రమంలో ఆడిటర్ జి.శివరామకృష్ణప్రసాద్, పరమహంస, హైకోర్టు న్యాయవాది కృష్ణప్రసాద్, నగర వైదిక ప్రముఖులు, పాల్గొన్నారు.

## నవ్యాంధ్ర టూ వీలర్స్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి సమావేశం

**గుంటూరు విద్య,మే 4,(ప్రభాతవార్త :** నవ్యాంధ్ర టూ వీలర్స్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశం ఆదివారం అరండల్‌పేట 1లైనులోని ఓ హోటల్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సమావేశానికి అసోసియేషన్ వ్యవస్థాపకులు సుభాని నాయకత్వం వహించారు. రాష్ట్ర అధ్యక్షులు ఉల్లి సాంబశివరావు తదితర రాష్ట్ర నాయకులు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ అసోసియేషన్ లో ఉండి, కోట్లకాలం వివిధ పదవులు అనుభవించి తదుపరి మరో అసోసియేషన్ లోకి వెళ్ళి, ఈ అసోసియేషన్ పై ఆరోపణలు చేస్తున్న వ్యక్తుల మాటలు నమ్మవద్దని సమావేశపరంగా మెకానిక్స్ మిత్రులకు విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ నుండి



వెళ్లిన కొంతమంది కావాలనే అసోసియేషన్‌ను విచ్ఛిన్నం చేయడానికి ప్రభుత్వం ఒ మెకానిక్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తుందని మీకు ఆ పదవులు ఇప్పిస్తాం ఈ పదవులు ఇప్పిస్తాం అంటూ మభ్యపెడుతున్నారని ఆరోపించారు. నవ్యాంధ్ర టూ వీలర్స్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పట్ల ఎవరూ ఎలాంటి ఆరోపణలు చేసిన అవి సత్యదూరమని నాయకులు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో అసోసియేషన్ బలోపేతానికి సమగ్ర చర్యలు చేపడతామని ఈ సందర్భంగా వెల్లడించారు. విజయవాడ వరదల సమయంలో అసోసియేషన్ పెద్దఎత్తున సహాయ సహకారాలు అందించిన విషయాన్ని ఈ సందర్భంగా నాయకులు వివరించారు. విలేకరుల సమావేశంలో అసోసియేషన్ నాయకులు కె.శౌరి, అన్వర్‌భాషా, అశోక్, ముస్తఫా, సిలార్, రఫీ, వెంకటేశ్వర్లు, చందు భవాని శంకర్, ఎస్.అహ్మద్, నూర్, హోండా శ్రీను, బాజీ,పి. శ్రీను, గోపాల్, సురేష్, రెడ్డి, సైదులు తదితర నాయకులు పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి సమావేశానికి వివిధ జిల్లాల నుండి అసోసియేషన్ నాయకులు హాజరయ్యారు.

## మధుమేహం పై సరైన అవగాహన కలిగి ఉండాలి

**గుంటూరు కల్చరల్,మే 4,(ప్రభాతవార్త :** అవగాహన సంస్థ ఆధ్వర్యంలో మధుమేహం,బిపి వ్యాధులపై జరిగిన ఆరోగ్యసభలో ప్రముఖ డయాబెటాలజిస్టు డాక్టర్ వి.వి.రామ్‌కుమార్ పాల్గొని,మాట్లాడుతూ మన భారతదేశం డయాబెటిక్ హబ్ గా మారిందని. ఈ సమస్యకు మూలకారణం జీన్స్,ఊబకాయం,సరైన వ్యాయామం లేకపోవడం అధికమొత్తంలో ఆహారం తీసుకోవడం తదితరాలు ముఖ్యకారణంగా కనబడుతున్నాయన్నారు. కావున వారానికి ఐదురోజులు రోజుకు గంట చొప్పున వ్యాయామం చేస్తూ,మంచి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం మంచిదన్నారు. ఏప్రిల్ 4 ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా అవగహన సభ్యులందరికీ ప్రపంచ నవ్వుల దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేసూ్త అందరూ ఆరోగ్యంగా ఉండాలని,నవ్వడం మానసిక ప్రశాంతత లభిస్తు మన చుట్టుపక్కల వారితో స్నేహ సంబంధాలు మెరుగై మనకు మంచి ఆరోగ్యం కలుగుతుందన్నారు. సంస్థ సభ్యుల సందేహాలను నివృత్తిచేశారు. అనంతరం అవగాహన సంస్థ సభ్యులు డాక్టర్‌ను ఘనంగా సత్కరించారు. సమావేశానికి టివి సాయిరామ్ కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా,వాణిజ్యవేత్త బాదం బసవ గుప్త,రాడికల్ హ్యూమనిస్ట్ నాయకులు కె.చంద్రశేఖర్‌రావు,తదితరులు ప్రసంగించారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం : సీపీఎం నాయకులు డిమాండ్

**వినుకొండ,మే4,(ప్రభాతవార్త:** ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమౌతుందని జిల్లా సీపీఎం కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ ధ్వజమెత్తారు. వినుకొండ మండలంలోని విఠంరాజుపల్లి, బ్రాహ్మణపల్లి, నరగాయపాలెం, నాగిరెడ్డి పల్లి,శివాపురం తదితర గ్రామంల్లో ప్రజలు




ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకునేందుకు సీపీఎం నాయకులు ఆదివారం సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు అరుంధతి కాలనీ, మాలక్ష్మ కాలనీల్లో ఎస్సీ, ఎస్టీ వాసులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం అన్నారు. అంగన్‌వాడీ కేంద్రం, మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని లేదంటే పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి బంకూరి వెంకటేశ్వర్లు, కె. హనుమంతరెడ్డి, వెంకటప్పయ్య, ఎం. వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

వినుకొండ,మే4,(ప్రభాతవార్త: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు పదో తరగతి



చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పల్నాడు రోడ్డు నందు గల బృందావనం ఫంక్షన్ హాలు నందు ఆదివారం ఘనంగా జరిగింది. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఆహ్లాదంగా గడిపారు. చదువు చెప్పిన గురువులను పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించి, సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈవోలు జాన్ సుందరరావు, రామారావు, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా పోలేరమ్మ అమ్మవారి దేవాలయ ప్రతిష్ఠామహోత్సవం

**దాచేపల్లి,మే 4,(ప్రభాతవార్త:** దాచేపల్లి పట్టణంలోని ఎస్‌సి కాలనీ నందు గల అతి పురాతనమైన గ్రామ దేవత శ్రీపోలేరమ్మ తల్లి దేవాలయంలో పోలేరమ్మ,,జై దుర్గాదేవి,పోతురాజు స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు. ముందుగా యరపతినేని శ్రీనివాసరావుకు ఆలయ అభివృద్ధి కమిటీసభ్యులు తంగెళ్ళ శ్రీనివాసరావుపూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా యరపతినేని మాట్లాడుతూ 300యేండ్ల నాటి ఆలయాన్ని తంగెళ్ళ శ్రీనివాసరావు భుజాలపై వేసుకొని ఆలయ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని నడిపిస్తున్న తంగెళ్ళను అభినందించి యరపతినేని ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యరపతినేని మాట్లాడుతూ మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన భాద్యత ప్రతి ఒక్కరిపై వుందని అన్నారు. శ్రీపోలేరమ్మ తల్లి ,పోతురాజు,దుర్గాదేవి ఆశీస్సులతో పల్నాడు ప్రాంతం శుభిక్షంగా ఉండాలని ప్రజలందరూ శుఖశాంతులతో అందరి కుటుంబాలు ఆనందంతో అర్ధికంగా అభివృద్ధి చెందే విధంగా ఆ తల్లి దీవెనలు అందరిపై వుండాలని అన్నారు. అనంతరం గ్రామ ప్రజల సహాయ సహకారంతో స్ధానిక బోద్రాయి సెంటర్‌లో భారీ అన్నదాన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు మహిళలు భక్తులు పెద్ద సంఖ్యలోపాల్గొన్నారు.



## మహిళల ఆర్థిక స్వావలంబనకోసమే కుట్టు మిషన్ ఉచిత శిక్షణ

-గురజాల శాసనసభ్యులు యరపతినేని


**దాచేపల్లి,మే 4,(ప్రభాతవార్త:** ఆర్థిక స్వావలంబనకోసమే కుట్లు మిషన్ ఉచిత శిక్షణా కార్యక్రమమని గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనవాసరావు అన్నారు. స్దానిక ఎండిఓ కార్యాలయంలో రాష్ట్ర బిసి, ఈ.డబ్లూ.ఎస్ కార్పోరేషన్లు సంయుక్తంగా చేపట్టిన కుట్టు మిషన్ ఉచిత శిక్షణా కార్యాక్రమాన్ని గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు ఆదివారం రిబ్బన కట్ చేసి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్బంగా యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ 2014లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు ఉచిత కుట్టు మిషన్ శిక్షణను ప్రారంభించారని అనేక మంది



మహిళలు శిక్షణ పొందిన తరువాత ఆర్దికంగా వారి కుటుంబాలకు అండగా నిలిచారన్నారు..కుటమి ప్రభుత్వం కూడా మహిళలు ఆర్దికంగా అభివృద్ధి చెందాలని ఈ కుట్టు మిషన్ ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఉచిత కుట్టు మిషన్ల శిక్షణ మహిళలకు ఆర్దిక స్వాలంబనసాధించడానికి స్వయం ఉపాధి పొందడానికి ఒక గొప్ప వరమన్నారు. ఎటువంటి ఇబ్బందులు ఉన్నా మీ అన్నగా మీకు అన్నివిధలా తోడుగా ఉంటానని ఈ సందర్మంగా యరపతినేని అన్నారు. ఈ కార్యాక్రమంలో ఎండిఓ మహిళలు తేదేపా నేతలు తదితరులు పాల్గోన్నారు.

## 25 ఏళ్ల అపూర్వ కలయిక : పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


**రెంటచింతల, మే 4 (ప్రభాతవార్త:** మండల పరిధిలోని పాలువాయి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2000-2004 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఆరు




నుంచి పదో తరగతి వరకు చదివిన విద్యార్థులు 25 ఏళ్ల తర్వాత ఒక్కచోట కలుసుకుని ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. చదివిన పాఠశాల తరగతి గదులను, పరిసరాలను చూసి భావోద్వేగానికి గురయ్యారు. నాడు గురువులు నేర్పిన క్రమశిక్షణ, చదువుతో ఈ రోజు వివిధ స్థాయిల్లో ఉన్నామని తెలిపారు. ఈ సందర్భంగా తమకు పాఠాల నేర్పిన గురువులను వారు ఆహ్వానించి ఘనంగా సన్మానించడంతోపాటు పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులు వారు చదువుకున్న రోజుల్లో కొన్ని సంఘటనలను గుర్తు చేసుకుని సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. పూర్వ విద్యార్థులందరూ ఒకే వేదికపై కలుసుకుని ఫొటోలు తీసి మధుర స్మృతులతో ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో మాజీ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు అలవాల శివశంకరరెడ్డి, మాధం శ్రీనివాసరావు, ఎం.కాశీరెడ్డి, ఓ.నాగభూషణాచారి, శ్యామల శ్రీనివాసరెడ్డి, పూర్వ విద్యార్థులందరూ పాల్గొన్ని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## ఆలయ అభివృద్ధికి సహకరిస్తా : ఎమ్మెల్యే యరపతినేని

**గురజాల, మే 4 (ప్రభాతవార్త:** ముత్యాలమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి తన వంతు సహకరిస్తానని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మండలంలోని గంగవరం గ్రామంలో శ్రీముత్యాలమ్మ తల్లి, నాభిశిల, ధ్వజస్తంభ, పోతురాజు శిఖర ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ గ్రామాల్లో ఆధ్యాత్మికత ద్వారా ప్రశాంత వాతావరణం నెలకొంటుందన్నారు. గ్రామస్తులు సోదరబావంతో మెలిగి ఘర్షణలు, వివాదాలు దూరంగా ఉండాలన్నారు. అనంతరం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆలయ



నిర్మాణానికి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు రూ. 1.50 లక్షలను ఆలయ కమిటి సభ్యులకు విరాళంగా అందించారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

# ఉత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించాలి

-ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

**పొన్నూరు, మే 4,(ప్రభాతవార్త:** సాక్షి శ్రీ భావనారాయణస్వామి వార్షిక బ్రహోత్సవాలను అత్యంత ఘనంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆదేశించారు. స్థానిక దేవాలయానికి వచ్చిన ఎమ్మెల్యే నరేంద్రకు అర్చకస్వాములు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. దేవాలయంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ళ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాన్ని, పరిసర ప్రాంతాలను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. భక్తులకు ఏర్పాటు చేసిన వసతులు, తదితర విషయాలపై అధికారులతో మాట్లాడారు. కోనేరు పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. దేవునికి



చేయాల్సిన కైంకర్యాల విషయంలో వెనుకడుగు వేయడం కానీ, తూతూ మంత్రంగా నిర్వహించడం కానీ చేస్తే సహించబోనన్నారు. తిరునాళ్ళ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించాలని అర్బన్ సిఐ వీరా నాయక్‌ను ఆదేశించారు. దేవాలయ ప్రాంగణంలో కళ్యాణ మండప నిర్మాణానికి సంబంధించి ప్రపోజల్స్ ఇవ్వాలని అసిస్టెంట్ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, అర్చకులు పాల్గొన్నారు.

# చదువుతోనే అసమానతలు మాయం

-ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

**పొన్నూరు, మే 4,(ప్రభాతవార్త:** చదువు ద్వారానే అసమానతలు దూరమవుతాయని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. నిడుబ్రోలు 5వ వార్డు మునిసిపల్ పాఠశాల విద్యార్థిని పాలపర్తి భార్గవి 600ల మార్కులకు 569మార్కులు సాధించడంతో భార్గవిని అభినందించారు. టిడిపి అధ్యక్షుడు జాగర్లమూడి సుధీర్ చిన్నారి భార్గవికి ఎమ్మెల్యే నరేంద్ర చేతుల మీదుగా రూ.5వేలు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధూళిపాళ్ళ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యకు సంబంధించిన ప్రత్యేకమైన శ్రద్ధ పెట్టడం వల్లే పదిలో, ఇంటర్‌లో ఉత్తీర్ణతాశాతం పెరిగిందన్నారు.



గత ప్రభుత్వం విద్యను నిర్లక్ష్యం చేసిందన్నారు. విద్యాశాఖామంత్రి నారా లోకేష్ విద్యాశాఖలో సమూలమైన మార్పులు తెచ్చారన్నారు. పేదలు విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశంతో వారి కోసం ఎన్నో సంస్కరణలు తెచ్చారన్నారు. విద్యార్థులు కూడా చక్కగా చదువుకొని ఉన్నతులుగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి కొల్లి విజయభాస్కర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి, నాయకులు సుఖవాసి సుధీర్‌చంద్, ఎద్దు సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి


-మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు

**పొన్నూరు, మే 4,(ప్రభాతవార్త:** ఆధార్‌లో తప్పులు, చేర్పులు, మార్పులు చేసుకొనేందుకు ప్రజల సౌకర్యార్థం ఈ నెల 5వ తేదీ నుంచి ప్రత్యేక క్యాంపులను నిర్వహిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ నెల 5వ తేదీ నుంచి ఆరవ తేదీ వరకు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్ణీత ప్రాంతాల్లో అందుబాటులో ఉంటారన్నారు. 5,6తేదీలలో 8,16,27 అంగన్‌వాడీ కేంద్రాలలో 7,8 తేదీలలో 9,26 వార్డుల అంగన్‌వాడీ కేంద్రాలు, 12,13తేదీలలో 9వ సచివాలయం,11,23అంగన్‌వాడీ కేంద్రాలు, 14,15తేదీలలో 7,22, అంగన్‌వాడీ కేంద్రాలలో ఆదార్‌కు సంబంధించిన సేవలను పొందవచ్చన్నారు. 22,23,26,27వార్డులకు సంబంధించి ఇన్‌చార్జిలుగా ఎడ్యుకేషన్ సెక్రటరీలు షేక్ ఆషిప్‌బాష, 7,8,9,11వార్డులకు సంబంధించి ఎ.ధీరజ్, 9,16వార్డులకు సంబంధించి కె.షీబారాణి నియమించడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## ప్రారంభమైన భావదేవుని బ్రహ్మోత్సవాలు

**పొన్నూరురూరల్, మే 4 (ప్రభాతవార్త:** టెంపుల్ సిటీగా ప్రసిద్దిగాంచిన శ్రీ సుందరవల్లీ రాజ్యలక్ష్మి సమేత శ్రీ సాక్షి భావనారాయణస్వామివారి



బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ముందుగా విష్వక్సే నారాధన, పుణ్యాహవాచనం, రక్షాధారణ, మహీపూజ, నవకుంభారాధన, అంకురార్పణా దేవతల ఆహ్వాన కార్యక్రమాలు జరిగాయి. ఆ తరువాత విశేష హోమం జరిపి వస్త్రముపై లిఖించిన "గరుత్మంతు"ని పటమును ముఖ మండపంలో ఉంచి భేరీపూజ, భేరీ తాడనము జరిపారు. అనంతరం గ్రామ బలిహరణ వేసి ధ్వజ స్ధంభమునకు గరుత్మంతుని పటమును కట్టి గరుడాష్టకములు పఠించారు. సకల దేవతలను ఆహ్వానించారు. తొమ్మిదిరోజులు(నవాహ్నికము) గరుడ పటమును ధ్వజస్థంభముపై ఎగురవేశారు. ఈ కార్యక్రమమునకు ముందుగా గరుడ పొంగళిని గరుత్మంతునికి నివేధించారు. ఈ సందర్భంగా యాజ్ఞీకస్వామి మాట్లాడుతూ సంతానం లేని స్త్రీలు గరుడునికి నివేదన చేసిన పొంగలి ప్రసాదమును భుజించినట్లయితే సంతానం కలుగుతుందని భక్తుల విశ్వాసమని విన్నవించారు. ఈ తొమ్మిది రోజులు ముక్కోటి దేవతలు స్వామివారి బ్రహ్మోత్సవములను తిలకించి ఆనందిస్తారని భగవత్ శాస్త్రం ప్రమాణమన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయం అర్చకులు పూజలు నిర్వహించారు. దేవాలయం అసిస్టెంట్ కమీషనర్ నల్వకాల్వ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో సిబ్బంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

## పలు షాపులకు వేలం పాటలు

పొన్నూరు, మే 4,(ప్రభాతవార్త: పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లోని శ్రీ ఆలపాటి సుబ్బారాయుడు ధర్మసత్రమునకు సంబంధించిన షాపులకు అద్దె బహిరంగ వేలము పాటలు ఈ నెల 8వ తేదీన ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి ఎంవిఎన్ మల్లేశ్వరి తెలిపారు ఆదివారం తెలిపారు. 2025 జూన్ ఒకటో తేదీ నుంచి 31 మే 2028వరకు మూడు సంవత్సరాల కాలపరిమితికి అద్దెకిచ్చేందుకు వేలము పాటలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పాటలో పాల్గొనేవారు పాటకు సంబంధించిన షరతుల ప్రకారం పాల్గొనాలన్నారు. హెచ్చుపాటదారునికి షాపులు అద్దెకివ్వడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాల కోసం సత్రం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

# ఏడాదైనా కనీస వేతనాల సవరణకు బోర్డు ఏర్పాటు చేయలేదు

## -ఇది పేదల ప్రభుత్వం కాదు: సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు

**మాచర్లటౌన్, మే 4 ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా కార్మిక వర్గ సంక్షేమానికి ఒక్క అడుగు కూడా వేయలేదని సీటీయూ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు అన్నారు. గత రెండు



రోజులుగా జరుగుతున్న జిల్లా రాష్ట్ర కమిటీ సమావేశాలకు ముఖ్యఅతిథిగా హాజరైన నర్సింగరావు ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల్లో, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ విధానాల్లో లక్షల మంది కార్మికులు పనిచేస్తున్నారని, కనీస వేతనాల బోర్డును ఏర్పాటు చేయాల్సి ఉందని, ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా బోర్డును ఏర్పాటు చేసేందుకు ముందుకు రాలేదని అసహనం వ్యక్తం చేశారు. బోర్డు ఏర్పాటయ్యాక కూడా వేతనాల సవరణకు సమయం పడుతుందని నర్సింగరావు చెప్పారు. గత ప్రభుత్వం కార్మిక వర్గాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, ఆ ప్రభుత్వంపై ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశ వర్కర్లు, మున్సిపల్ వర్కర్లు పెద్దఎత్తున పోరాటం చేశారన్నారు. అప్పుడు ఆ టెంట్లు చుట్టూ తిరిగిన తెదేపా, జనసేన నాయకులు మీకు న్యాయం చేస్తామని హామీలు గుప్పించిన సంగతి మర్చిపోయారా అని ప్రశ్నించారు. ప్రభుత్వం రాగానే తొలి సంతకం భవన కర్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని కార్మికశాఖ మంత్రి ప్రకటించారని, ఇప్పుడు పట్టించుకోవడం లేదన్నారు. అప్పుడు విజన్ 2020తో పేదరికం నిర్మూలన అవుతుందని చెప్పిన చంద్రబాబు, ఇప్పుడు విజన్ 2047 అంటున్నాడని అన్నారు. అప్పటికీ, ఇప్పటికీ పేదల సంఖ్యలో మార్పేమీ రాలేదని అంకెలు తెలియజేస్తున్నాయన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంటు సంగతేంటో ప్రభుత్వం చెప్పాలన్నారు. ప్రైవేటీకరణ అంశంపై స్పష్టంగా చెప్పడం లేదని, ప్రారిశ్రామిక వేత్త మిట్టల్‌కు మాత్రం స్టీల్ ప్లాంటు ఏర్పాటుకు క్యాప్టివ్ మైన్స్ ఇస్తామంటూ ప్రకటించడమేంటో ప్రజలకు తెలియజేయాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంటుకు సున్నపురాయి సొంత గనులు లేకనే అది నష్టాల పాలవుతున్న సంగతి అందరికీ తెలిసిన విషయమేనన్నారు. విశాఖ స్టీల్ ప్లాంటుకు మేలు జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. మే 20వ తేదీ సార్వత్రిక సమ్మె అనంతరం రాష్ట్రంలో ఉద్యోగ కార్మిక వర్గం పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతుందని తెలిపారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు నాయక్, జిల్లా నాయకులు బండ్ల మహేష్, వై.సురేష్, వెంకటరత్నం, వేముల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# సేవ సహాయ కార్యక్రమాలు అందించడంలో రోటరీ ప్రధమం

**బాపట్ల,మే04,ప్రభాతవార్త:** సహాయ సహాకారాలు,సేవ కార్యక్రమాలు నిర్వహించడంలో రోటరీ స్వచ్ఛంద సంస్థ ముందజలో ఉంటుందని రోటరీ క్లబ్ అధ్యక్ష,కార్యదర్శులు ఉపేంద్రగుప్త,వేజండ్ల శ్రీనివాసరావు అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ బాపట్ల వారి ఆధ్వర్యంలో బాపట్ల లో ఇమ్మడ శెట్టి వారి పాలెం, డ్రైవర్స్ కాలనీలో ఆదివారం మరుప్రోలు వారిపాలెం కు చెందిన విభిన్న ప్రతిభావంతులు ఐదుగురుకు వీల్ చైర్లు సుమారు రూ.50 వేల రూపాయలు ఖరీదు చేసేవి వారి నివాస గృహముల వద్దనే పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ



సందర్భంగా రోటరీ అధ్యక్షుడు ఉపేంద్ర గుప్త, కార్యదర్శి వేజండ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ వీల్ చైర్లు పంపిణీకి సహకరించిన రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ హైదరాబాద్ నార్త్ అధ్యక్షుడు బాలకోటి రెడ్డి, షార్ ప్రాజెక్ట్స్, రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల లైమ్ సిటీ, రోటిరి క్లబ్ ఆఫ్ బాపట్ల వారి సౌజన్యంతో నిరుపేదలైనటువంటి వివిధ ప్రతిభావంతులైన వారికి వారి నివాస గృహముల యందు స్వయంగా వెళ్లి వారికి వీల్ చైర్ లను అందించామన్నారు. .అదేవిధంగా వీల్ చైర్లు అందజేసినటువంటి రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ హైదరాబాద్ నార్త్, షార్ ప్రాజెక్ట్స్ , రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల లైమ్ సిటీ వారికి, ఈ కార్యక్రమానికి విచ్చేసినటువంటి రోటరీ సీనియర్ సభ్యులు బూర్లె రామ సుబ్బారావు, కొత్త ఆంజనేయ వరప్రసాద్లకు లబ్ధిదారులు తరఫున, రోటరీ క్లబ్ ఆఫ్ బాపట్ల తరఫున కార్యదర్శి వేజండ్ల శ్రీనివాసరావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# నిట్ పరీక్షల ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీఓ

**నాదెండ్ల,మే4,ప్రభాతవార్త:** మండలంలోని ఇర్లపాడు గ్రామంలోని కేంద్రీయ విశ్వవిద్యాలయంలో జరగనున్న నిట్ పరీక్షల ఏర్పాట్లును



ఆదివారం ఆర్‌డిఓ కె మదులత పరిశీలించారు. అన్ని గదులు తిరిగి పరీక్ష రాసే విద్యార్థుల సౌకర్యాల గురించి ఆమె ఆరాతీసారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ సిబ్బందితో పాటు నాదెండ్ల తహసిల్దార్ ఎవి రమణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# మాచర్ల రోటరీ క్లబ్ సేవలు ఎనలేనివి

## డిస్ట్రిక్ గవర్నర్ శరత్‌కుమార్

**మాచర్లటౌన్, మే 4 ప్రభాతవార్త:** మాచర్ల రోటరీ కన్లబ్ సేవలు ఎనలేనివని డిస్ట్రిక్ గవర్నర్ కె.శరత్‌కుమార్ చౌదరి అన్నారు. ఆదివారం మాచర్ల పట్టణంలోని వైభవ్ ఫంక్షన్ హాలులో జరిగిన స్పెషల్ గవర్నర్ విజిటింగ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సుమారు 16 మంది మహిళలకు కుట్టు మిషన్లు అందజేశామన్నారు. ప్రతి



సంవత్సరం ఆనవాయితీగా శ్రీమంత కార్యక్రమాన్ని అట్టహాసంగా గర్భిణులకు చేయడం ఆనందించదగ్గ విషయమన్నారు. మాచర్ల పట్టణంలో విద్యలో ప్రతిభ చూసిన విద్యార్థులను సన్మానించి షీల్డు, నగదు బహుమతులు అందించారు. జిల్లాస్థాయిలో గడిచిన మూడేళ్లలో 7 వేలకుపైగా బాలికలకు సైకిళ్ల పంపిణీ, ప్రజల ఆరోగ్య దృష్ట్యా డయాగ్నస్టిక్ సెంటర్లు, క్యాన్సర్ సెంటర్లను, డయాలసిస్ పరికరాలను అందించామన్నారు. భవిష్యత్తులో దాతలు ముందుకు వస్తే మాచర్ల పట్టణంలో డయాగ్నస్టికన సెంటర్ నెలకొల్పడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. పోలియో రహిత దేశంగా భారతదేశాన్ని మార్చడంలో రోటరీక్లబ్ ముందుంటుందన్నారు. ఇంతటి సేవలు అందిస్తున్న మాచర్ల రోటరీక్లబ్ సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ గవర్నర్ కె.రామకోటయ్య, అసిస్టెంట్ గవర్నర్ నిమ్మగడ్డ సురేఖ, ట్రెజరర్ అన్నపురెడ్డి లక్ష్మీ, ప్రోగ్రాం కన్వీనరు పఠాన్ నాగూర్‌వలి, సత్యప్రసాద్, కూరపాటి శివ, వెంకట్రావు పలువురు రోటరీకన్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# అవగాహన..లో ప్రపంచ నవ్వుల దినోత్సవం

గుంటూరు కల్చరల్,మే 4,ప్రభాతవార్త : కామెడీ పుస్తకాలు చదివితే,హాస్య సినిమాలు సన్నివేశాలు చూస్తే ప్రశాంతమైన,ఆనందమయమైన మానసిక స్థితి ఏర్పడుతుందని హాస్యం యాంటిబయోటిక్ గా పనిచేస్తుందని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ నవ్వుల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న హాస్యప్రియులు మాట్లాడుతూ అన్నారు. సంస్థ కార్యాలయంలో ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా నవ్వండి నవ్వించండి కార్యక్రమం జరిగింది. హాస్య ప్రసంగ ప్రముఖులు జన విజ్ఞానవేదిక నాయకులు సిహెచ్ చలమారెడ్డి మాట్లాడుతూ హాస్యం పదిమందిని ఒకచోటికి చేరుస్తుంది,వ్యక్తుల మధ్య శాశ్వత అనుబంధాలను పెంపొందిస్తుందన్నారు. అవగాహన హాస్యవల్లరి కోఆర్డినేటర్ వి.వి.రావ్ మాట్లాడుతూ రోజుకి 15సెకన్లు నవ్వితే ఆయుష్షు మరో రెండు రోజులు పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో హాస్యప్రియులు ప్రసాద్,బసవగుప్తా, వెంకటేశ్వరరావు జోక్స్,కామెడీ స్కిట్స్ మ్యాజిక్కులతో అందర్ని నవ్వించారు.

# వెయ్యేళ్ల నాటి పాత గురజాలమ్మ ఆలయాన్ని కాపాడుకోవాలి

## -పురావస్తు పరిశోధకుడు శివనాగిరెడ్డి

**గురజాల, మే 4 ప్రభాతవార్త:** పట్టణ శివారులోని పులిపాడు వెళ్లే రహదారిలో గల వెయ్యేళ్ల నాటి శిథిల పాత గురజాలమ్మ ఆలయాన్ని



కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. పట్టణానికి చెందిన కందిమళ్ల శ్రీనివాసరావు సమాచారం మేరకు ఆదివారం ఆయన గురజాల ఆలయ శిథిలాలను పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. కేవలం ఆలయం పునాది వరకు మాత్రమే మిగిలి ఉందని, మహా మండపం ముందు మెట్లకు అటు, ఇటు అందమైన ఏనుగు శిల్పాలు, అర్థమండపం ముందు ప్రాణాలర్పించుకుంటున్న పల్నాటి వీరుడు, గర్భాలయంలో ఆనవాళ్లు కోల్పోతున్న గురజాలమ్మ విగ్రహం ఆలయ చరిత్ర అర్థం పడుతున్నాయని, స్థానికులు పూనుకొని శిథిలాలను పదిలపరిచి, శిల్పాలను కాపాడుకోవాలని శివనాగిరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కందిమళ్ల శ్రీనివాసరావు, మద్దినేని వెంకటేశ్వర్లు (చిన్న బాబు), ఆత్మకూరు వెంకట పుల్లారావు, శిల్పి సురటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# కెఎల్ యూనివర్శిటీ ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్

## -ముఖ్యఅతిథిగా మంత్రి కొల్లు రవీంద్ర


**తాడేపల్లి,మే 4,ప్రభాతవార్త :** కెఎల్ యూనివర్సిటీ ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్ కు ముఖ్యఅతిథిగా మైనింగ్ అండ్ ఎక్సైజ్ శాఖమంత్రి కొల్లు రవీంద్ర హాజరయ్యారు. వివిధ కంపెనీల్లో ప్లేస్‌మెంట్ సాధించిన విద్యార్థులకు సర్టిఫికేట్‌లు అందజేశారు. కెఎల్ యూనివర్సిటీ అంటే ఒక సక్సెస్‌కు చిరునామా,యూనివర్సిటీలో అడుగుపెట్టిన నాటి నుండే క్రమశిక్షణ ఆలవడుతుంది. ఇక్కడ చదివిన ఆరువేల మందికి ప్లేస్‌మెంట్ అంటే చిన్న విషయం కాదు. వందశాతం ప్లేస్‌మెంట్ సాధించడం విద్యార్థుల ప్రతిభకు నిదర్శనం. చంద్రబాబు,నారా లోకేష్‌లు విద్యకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారు. చంద్రబాబు వంటి విజనరీ నేత సీఎంగా ఉండడం మనందరి



అదృష్టం,గతంలో ఐటి అంటే చంద్రబాబు ను చులకనగా మాట్లాడారు. నేడు ఏ దేశానికి వెళ్ళినా ఐటీలో మన తెలుగు వారు సత్తా చాటుతున్నారు. విజన్ 2020అంటే అదేంటి అన్నారు. ఇప్పుడు హైదరాబాద్ ను చూసి అందరూ ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. కా ్వంటం వ్యాలీకి మన ఆంధ్రప్రదేశ్ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తుంది. ఇప్పుడు అర్థం కానివారు వాటి ఫలితాలు అద్భుతంగా ఉంటాయి. చంద్రబాబు పాలనను స్ఫూర్తిగా తీసుకున్నా అని మోడీ స్వయంగా చెప్పారంటే...అది చంద్రబాబు పనితీరుకు నిదర్శనం. నేడు సక్సెస్ సాధించిన విద్యార్థులు ఎక్కడున్నా..మన రాష్ట్రానికి సేవలు అందించాలి ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తిచేసి నీటి సమస్యలు తీర్చేలా చంద్రబాబు కృషి చేస్తున్నారు. మైనింగ్ లో కూడా అనేక సంపద మన దగ్గర ఉండి. ఖనిజ సంపదను వెలికి తీస్తే ధనిక రాష్ట్రంగా ఏపి వృద్ధి చెందుతుంది. విద్యార్థులను కూడా భాగస్వామ్యం చేసేలా మా ఆలోచనలు ఉన్నాయి. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీయడం ద్వారా ఉన్నతస్థానాలకు చేరుకుంటారు. కెఎల్ యూనివర్సిటీలో ఘనంగా ముగిసిన ప్లేస్‌మెంట్స్ విజయోత్సవ వేడుకలు. 2025 విద్యా సంవత్సరంలో 100శాతం క్యాంపస్ ప్లేస్మెంట్స్ సాధించిన సందర్భంగా వడ్డేశ్వరంలోని యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహించిన విజయోత్సవ వేడుక అత్యంత ఘనంగా ముగిసింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర గనులు భూగర్భ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర విద్యార్థులను ఉద్దేశించి సూ ్ఫర్తిదాయకంగా మాట్లాడి సూచనలు చేశారు. ప్లేస్‌మెంట్స్ సాధించిన విద్యార్థులను అభినందించి జ్ఞాపికలు,ప్రశంసాపత్రాలను అందజేశారు.

# చోరీలు నియంత్రించేందుకు మోనిటరింగ్ సిస్టం ఏర్పాటు : సి.ఐ. అచ్చయ్య

**అమరావతి, మే 4 ప్రభాతవార్త :** వేసవి కాలంలో జరిగే అధిక దొంగతనాలను దృష్టిలో పెట్టుకొని, పోలీసు వారు పలు సూచనలు, సలహాలు అందించారు. వేసవికాలం పాఠశాల సెలవుల దృష్ట్యా కుటుంబ సమేతంగా దూర ప్రాంతాలకు ప్రయాణం చేసేవారు మీ ఇళ్ళలో ఎలాంటి విలువైన వస్తువులు ఉంచకుండా మీతో పాటు తీసుకొని వెళ్ళాలని సి.ఐ. అచ్చయ్య తెలిపారు. విలువైన వస్తువులను బ్యాంక్ లాకర్‌లలో భద్రపరచుకోవాలన్నారు. దూర ప్రాంతాలకు వెళ్ళే ముందు మీ గ్రామంలో గల మహిళా పోలీసులకు గాని,



అమరావతి పోలీస్‌స్టేషనల్లో గాని విషయాన్ని తెలియజేయాలన్నారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ (లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం) ద్వారా నిఘా పెట్టి ఎలాంటి దొంగతనాలు జరగకుండా పోలీస్ వారు జాగ్రత్తలు తీసుకుంటారని అమరావతి సి.ఐ. వై.అచ్చయ్య తెలియజేశారు.

# ఆరోగ్యాన్ని ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలి : ఎమ్మెల్యే అరవిందబాబు

**నరసరావుపేట, మే 4 ప్రభాతవార్త :** ఆరోగ్యాన్ని ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. పట్టణంలో వాకర్స్‌ను కలిసి ఆయన మాట్లాడారు. ఉదయం పూట నడకతో కలిగే ప్రయోజనాలను ఈ సందర్భంగా ఆయన వివరించారు. సత్తెనపల్లిరోడ్డులోని స్టేడియంతో పాటు ఎస్ఎస్ఎన్ కళాశాలలోనూ వాకర్స్‌కు అవసరమైన సౌకర్యాలను కల్పించడం జరుగుతుందన్నారు. నడకను ప్రతి రోజూ నిర్వహించే కార్యక్రమాలలో నిత్యం భాగం చేసుకోవాలని తెలిపారు. ఎన్నో ఒత్తిళ్ళతో ఉండేటటువంటి జీవితంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా వాకర్స్‌కు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు పిలుపునిచ్చారు.

**మాజీ కౌన్సిలర్‌కు ఎమ్మెల్యే అరవింద్‌బాబు సంతాపం...**

మాజీ కౌన్సిలర్ షేక్.సత్తార్‌కు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ఆదివారం నివాళులర్పించారు. ఆయన మృతదేహాన్ని సందర్శించి



పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మృతిపట్ల సంతాపాన్ని, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట పట్టణ ప్రముఖులు కపలవాయి విజయ్‌కుమార్, మాజీ కౌన్సిలర్లు ఉన్నారు.

# ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**నరసరావుపేట, మే 4 ప్రభాతవార్త :** ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. నుదురుపాడు గ్రామంలో కంటి పరీక్షలతో పాటు ఇ.యన్.టి.వైద్యసేవలను అందజేశారు. గ్రామ సర్పంచ్ చౌడయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కళాశాల ఛైర్మన్ షేక్.మీరావలి, ఇ.యన్.టి.వైద్య నిపుణులు డాక్టర్ షేక్.వసీమ్ మీరా, డాక్టర్ షఫాలీ, డాక్టర్ శృతి వైద్య పరీక్షలను నిర్వహించి అవసరమైన సలహాలు, సూచనలు చేశారు. ఛైర్మన్ షేక్.మీరావలి, కార్యదర్శి కరీమ్, డైరెక్టర్ షరీఫ్ పాల్గొని మాట్లాడారు. మొత్తం 527 మందికి కంటి పరీక్షలను శంకర కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించారు. 237



మందికి ఇ.యన్.టి పరీక్షలు నిర్వహించారు. గత తొమ్మిదేళ్ళ కాలంలో అనేక వైద్య శిబిరాలను నిర్వహించడం జరిగిందని ఛైర్మన్ షేక్.మీరావలి తెలియజేశారు.

# మాజీ కౌన్సిలర్ సత్తార్‌కు డాక్టర్ గోపిరెడ్డి నివాళి

**నరసరావుపేట, మే 4 ప్రభాతవార్త :** పట్టణంలోని 8వ వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్ షేక్.సత్తార్ ఆదివారం కనుమూశారు. ఆయన మృతి సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సత్తార్ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సత్తార్ మృతిపట్ల సంతాపాన్ని, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సత్తార్ కౌన్సిలర్‌లో ఉన్న సమయంలో అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తు



చేశారు. సతార్ లేకపోవడం తనకు వ్యక్తిగతంగానూ, నరసరావుపేట పట్టణంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి తీరనిలోటని ఆయన తెలిపారు. బాధిత కుటుంబానికి వైకాపా పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో గోపిరెడ్డి వెంట షేక్.ఖాజావలి, మాజీ కౌన్సిలర్లు ఉన్నారు.

# మహంకాళి అమ్మవారి ఆలయ నిర్మాణానికి విరాళం

**నరసరావుపేట, మే 4 ప్రభాతవార్త :** మండలంలోని ఇస్సపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయ నూతన నిర్మాణానికి భక్తులు ఆదివారం విరాళం అందజేశారు. వివరాలను ఈలయ ఈవో నలబోతు మాధవిదేవి తెలియ జేశారు. నూతన ఆలయ నిర్మాణ నిమిత్తం సత్తెనపల్లికి చెందిన కాకాని మహేశ్వరరావు - విజయ కుమారి దంపతులు రూ.1,00,116లను నగదు రూపంలో అందజేయడం జరిగిందన్నారు. ఆలయ నిర్మాణ పనులు వేగంగా జరుగు



తున్నాయని, విరాళం అందజేసే భక్తులకు ఆదాయపు పన్ను మినహాయింపు లభిస్తుందని ఆలయ ఈవో నలబోతు మాధవిదేవి తెలియజేశారు. విరాళం అందజేసిన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పూజారులు కాళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థినికి ఆర్థిక సహాయం

**నరసరావుపేట టౌన్, మే 4 ప్రభాతవార్త :** బొల్లు రాజేశ్వరి - కృష్ణారావు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రతిభ కలిగిన పేద విద్యార్థినికి ఆర్థిక సహాయం అందజేశారు. వివరాలను ట్రస్ట్ ఛైర్మన్ బొల్లు వెంకట కృష్ణారావు, ట్రస్ట్ సభ్యులు వెంకటేశ్వర్లు, రాజేంద్ర ప్రసాద్, మార్లపాటి రామకృష్ణ, మధు తెలియజేశారు. వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో బిటెక్ చదువుతున్న స్నేహ అనే విద్యార్థినికి ఫీజు చెల్లించే కార్యక్రమాన్ని ట్రస్ట్ నిర్వహించిందన్నారు. అవసరమైన రూ.20 వేలు ఆర్థిక సహాయాన్ని పంపిణీ చేశారు. మొదటి సంవత్సరం పరీక్షల్లో




స్నేహ అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించిందన్నారు. ద్వితీయ సంవత్సరం కూడా మంచి మార్కులను స్నేహ సాధిస్తుందని తెలియజేశారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో భవిష్యత్తులోనూ స్నేహకు అవసరమైన సహాయం చేస్తామని ఈ సందర్భంగా వారు తెలియజేశారు.

# ప్రతిభావంతులైన విద్యార్థులకు పోలీసు అధికారులు సత్కారం

**నరసరావుపేట టౌన్, మే 4 ప్రభాతవార్త :** ప్రతిభావంతులైన మైనార్టీ విద్యార్థులకు పట్టణ వన్‌టౌన్ సి.ఐ. ఎం.విజయ్‌చరణ్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సి.ఐ. విజయ్‌చరణ్ మాట్లాడుతూ వరవకట్టకు చెందిన షేక్.అజీర 574 మార్కులు మహ్మద్ సానా 558 మార్కులు, షేక్.హనీఫ్ 539 మార్కులను పదవ తరగతి పరీక్షల్లో 600 మార్కులకు గాను సాధించారని తెలిపారు. పట్టణ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు వారి తల్లిదండ్రులతో పాటు పోలీసులకు గర్వకారణం అని తెలిపారు.



భవిష్యత్తులోనూ ఇదే పట్టుదల, క్రమశిక్షణతో లక్ష్యాలను సాధించాలన్నారు. చదువు పట్ల ఇతరులకు ఆదర్శంగా నిలవడం గొప్ప విషయం అన్నారు. శాలువాతో సన్మానించి పుస్తకాలు, పెన్నులు బహుమతిగా అందించారు. సి.ఐ. విజయ్‌చరణ్‌తో పాటు ఎస్.ఐ. వంశీకృష్ణ పాల్గొన్నారు.

# జగనన్న కాలనీలో కార్డెన్ సెర్చ్

**నరసరావుపేట క్రైం, మే 4 ప్రభాతవార్త :** మండలంలోని ఉప్పలపాడు జగనన్న కాలనీలో జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామీణ సి.ఐ. రామకృష్ణ, పట్టణ సి.ఐ. ఎం.వి. చరణ్, ట్రాఫిక్ సి.ఐ. లోక్‌నాథం, ఎస్.ఐ.లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాలనీలో సోదాలు నిర్వహించారు. అనుమానితులను ప్రశ్నించి వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ చర్యల్లో భాగంగా కార్డెన్



సెర్చ్ జరిగిందన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వ్యక్తులు ఎవరైనా ఉంటే వారి సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలన్నారు. అదే విధంగా సోదాలు భవిష్యత్తులోనూ కొనసాగుతాయన్నారు. గంజాయి, మత్తు పదార్థాల విక్రయాలకు సంబంధించి సమాచారాన్ని ఇవ్వాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఘర్షణలకు అవకాశం లేకుండా నేరాల నియంత్రణకు ఇటువంటి చర్యలను తీసుకుంటున్నామని సి.ఐ.లు రామకృష్ణ, విజయ్‌చరణ్, లోక్‌నాథంలు తెలియజేశారు.

# లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సమావేశం

**చిలకలూరిపేట,మే4,ప్రభాతవార్త:** పట్టణంలోని జాతీయ రహదారి బిఎస్ఎన్ఎల్ ఎదురుగా ఉన్న హిందు శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో శనివారం సాయంత్రం పట్టణంలోని చౌత్రా సెంటర్‌లో ఉన్న శ్రీ వేంకటేశ్వర ఆర్యవైశ్య కళ్యాణమండపంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్లబ్



కోశాధికారి పోలిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హిందూ శ్మశాన వాటికలో ఇప్పటికి రెండు బెడ్లు ఉన్నాయని, మరో రెండు బెడ్లు, అదేవిధంగా స్వంత నివాసం లేనివారికి రెండు గదులు, వాటిలో సౌకర్యాలు, అస్థికలు దాచుకునేందుకు తగిన ఏర్పాటు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేయవలసి ఉన్నదని సభకు తెలిపారు. ఈ సందర్భంగా అభివృద్ధి కమిటిని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కళ్యాణమండం అధ్యక్షులు డాక్టర్ అర్వపల్లి సురేష్‌కుమార్, కార్యదర్శి చేవూరి కృష్ణమూర్తి,క్లబ్ నాయకులు డాక్టర్ కొల్లా అమర్, యక్కల దేవేంద్ర రాజేష్, శిఖాకొల్లి శ్రీనివాస గుప్తా, అర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్త కోటేశ్వరరావు, పెరుమాళ్ల సురేష్, శనగల హనుమత్‌శాస్త్రి, వెల్లంపల్లి రాము,తదితర క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా జామియా దారుల్ బిర్ మదర్సా వార్షికోత్సవం

**తాడేపల్లి,మే 4,ప్రభాతవార్త :** ధార్మిక విద్యతో మాత్రమే ఇహ,పరలోకాల సాఫల్యం కలుగుతుందని ఫజీలతుషేక్ మన్సురుద్దీన్ అహ్మద్ అన్నారు. మంగళగిరి-తాడేపలి నగర పాలక సంస్థ పరిధి నులకపేట సిద్ధిఖ్ నగర్‌లోని జామియా దారుల్ బీర్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ (మదర్సా) 15వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మన్సురుద్దీన్ అహ్మద్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. విద్య రెండు రకాలని,వాటిలో ఒకటి ప్రాపంచిక విద్య అయితే మరోకటి ధార్మిక విద్య అన్నారు. కేవలం బ్రతుకుతెరువు కోసం అరి ్జంచే విద్య స్వర ్గం-నరకం గురించి గానీ ఏకదైవారాధన గురించి గానీ తెలియపర్చదన్నారు. ధార్మిక విద్యను అరి ్జంచడం ప్రతి ముస్లీం తప్పనిసరి విధి అని,ధార్మిక విద్య నేర్చుకున్నవారు శాశ్వత జీవితంలో ప్రవేశపెట్టబడతారన్నారు. ధార్మిక విద్య ఒక వెలుగు వంటిదన్నారు. ఎందరో నేటి విద్యార్థులు సినిమాలు,గానాల మోజులో పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తల్లిదండ్రులు చిన్నతనం నుండే తమ సంతానానికి ప్రాపంచిక విద్యతోపాటు ధార్మిక విద్యను కూడా నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన పలువురు విద్యార్థులకు మన్సురుద్దీన్ అహ్మద్ చేతుల మీదుగా ఖురాన్-హదీస్ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ముస్లీం పెద్దలు షేక్ అబ్దుల్లా,షాహిద్,ముర్తుజా,ఇలియాస్,ఫయాజ్‌ఆలం తదితరులు పాల్గొన్నారు.

# చెన్నారెడ్డి హాస్పటల్‌లో డాక్టర్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి న్యూరాలజీ సేవలు

**నరసరావుపేట, మే 4 ప్రభాతవార్త :** పట్టణంలోని గుంటూరురోడ్డులో ఉన్న చెన్నారెడ్డి హాస్పటల్‌లో డాక్టర్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో న్యూరాలజీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. వివరాలను డాక్టర్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి ఆదివారం తెలియజేశారు. పక్షవాతం, తల నొప్పి, వణుకుడు, మూర్ఛ, కళ్ళు తిరగడం, మెడ నొప్పి, వెన్ను నొప్పి వంటి సమస్యలకు అత్యుత్తమ వైద్య సేవలను అందిస్తున్నట్లు తెలియజేశారు. సోమవారం



నుండి గురువారం వరకు సాయంత్రం 5.30 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు, శుక్రవారం, ఆదివారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పూర్తి స్థాయిలో వైద్యసేవలు అందించడం జరుగుతుందన్నారు. గత ఐదు సంవత్సరాలుగా పల్నాడు జిల్లా ప్రజలకు న్యూరాలజీ విభాగంలో మెరుగైన వైద్యసేవలను అందిస్తున్నామని వారు తెలియజేశారు. తమ వైద్యశాలలో అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదే విధంగా న్యూరాలజీ వైద్యసేవలలో తమ వైపు నుండి వచ్చినటువంటి సమయాలలో మార్పులను గమనించాలని ఈ సందర్భంగా డాక్టర్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి కోరారు.

# 'లోర్వెన్ ఎఐ' స్టూడియో లాంచ్



'మారుతున్న కాలానికి అనుగుణంగా మారుతున్న టెక్నాలజీని సినీ రంగంలోకి పరిచయం చేయాలనే దృఢ సంకల్పంతో దిల్ రాజు 'లోర్వెన్ ఎఐ' స్టూడియోని లాంచ్ చేయడం అభినందనీయం. 'లోర్వెన్ ఎఐ' స్టూడియో ఎంటర్‌టైన్‌మెంట్ వరల్డ్ ని నెక్స్ట్ లెవల్‌కి తీసుకెళ్లాలని కోరుకుంటున్నాను అన్నారు. తెలంగాణ ఐటీ మినిస్టర్ దుద్దిళ్ళ శ్రీధర్ బాబు. ప్రముఖ నిర్మాత దిల్ రాజు 'లోర్వెన్ ఎఐ' స్టూడియోని గ్రాండ్‌గా లాంచ్ చేశారు. ఈ ఈవెంట్ కి తెలంగాణ ఐటీ మినిస్టర్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సినీ పరిశ్రమకు చెందిన అతిరథమహారథులు హాజరైన ఈ వేడుకు చాలా గ్రాండ్ గా జరిగింది. 'లోర్వెన్ ఎఐ' స్టూడియో లాంచ్ ఈవెంట్‌లో తెలంగాణ ఐటీ మినిస్ట శ్రీధర్ బాబు మాట్లాడుతూ, నా మిత్రుడు దిల్ రాజు మారుతున్న కాలానికి అనుగుణంగా మారుతున్న టెక్నాలజీని సినీ రంగంలోకి పరిచయం చేయాలనే దృఢ సంకల్పంతో ఈరోజు 'లోర్వెన్ ఎఐ' స్టూడియోని లాంచ్ చేస్తున్న సందర్భంలో వారికి వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. క్వాంటం నెక్స్ట్ లెవెల్ ఆఫ్ టెక్నాలజీ. వారు 'లోర్వెన్ ఎఐ' స్టూడియోలో భాగస్వామ్యం కావడం అభినందనీయం. టెక్నాలజీతో కొత్త అవకాశాలు తెరపైకి వస్తాయి. కొత్త కొత్త ఉద్యోగాలు వస్తాయి. దిల్ రాజు లాంటి కింగ్ ఆఫ్ మూవీ ప్రొడక్షన్ ప్రొడ్యూసర్ ఎఐ లోకి రావడం శుభ పరిణామం. ఇది అద్భుతమైనటువంటి విజయాన్ని సాధించాలనిమనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అన్నారు. నిర్మాత దిల్ రాజ్ మాట్లాడుతూ, ఎఐ గురించి గత రెండేళ్లుగా డిస్కషన్ స్టార్ట్ చేశాం. మా కంపెనీ నుంచి స్టార్ట్ అయిన టీం, క్వాంటంతో కలసి సినిమా గురించి డెవలప్ చేయాలని నిర్ణయించు కున్నాం. 360 డిగ్రీస్ సినిమాని ఎలా చేయొచ్చు అనేది క్రియేటివ్‌గా డెవలప్ చేయడం జరిగింది. స్క్రిప్టు ఐడియా నుంచి స్క్రిప్ట్ ఫైనల్ అయ్యేవరకు ఒక స్టేజ్. న్యూ కమ్మర్స్‌కి ఇది చాలా యూజ్ ఫుల్‌గా ఉంటుందని డెవలప్ చేయడం జరిగింది. స్క్రిప్ట్ అయిపోయిన తర్వాత మేజర్‌గా ప్రీ ప్రొడక్షన్ గురించి ఎంత టెన్షన్ పడుతున్నామో సినిమా వాళ్లకి తెలుసు. సెకండ్ స్టేజ్ ప్రీ ప్రొడక్షన్. తర్వాత షూటింగ్ ప్రాసెస్, పోస్ట్ ప్రొడక్షన్. తర్వాత ప్రమోషన్స్. ఇలా స్టెప్ బై స్టెప్‌గా డెవలప్ డెవలప్ చేయడం జరిగింది. స్క్రిప్ట్ అయిపోయిన తర్వాత చేసే ప్రీ ప్రొడక్షన్‌ని ఎఐలో ఎలా చేయొచ్చు అనేది చేయడం జరిగింది. అది చాలా మిరాకిల్‌గా అనిపిస్తుంది. చాలామంది డైరెక్టర్స్‌కి ప్రొడ్యూసర్స్‌కి దీని గురించి చూపించడం జరిగింది. పోస్ట్ ప్రొడక్షన్లో డైరెక్టర్ ఏది అనుకుని సినిమాని తీశాడు ఫైనల్ కట్ సినిమా చూడొచ్చు. 'లోర్వెన్ ఎఐ' అనేది ఎమోషన్ లేని ఒక ఫస్ట్ ఎడిగా భావించవచ్చు. ఇది డైరెక్టర్స్‌కి క్రియేటివ్ సైట్ చాలా హెల్ప్‌ఫుల్‌గా ఉంటుంది. మా సంస్థలో రూపొందు తున్న విజయ్ దేవరకొండతో రౌడీ జనార్ధన సినిమా తీస్తున్న డైరెక్టర్ రవికిరణ్ ఇందులో వర్క్ చేస్తున్నాడు. అలాగే ఒక విఎఫ్ఎక్స్ సినిమాచేయబోతున్నాం. దాని వర్క్‌కూడా ఇందు లోనే జరుగుతుంది. అలాగే ఒక స్క్రిప్ట్ ని కూడా ఇందులోనే డెవలప్ చేస్తున్నాం. మా కంపెనీ కాకుండా మిగతా ప్రొడ్యూ సర్స్ ప్రొడక్షన్ హౌసెస్ 'లోర్వెన్ ఎఐ' కావాలనుకుంటే సంప్రదించొచ్చు. అందరికీ థాంక్యు వెరీ మచ్ అన్నారు.

నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ దిల్ రాజు పాతికేళ్లుగా నాకు తెలుసు. ఎంటర్టైన్మెంట్ ఇండస్ట్రీలోకి ఏఐ ని ప్రవేశ పెట్టడంలో ముందడుగు వేశారు. సినిమా ఇండస్ట్రీకి ఎఐ ఒక కోలాబరేటరీ అని భావిస్తున్నాను. తన ప్రతిష్టాత్మకమైన కంపెనీని లోగోని లాంచ్ చేసిన అవకాశం ఇచ్చిన దిల్ రాజుకి ధన్యవాదాలు. సినిమా రషెస్ చూపించి రిజల్ట్ ఏమిటని ఎఐని అడగాలని వుంది అన్నారు. వైఘా దిల్ రాజు మాట్లాడుతూ, ఇది డ్రీమ్ కం ట్రూ మూమెంట్. మా ఇష్ట దైవం లార్డ్ వెంకటేశ్వర స్వామి పేరుతో ఈ కంపెనీకి 'లోర్వెన్ ఎఐ'అనిపెట్టడం జరిగింది. 'లోర్వెన్ ఎఐ' ఫ్యూచర్‌గా భావిస్తున్నాము. థాంక్యూ సో మచ్ క్వాంటం గ్లోబల్ ఎఐ. 'లోర్వెన్ ఎఐ' ఆలోచన మా హస్బెండ్ దిల్ రాజుది. ఆయన విజన్ మహా అద్భుతం అన్నారు.

# 'సింగిల్' నాకు చాలా స్పెషల్ మూవీ: ఇవానా



కింగ్ ఆఫ్ ఎంటర్టైన్మెంట్ శ్రీవిష్ణు ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ బ్యానర్‌లో హోల్సమ్ ఎంటర్‌టైనర్ 'సింగిల్'తో అలరించబోతున్నారు. ఈ చిత్రంలో కేతిక శర్మ, ఇవానా కథానాయికలుగా నటించారు, వెన్నెల కిషోర్ కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రానికి కార్తీక్ రాజు దర్శకత్వం వహించారు. గీతాఆర్ట్స్ మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ సమర్పణలో కళ్యా ఫిల్మ్స్‌తో కలిసి చిత్రాన్ని విద్యా కొప్పినీడి, భాను ప్రతాప, రియాజ్ చౌదరి నిర్మిస్తున్నారు 'సింగిల్' మే 9న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ ఇవానా విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**ఈ ప్రాజెక్టులోకి ఎలా వచ్చారు?**

డైరెక్టర్ కార్తీక్ ఒకరోజు కాల్ చేసి ఈ సినిమా గురించి చెప్పారు. కథ విన్నాను. చాలా నచ్చింది. శ్రీ విష్ణు. వెన్నెల కిషోర్, కేతిక ఇలా చాలా అద్భుతమైనటువంటి నటులు ఉన్నారు. గీత ఆర్ట్స్ లాంటి గొప్ప సంస్థ ఉంది. నేను తెలుగులోకి రావడానికి ఇదే యాప్ట్ అనిపించి చేశాను.

**ఈ సినిమాలో మీ క్యారెక్టర్ ఎలా ఉంటుంది?**

ఇందులో హరిణి అనే పాత్రలో కనిపిస్తాను. నాది చాలా జోవియల్ అండ్ ప్లజెంట్ క్యారెక్టర్. హరిణి డాన్సర్. తన క్యారెక్టర్‌లో చాలా ఎమోషన్ ఉంటుంది. ఫ్యామిలీ అటాచ్మెంట్ ఉంటుంది. తాను ఎవరినైనా ఇష్టపడితే వాళ్లకోసం ఏదైనా చేయడానికి సిద్ధపడుతుంది. ఈ క్యారెక్టర్‌ని ప్లే చేయడం చాలా ఎంజాయ్ చేశాను.

**ఇది ఎలాంటి సినిమా?**

ఇది చాలా ఫన్ మూవీ, ఫ్యామిలీ అందరితో కలిసి థియేటర్స్‌లో చాలా ఎంజాయ్ చేయొచ్చు. లాఫ్ రైడ్ లా ఉంటుంది. ఇది నా ఫస్ట్ తెలుగు సినిమా. కచ్చితంగా చాలా మంచి స్టార్ట్ అవుతుందని భావిస్తున్నాను. ఈ సినిమా నా కెరియర్‌లో చాలా స్పెషల్ ప్లేస్ ఉంటుంది. నాకు డాన్స్ అంటే చాలా ఇష్టం. నా క్యారెక్టర్ డాన్సర్ అని తెలిసినప్పుడు చాలా ఆనందంగా అనిపించింది. ఇది అందరికీ కనెక్ట్ అయ్యే సబ్జెక్టు. ఈ సినిమాలో నా క్యారెక్టర్ విన్న వెంటనే నాకు చాలా ఎక్సైటింగ్ అనిపించింది. ఆ ఎక్సైట్ మెంట్ ఆడియన్స్‌లో కూడా ఉంటుందని నా నమ్మకం.

**శ్రీవిష్ణుతో వర్క్ చేయడం ఎలా అనిపించింది?**

శ్రీవిష్ణు చాలా కూల్ పర్సన్. ఆయన చాలా సైలెంట్‌గా ఉంటారు. కాస్త ఇంట్రోవర్ట్ అనిపిస్తారు. కానీ కిషోర్‌తో కలిసినప్పుడు మాత్రం చాలా హిలేరియస్‌గా ఉంటారు. శ్రీవిష్ణు నాకు డైలాగ్స్ రాసి ఇవ్వడం వెరీ మెమరీబల్ ఎక్స్పీరియన్స్. అలాగే కేతిక శర్మతో కూడా వర్క్ చేయడం వెరీ ఫన్ ఎక్స్పీరియన్స్.

**డైరెక్టర్ కార్తీక్ గురించి?**

కార్తీక్ తమిళ్ పర్సన్. ఆయనతో నేను తమిళ్‌నే మాట్లాడేదాన్ని. ఆయన చాలా క్లియర్ విజన్ ఉన్న డైరెక్టర్. ఆయనతో వర్క్ చేయడం రియల్లీ వండర్ఫుల్ ఎక్స్పీరియన్స్.

**సినిమా మ్యూజిక్ గురించి?**

సినిమాలో చాలా బ్యూటిఫుల్ సాంగ్స్ ఉన్నాయి. ఇప్పటికే రిలీజైన రెండు పాటలు చాలా మంచి రెస్పాన్స్ తెచ్చుకున్నాయి. మిగిలిన పాటలు కూడా చాలాబ్యూటిఫుల్ గా ఉండబోతున్నాయి.

# విశ్వంభరలో 'అవని'గా త్రిష

మెగాస్టార్ చిరంజీవి అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ విశ్వంభర. వశిష్ట దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ ఈ సంవత్సరం మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా చిత్రాలలో ఒకటి. ఈ చిత్రం ఇప్పటికే అద్భుతమైన పోస్టర్లు, విజువల్ వండర్ టీజర్, ఆధ్యాత్మికంగా నిండిన ఫస్ట్ సింగిల్‌రామరామతో భారీ అంచనాలను పెంచింది. యువి క్రియేషన్స్ విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రంలో త్రిష కృష్ణన్ హీరోయిన్ పాత్ర పోషిస్తున్నారు.



త్రిషకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ, విశ్వంభరలోని ఆమె పాత్ర అవనిగా పరిచయం చేశారు. రాజసం ఉట్టిపడే చీరకట్టులో మెరిసిపోతు కనిపించారు త్రిష. ఈ పోస్టర్‌కి ట్రమండస్ రెస్పాన్స్ వస్తోంది. వశిష్ట విజన్, యూవీ క్రియేషన్స్ నిర్మాణంలో రూపొందుతున్న విశ్వంభర పురాణ గాథలను మోడరన్ సినిమాతో బ్లెండ్ చేస్తోంది. హై క్వాలిటీ విఎఫ్ఎక్స్ భారీ సిజిఐ బడ్జెట్, అద్భుతమైన కథ ప్రేక్షకులకు విజువల్ వండర్ ఎక్స్ పీరియన్స్‌ని అందించబోతోంది. ఈ చిత్రంలో ఆశికా రంగనాథ్ మరో హీరోయిన్‌గా నటిస్తుండగా, కునాల్ కపూర్ కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రానికి డీవోపీ చోటా కె నాయుడు, ప్రొడక్షన్ డిజైనర్ ఎఎస్ ప్రకాష్. తారాగణం: మెగాస్టార్ చిరంజీవి, త్రిషకృష్ణన్, ఆశికా రంగనాథ్, కునాల్ కపూర్. సాంకేతిక బృందం: రచన, దర్శకత్వం: వశిష్ట, నిర్మాతలు: విక్రమ్, వంశీ, ప్రమోద్, బ్యానర్: యువి క్రియేషన్స్, సంగీతం: ఎంఎం కీరవాణి, డిఓపి: చోటా కె నాయుడు, ప్రొడక్షన్ డిజైనర్: ఎఎస్ ప్రకాష్, పీఆర్వో: వంశీశేఖర్, మార్కెటింగ్: ఫస్ట్ షో.

# 'శుభం' ప్రమోషనల్ సాంగ్ విడుదల



ప్రముఖ నటి సమంత నిర్మాణ రంగంలోకి అడుగు పెట్టారు. సమంత నేతృత్వంలోని వస్తున్న తొలి చిత్రం 'శుభం'. ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ మీద సమంత నిర్మిస్తున్న ఈ చిత్రాన్నికి ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించారు. ఈ చిత్రం మే 9న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది. ఈ క్రమంలో రిలీజ్ చేసిన 'శుభం'ట్రైలర్‌కు విశేషమైన స్పందన వచ్చింది. మేకర్స్ ఈ క్రమంలో మ్యూజికల్ ప్రమోషన్స్‌లో భాగంగా మొదటి సింగిల్ 'జన్మ జన్మల బంధం'ను విడుదల చేశారు. ఇది ప్రమోషనల్ వైబ్ కోసం రూపొందించి ఓ ఎనర్జిటిక్ రీమిక్స్‌పాట. నిర్మాతతో పాటు ప్రధాన తారాగణం ఈ ప్రమో షనల్ సాంగ్‌లో కనిపిస్తారు. ఈ సాంగ్ లో సమంత అందరి దృష్టి ని ఆకర్షించేలా ఉన్నారు. టీం అంతా కూడా ఫుల్ వైబ్‌లో ఉన్నట్టుగా కనిపిస్తోంది. ఈ ప్రమోషనల్ సాంగ్ బీట్ చాలా హుషారుగా ఉంది. నవ్వు, భయం ఇలా అన్ని రకాల ఎమోషన్స్‌ను 'శుభం'లో పొందు పర్చారని ట్రైలర్ చూస్తేనే తెలుస్తుంది. ఈ సినిమాకు వివేక్ సాగర్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, క్లింటన్ సెరెజో సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రంలో హర్షిత్ రెడ్డి, గవిరెడ్డి శ్రీనివాస్, చరణ్ పెరి, శ్రియ కొంతం, శ్రావణి లక్ష్మి, షాలిని కొండేపూడి, వంశీధర్ గౌడ్ వంటి వారు నటించారు. మే 9న ప్రపంచ వ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోన్న'శుభం' ఈ వేసవికి ప్రేక్షకులను పూర్తిగా సంతృప్తిపరిచే చిత్రం కానుంది.

# 'పాంచ్ మినార్'నుంచి సాంగ్ రిలీజ్



యంగ్ ట్యాలెంటెడ్ రాజ్ తరుణ్ హీరోగా రామ్ కడుముల దర్శకత్వంలో రూపొందిన క్రైమ్ కామెడీ ఎంటర్ టైనర్ 'పాంచ్ మినార్'. గోవింద రాజు ప్రజెంట్ చేస్తున్న ఈ చిత్రాన్ని కనెక్ట్ మూవీస్ ఎల్ఎల్‌పి బ్యానర్ పై మాధవి, ఎమ్ఎస్ఎమ్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ ఫస్ట్ సాంగ్, టీజర్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ రోజు మేకర్స్ జాను మేరి జాను సాంగ్‌ని రిలీజ్ చేశారు. స్టార్ కంపోజర్ శేఖర్ చంద్ర ఈ సాంగ్ ని క్యాచి ట్యూన్ గా కంపోజ్ చేశారు. వినాయక్ ఈ పాటని ఎనర్జిటిక్‌గా పాడారు. శ్రీహర్ష ఈమని రాసిన లిరిక్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సాంగ్ లో రాజ్ తరుణ్, రాశి సింగ్ కెమిస్ట్రీ ఇంట్రస్టింగ్‌గా వుంది. ఈ సాంగ్ ఇన్స్టంట్ హిట్ గా నిలిచింది. ఈ చిత్రంలో రాశి సింగ్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. అజయ్ ఘోష్, బ్రహ్మాజీ, శ్రీనివాస్ రెడ్డి, నితిన్ ప్రసన్న, రవి వర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ట్యాలెంటెడ్ టెక్నీషియన్స్ పని చేస్తున్నారు. ఆదిత్య జవ్వాది డీవోపీ కాగా ప్రవీణ్ పూడి ఎడిటర్. 'బేబీ' సురేష్ భీమగాని ఆర్ట్ డైరెక్టర్.

నటీనటులు: రాజ్ తరుణ్, రాశి సింగ్,అజయ్ ఘోష్, బ్రహ్మాజీ, శ్రీనివాస్ రెడ్డి, నితిన్ ప్రసన్న, రవి వర్మ, సుదర్శన్, కృష్ణ తేజ, నంద గోపాల్, ఎడ్విన్ లక్ష్మీ మీసాల, జీవా, అజీజ్ తదితరులు. సాంకేతిక సిబ్బంది: బ్యానర్: కనెక్ట్ మూవీస్ ఎల్ఎల్‌పి, సమర్పణ: గోవింద రాజు, రచన, దర్శకత్వం: రామ్ కడుముల, నిర్మాతలు: మాధవి, ఎమ్ఎస్ఎమ్ రెడ్డి, సంగీతం: శేఖర్ చంద్ర, డీవోపీ: ఆదిత్య జవ్వాది, ఎడిటర్: ప్రవీణ్ పూడి, ఆర్ట్ డైరెక్టర్: 'బేబీ 'సురేష్ భీమగాని, డైలాగ్స్: గోరిజాల సుధాకర్, కోడైరెక్టర్స్: పుల్లారావు కొప్పినీడి, టి రాజా రమేష్, పీఆర్వో: వంశీశేఖర్.

# మే 16న రిలీజ్ కానున్న '23'

మల్లేశం, 8 ఎ.ఎమ్. మెట్రో చిత్రాలతో ప్రశంసలు పొందిన దర్శకుడు రాజ్ ఆర్ నిజమైన సంఘటనల నుండి ప్రేరణ పొందిన మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్ '23'తో వస్తున్నారు. స్టూడియో 99 నిర్మించిన ఈ చిత్రంలో తేజ, తన్మయి ప్రధాన పాత్రలు పోషించారు. వెంకట్ సిద్దారెడ్డి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ ఇప్పటికే సంచలనం సృష్టించింది. తాజాగా మేకర్స్ రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేశారు. మే 16న ఈ సినిమా గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. ఈ సినిమాని స్పిరిట్ మీడియా డిస్ట్రిబ్యూషన్ చేస్తుంది. ఇటీవల విడుదలైన టీజర్ సెన్సేషనల్ రెస్పాన్స్‌తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. కోసి కోయ్యంగానే సాంగ్ వైరల్ అయి సినిమాపై ఎక్సైట్మెంట్‌ని పెంచింది. ఈ చిత్రానికి మార్క్‌కె రాబిన్ మ్యూజిక్ అందిస్తున్నారు. సన్నీ కూరపాటి సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. అనిల్ ఆలయం ఎడిటర్, లక్ష్మణ్ ఏలే ఆర్ట్ డైరెక్టర్.




తారాగణం: తేజ, తన్మయి, ఝాన్సీ, పావోన్ రమేష్, తాగుబోతు రమేష్, ప్రణీత్

సాంకేతిక సిబ్బంది: దర్శకత్వం: రాజ్‌ఆర్, బ్యానర్: స్టూడియో 99, విడుదల: స్పిరిట్ మీడియా, సినిమాటోగ్రఫీ: సన్నీ కూరపాటి, సంగీతం: మార్క్ కె రాబిన్, ,ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వెంకట్ సిద్దారెడ్డి, ప్రొడక్షన్ డిజైన్: లక్ష్మణ్ ఏలే, ఆర్ట్ డైరెక్షన్: విష్ణువర్ధన్ పుల్లా, కాస్టింగ్ డైరెక్షన్: మహేష్ గంగిమల్ల, డైలాగ్స్: ఇండస్ మార్టిన్, కాస్ట్యూమ్ డిజైన్: శ్రీపాల్ మాచర్ల, సాహిత్యం: చంద్రబోస్, రెహమాన్, సింధు మార్ని.

# వరల్డ్స్ బిగ్గెస్ట్ సినిమా స్క్రీన్ ప్రాజెక్ట్‌ను అనౌన్స్ చేసిన అభిషేక్ అగర్వాల్, విక్రమ్ రెడ్డి

ప్రపంచంలోనే బిగ్గెస్ట్ సినిమా స్క్రీన్‌తో నాగపూర్‌లో మొదటిసారిగా నిర్మించబోయే ఈ సినిమా థియేటర్ భారతీయ సాంకేతిక రంగానికి ఒక మార్గదర్శకంగా నిలవనుంది. ఎంటర్ టైన్మెంట్‌లో మోడరన్ ఇండియాకి ఇది ఒక గర్వకారణంగా మారబోతోంది. వరల్డ్స్ బిగ్గెస్ట్ సినిమా స్క్రీన్ నిర్మించేందుకు అవకాశం దక్కడం నాకు గర్వకారణం. ఇండియన్ ఎంటర్ టైన్మెంట్ ప్రపంచ స్థాయిలోకి తీసుకెళ్లాలని ప్రధాని లక్ష్యం. అదే ప్రేరణగా ఈ ప్రయత్నం మొదలైంది. మా విజన్‌ని అర్థం చేసుకుని ఈ కలను నిజం చేసేందుకు మమ్మల్ని నమ్మిన ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌కి నా హృదయపూర్వక కృతజ్ఞతలు, అని అభిషేక్ అగర్వాల్ అన్నారు.

"సినిమాను మరింత గొప్పగా మార్చడమే మా గీజు క్రియేషన్స్ లక్ష్యం. గొప్ప సినిమాలు తీయడమే కాదు, అద్భుతమైన థియేటర్లు కూడా నిర్మించడమే మా ధ్యేయం. ప్రపంచపు అతిపెద్ద స్క్రీన్‌ని నాగపూర్‌లో నిర్మించబోతున్నాము. మా పరిశ్రమ సామర్థ్యాలపై నమ్మకం ఉంచిన ప్రధాని మోదీకి మా కృతజ్ఞతలు" అని విక్రమ్ రెడ్డి అన్నారు.



# జూలై 4న రానున్న 'తమ్ముడు'

ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణంలో నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో రూపొందుతున్న ప్రెస్టీజియస్ మూవీ "తమ్ముడు". ఈ చిత్రంలో లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ రోజు దర్శకుడు శ్రీరామ్ వేణు పుట్టిన రోజు సందర్భంగా "తమ్ముడు" మూవీ రిలీజ్ డేట్‌ను అనౌన్స్ చేశారు. జూలై 4న ఈ సినిమాను రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన ఓ స్పెషల్ వీడియో క్రియేటివ్‌గా, ఎంటర్ టైనింగ్‌గా ఉండి ఆకట్టుకుంటోంది.

'తమ్ముడు' మూవీ రిలీజ్ డేట్ అనౌన్స్ మెంట్ డిఫరెంట్‌గా ప్లాన్ చేశారు మేకర్స్. ఈ చిత్రంలో నటించిన వివిధ భాషలకు చెందిన యాక్టర్స్ స్వసిక విజయన్, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ, లయ, బేబి శ్రీరామ్ దీత్య ఒక్కొక్కరుగా డైరెక్టర్ శ్రీరామ్ వేణు దగ్గరకు వస్తారు. వీళ్లు తనకు బర్త్ డే విషెస్ చెప్పేందుకు వచ్చారని శ్రీరామ్ వేణు అనుకోగా...వాళ్లు మాత్రం 'తమ్ముడు' సినిమా రిలీజ్ ఎప్పుడు?, ప్రమోషన్ ఎప్పుడు బిగిన్ చేస్తారు? అని అడుగుతారు. సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ టాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్న లయ. తన పోస్టర్ కూడా రిలీజ్ చేయలేదు, రిలీజ్ డేట్ చెప్పడం లేదు అని అడుగుతుంది. చివరలో బేబి శ్రీరామ్ దీత్య కూడా నేను థర్డ్‌క్లాస్‌లో ఉన్నప్పుడు మూవీ స్టార్ట్ చేశారు, ఇప్పుడు నేను ఫిఫ్త్ క్లాస్ చదువుతున్నా, మూవీ రిలీజ్ డేట్ ఎప్పుడు? అని అడుగుతుంది. దీంతో డైరెక్టర్ శ్రీరామ్ వేణు వాళ్లకు ఏం చెప్పాలో తెలియక మీకు ఇన్ఫామ్ చేస్తా నంటూ పంపిస్తారు. చివరలో ప్రొడ్యూసర్స్ దిల్ రాజు, శిరీష్ శ్రీరామ్ వేణు బర్త్ డే కేక్ కట్ చేయడంతో పాటు జూలై 4న 'తమ్ముడు' మూవీ రిలీజ్ అంటూ ప్రకటిస్తారు. మంచి ఫన్ తో డిజైన్ చేసిన ఈ వీడియో క్రియేటివ్‌గా ఉండి ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటోంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ సంస్థతో హీరో నితిన్, దర్శకుడు శ్రీరామ్ వేణుకు మంచి అనుబంధం ఉంది. హీరో నితిన్ దిల్, శ్రీనివాస కళ్యాణం వంటి మూవీస్ చేయగా.. దర్శకుడు శ్రీరామ్ వేణు నాని హీరోగా ఎంసీఏ, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా వకీల్ సాబ్ వంటి సూపర్ హిట్ చిత్రాలు రూపొందించారు. ఇప్పుడు ఈ ముగ్గురి కాంబినేషన్ లో 'తమ్ముడు' సినిమా వస్తుండటం సినీ ప్రియుల దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రేక్షకులకు మర్చిపోలేని సినిమాటిక్ ఎక్స్పీరియన్స్‌ను "తమ్ముడు" సినిమాతో అందించబోతున్నారు దర్శకుడు శ్రీరామ్ వేణు.





అమైరా దస్తర్

5-Pg5exJ.qxd:5-Pg5exJ.qxd 05/05/25 12:03 AM Page 1



# భారత్ నౌకలను అనుమతించబోం

## ప్రతీకార చర్యలకు దిగుతున్న పాకిస్థాన్



**లాహోర్, మే 4:** పహల్గాంలో ఉగ్రవాద దాడి తర్వాత భారత్, పాకిస్థాన్ల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు కూడా పెరుగుతున్నాయి. పొరుగు దేశంతో వాణిజ్య సంబంధాలను తెంచుకునే దిశగా భారత్ అడుగులు వేస్తున్నది. ఇప్పటికే పాక్ నుంచి ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులపై నిషేధం విధిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోగా, ఆ తర్వాత పొరుగు దేశ నౌకలను భారత్‌లోని ఓడరేవుల్లోకి అనుమతించకూడదని నిర్ణయించింది. అయితే కాస్త ఆలస్యంగా పాకిస్థాన్ మరో నిర్ణయం తీసుకుంది. భారత్‌కు చెందిన నౌకలను తమ ఓడరేవుల్లోకి అనుమతించబోమని నిర్ణయించింది. పొరుగు దేశంతో సముద్ర సార్వభౌమత్వం, ఆర్థిక ప్రయోజనాలు, జాతీయ భద్రతను కాపాడటానికి పాక్ తక్షణమే పలు చర్యలను అమలు చేస్తుంది. భారత నౌకలను పాక్ ఓడరేవుల్లోకి వచ్చేందుకు అనుమతులు లేవు అంటూ సముద్ర వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆదేశాలను జారీ చేసింది. భారత వాణిజ్య మంత్రిత్వశాఖ పాక్ నుంచి వచ్చే దిగుమతులపై నిషేధం విధిస్తున్నట్లు నోటిఫికేషన్ విడుదల చేసింది. పాకిస్థాన్ నుంచి మన దేశానికి రవాణా అయ్యే అన్ని ఉత్పత్తులకు ఈ నిషేధం వర్తిస్తుందని స్పష్టం చేసింది. పాకిస్థాన్‌తో సముద్ర రవాణా మార్గాలను భారత్ మూసివేసింది. మర్చెంట్ షిప్పింగ్ చట్టం, 1958లోని 411 సెక్షన్ ప్రకారం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ఆంక్షలు తక్షణమే అమల్లోకి వస్తాయని వెల్లడించింది. భారత ఓడలు కూడా పాక్ పోర్టుల్లోకి వెళ్లకూడదని స్పష్టం చేసింది. మరో వైపు ఆ దేశం నుంచి భారత్‌కు వివిధ మార్గాల్లో వచ్చే అన్నిరకాల ఉత్తరాలు, పార్సిళ్ల రవాణాను కూడా నిలిపివేస్తున్నట్లు తపాలా శాఖ ప్రకటించింది. 2019లో పుల్వామా ఉగ్రదాడి తర్వాత పాక్ దిగుమతులపై 200% సుంకాన్ని కేంద్రం విధించింది. దాంతో అవి చాలావరకు తగ్గిపోయాయి. పహల్గాం ఉగ్రదాడి, సరిహద్దుల్లో కవ్వింపు చర్యల నేపథ్యంలో ఇప్పుడు ఇతర దేశాల మీదుగా పాక్ నుంచి వచ్చే దిగుమతుల్ని సైతం నిలిపివేసింది. దీంతో భారత్‌కు ఎగుమతులపైనే ఆధారపడుతున్న పాక్‌లోని కొన్ని పరిశ్రమలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉండడం వల్ల ఆ దేశం ప్రతీకార చర్యలకు పాల్పడుతోంది.

# సింగపూర్ ప్రధానిగా మళ్లీ లారెన్స్ వాంగ్



**సింగపూర్, మే 4:** ప్రపంచంలో ఆర్థిక అనిశ్చితులు నెలకొన్న సమయంలో సింగర్‌పూర్‌లో జరిగిన ఎన్నికల్లో అధికార పీపుల్స్ యాక్షన్ పార్టీ (పీఏపీ) మరోసారి ఘన విజయం సాధించింది. అక్కడ జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ప్రధాని లారెన్స్ వాంగ్ నేతృత్వంలో భారీ గెలుపును సొంతం చేసుకుంది. దీంతో ప్రధానిగా మరోసారి ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. సింగపూర్ పార్లమెంటు ఎన్నికల పోలింగ్ ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8గంటల వరకూ జరిగింది. దాదాపు 26 లక్షల మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ దేశంలో ఓటేయడం తప్పనిసరి. అనంతరం రాత్రి జరిగిన ఓట్ల లెక్కింపులో పీఏపీ తిరుగులేని విజయం సాధించింది. సింగపూర్ పార్లమెంటులో మొత్తం 98 సీట్లుండగా 5 చోట్ల ఇప్పటికే పీఏపీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఎన్నికలు జరిగిన 93 సీట్లలో 82 చోట్ల ఆ పార్టీ విజయం సాధించి మొత్తం 87సీట్లను గెలుచుకుంది. ప్రతిపక్ష వర్కర్స్ పార్టీ 10 సీట్లలో గెలిచింది. 66 ఏళ్లుగా సింగపూర్‌లో పీఏపీనే అధికారంలో కొనసాగు తోంది. గత ఏడాది సింగపూర్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన లారెన్స్ వాంగ్ (52) తన నేతృత్వంలో జరిగిన తొలి ఎలక్షన్‌లో పట్టును నిరూపించుకున్నారు. అమెరికాలో శిక్షణపొందిన ఈ ఆర్థికవేత్త సింగపూర్ ఆర్థిక మంత్రిగానూ సేవలందిస్తున్నారు. సింగపూర్ సార్వత్రిక ఎన్నికల్లో బంపర్ మెజారిటీతో విజయం సాధించిన లారెన్స్ వాంగ్‌కు ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. ఆయనతో కలిసి పనిచేయడం కొనసాగించాలని ఎదురుచూస్తు న్నట్లు చెప్పారు. భారత్, సింగపుర్ మధ్య బలమైన, బహుముఖ భాగస్వామ్యాన్ని పంచుకుంటాయి అని అన్నారు. 97 పార్లమెం టరీ స్థానాల్లో 87 స్థానాలను గెలుచుకుంది పీఏపీ. సింగపూర్‌లో తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధమైంది.



## పాక్‌కు రహస్య సమాచారం లీక్ చేసిన ఇద్దరి అరెస్టు

**అమృత్‌సర్, మే 4:** అమృత్‌సర్‌లో భారత ఆర్మీ కంటోన్మెంట్ ప్రాంతాలు, వైమానిక స్థావరాలకు సంబంధించిన అత్యంత సున్నితమైన సమాచారం, ఫొటోలను పాకిస్థాన్‌కు చేరవేస్తున్న ఇద్దరు వ్యక్తులను పంజాబ్‌లోని అమృత్‌సర్ రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. వీరిని పాలక్ షేర్ మసిహ్, సూరజ్ మసిహ్‌లుగా గుర్తించారు. వీరు పాక్‌లోని ఇంటెలిజెన్స్ ఆపరేటివ్‌లతో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రాథమిక దర్యాప్తు సమాచారం ప్రకారం హర్‌ప్రీత్ సింగ్ అలియాస్ పిట్టు అలియాస్ హ్యాపీ సూచనల మేరకు వీరు పని చేస్తున్నట్లు తేలింది. ప్రస్తుతం హర్‌ప్రీత్ సింగ్ అమృత్‌సర్ జైల్లో ఉన్నాడు. వీరి వద్ద అత్యంత సున్నితమైన విజువల్స్ తోపాటు, డేటా ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. అధికార రహస్యాల చట్టం కింద వీరిపై కేసులు పెట్టారు. దర్యాప్తు ముందుకు సాగే కొద్దీ మరిన్ని విషయాలు బయటపడవచ్చని, ఇంకొన్ని అరెస్టులు ఉండొచ్చని పోలీసులు చెబుతున్నారు.

# ఇమ్రాన్, భుట్టోల ఎక్స్‌ఖాతాలు నిలిపివేత



**న్యూఢిల్లీ, మే 4:** పహల్గాం దాడి తర్వాత పాక్‌పై భారత్ అనేక చర్యలు తీసుకుంటున్న సంగతి తెలిసిందే. ఇందులోభాగంగా తాజాగా పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ ఆ దేశ విదేశాంగ మాజీ మంత్రి పిపిపి చీఫ్ బిలావల్ భుట్టోల ఎక్స్ ఖాతాలను నిలిపివేసింది. పహల్గాం ఉగ్ర దాడితర్వాత జమ్ముకాశ్మీర్‌పై వారు తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్నారని కేంద్రం నిలిపివేతకు ఆదేశించింది. ఇటీవలే పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా మహ్మద్ ఆసిఫ్ ఎక్స్ ఖాతాను భారత్ నిలిపివేసింది. పాక్ కేంద్రంగా నిర్వహిస్తున్న 16 యూట్యూబ్ ఛానళ్లపైనా వేటు వేసింది. పహల్గాం ఉగ్రదాడిపై ఇటీవల ఇమ్రాన్‌ఖాన్ మీడియాతో మాట్లాడుతూ ఇది చాలా విషాదకర సంఘటన అన్నారు. కాశ్మీర్‌పరంగా భారత్ మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ప్రేలాపనలు చేసారు. ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారత్ పాక్‌పై దాడులకు దిగితే గట్టిగా బదులిస్తామని హెచ్చరించారు. పాక్‌మాజీ విదేశాంగమంత్రి భిలావల్‌భుట్టో సైతం ఇదేవిధంగా నోరుపారేసుకున్నారు. సింధూజలాలు ప్రవహించకపోతే రక్తం పారుతుందని రెచ్చగొట్టే వ్యాఖ్యలుచేసారు. సింధూనది తమదేనని ఆ నాగరికతకు నిజమైన సంరక్షకులం తామేనంటూ భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు. జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. ఈదాడితో పాక్, భారత్‌ల మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరాయి. పాక్ సీమాంతర ఉగ్రవాదం విడిచిపెట్టేవరకూ ఆదేశంపై కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించిన భారత్ పలు కీలక నిర్ణయాలు తీసుకొని పాక్ జాతీయులను దేశం నుంచి వెళ్లగొట్టింది.

## ఇజ్రాయెల్‌పై క్షిపణి దాడి ఢిల్లీ-టెల్అవీవ్ విమానం అబుదాబీకి



**టెల్అవీవ్, మే 4:** ఇజ్రాయెల్‌లోని కీలక నగరమైన టెల్ అవీవ్ శివారులోని బెన్ గురియన్ విమానాశ్రయం సమీపంలో క్షిపణి దాడితో ఎయిరిండియా అధికారులు అప్రమత్తమయ్యారు. ఢిల్లీ నుంచి టెల్అవీవ్‌కు వెళ్తున్న ఎయిరిండియా విమానాన్ని అధికారులు అబుదాబీకి మళ్లించారు. ఎయిర్ ఇండియాబోయింగ్ 787 విమానం ఎఐ 139 టెల్అవీవ్‌లో ల్యాండ్ కావడానికి దాదాపు గంట ముందు ఈ దాడి జరగడంతో దారి మళ్లించినట్లు సమాచారం. ఈ విమానం తిరిగి ఢిల్లీకి వచ్చేస్తుందని సదరు వర్గాలు పేర్కొ న్నాయి. ఫ్లైట్ ట్రాకింగ్ వెబ్‌సైట్ ఫ్లైట్‌రాడార్ 24.కామ్ ప్రకారం అబుదాబీకి మళ్లించాలని నిర్ణయం తీసుకున్న సమయానికి ఈ విమానం జోర్డాన్ గగనతలంలో ఉంది. తాజా పరిణామాల నేపథ్యంలో టెల్అవీవ్ నుంచి ఢిల్లీకి ఆది వారం రావాల్సిన ఎయిరిండియా విమానం రద్దయింది.

**టెల్ అవీవ్‌కు ఎయిరిండియా విమాన సర్వీసులు రద్దు:** మరోవైపు, టెల్అవీవ్‌లో తాజా పరిణామాల నేపథ్యంలో మే 6 వరకు విమాన సర్వీసులు రద్దు చేస్తున్నట్లు ఎయిరిండియా ప్రకటించింది. వినియోగదారులు, సిబ్బంది భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. తమ ఉద్యోగులు కస్టమర్లకు సహాయం చేస్తూ ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో వారికి సహాయం చేస్తున్నట్లు పేర్కొంది. మే 4 నుంచి 6 మధ్య ప్రయాణాలకు టికెట్లు బుక్ చేసుకున్న వారికి పూర్తి మొత్తాన్ని రిఫండ్ చేస్తా మని 'ఎక్స్'లో పేర్కొంది. ఇతర సమాచారం కోసం 011-69329333, 011-69329999 నంబర్లు లేదా తమ అధికారిక వెబ్‌సైట్ ఎయి రిండియా.కామ్‌ను సంప్రదించవచ్చని సూచించింది.

**అంతకు ఏడురెట్లు బలంగా దెబ్బ కొడతాం: ఇజ్రాయెల్ రక్షణ మంత్రి:** యెమెన్ నుంచి హూతీ తిరుగుబాటుదారులు ప్రయోగించిన క్షిపణి ఆదివారం ఉదయం బెన్ గురియన్ విమానాశ్రయం ప్రధాన టెర్నినల్ సమీపంలో కూలినట్లు ఇజ్రాయెల్ అధికారులు వెల్లడించారు. ఈ క్షిపణి దాడి సమీపంలో టెల్ అవీవ్ శివారులో ఉన్న విమానాశ్రయం సమీపంలో దట్టమైన పొగలు అలముకున్నట్లు ఉన్న వీడియో ఫుటేజీలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. ఈ క్షిపణి దాడి నేపథ్యంలో టెల్ అవీవ్‌లోని విమానాశ్రయానికి విమాన రాకపోకలు నిలిపివేశారు. ఈ క్షిపణి దాడిలో ఆరుగురికి గాయాలైనట్లు సమాచారం. ఈ ఘటనపై ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ మాట్లాడుతూ తమపై దాడిచేసిన వారికి.. అంతకు ఏడు రెట్లు బలంగా దెబ్బతీస్తామని హెచ్చరించారు.

# బలూచ్ ఆర్మీతో పాకిస్థాన్‌కు వణుకు



**ముజఫరాబాద్, మే 4:** భారత్ తమపై ఎక్కడ యుద్ధానికి దిగుతుందోనని భయపడిపోతున్న పాకిస్తాన్‌కు మరో షాక్ తగిలింది. బలూచ్ లిబరేషన్ ఆర్మీ దాడులతో పాకిస్తాన్ ఆర్మీ అల్లాడిపోతోంది. కొన్ని రోజుల క్రితం పాక్ సైనికులు వెళుతున్న ట్రైన్‌ని హైజాక్ చేసిన బలూచ్ లిబరేషన్ ఆర్మీ తాజాగా బలూచిస్తాన్‌లో ఓ టౌన్‌ని కూడా స్వాధీనం చేసుకుంది. బీఎల్‌ఏ వరుస దాడులతో బలూచిస్తాన్‌పై పాకిస్తాన్ నియంత్రణ కోల్పోతోంది. తాజా దాడిలో పాక్ సైనికులను బంధించి మంగుచోర్ పట్టణాన్ని బీఎల్‌ఏ స్వాధీనం చేసుకుంది. బలుచిస్తాన్‌ను ప్రత్యేక దేశంగా ప్రకటించాలని బీఎల్‌ఏ పోరాడుతోంది. ఇప్పటికే బీఎల్‌ఏ దాడుల్లో వందలాదిమంది పాక్ సైనికులు మృతి చెందారు. సొంతదేశంలో నిరసనకారుల నుంచి ఓ పట్టణాన్ని కాపాడుకోలేక పోయిన పాక్ భారత్‌పై మాత్రం దాడులకు వెనుకాడబోం అంటూ ప్రకటించడం హాస్యాస్పదంగా ఉంది. పాకిస్తాన్‌లోని నైరుతి ప్రాంతమే బలూచిస్తాన్. ఇది పాక్‌లో ఒక ప్రావిన్స్‌గా ఉంది. పాకిస్తాన్ మొత్తం విస్తీర్ణంలో 44 శాతం బలూచిస్తాన్ ఉంటుంది. విస్తీర్ణం పరంగా పాకిస్తాన్‌లో అతి పెద్ద ప్రావిన్స్‌గా బలూచిస్తాన్ ఉంది. అలాగే మిగతా అన్ని ప్రావిన్స్‌లో కెల్లా అతి తక్కువ జనాభా ఉన్న ప్రావిన్స్ కూడా బలూచిస్తానే. బలూచిస్తాన్‌లో చమురు, బొగ్గు, బంగారం, రాగి, సహజ వాయు వు వనరులు పుష్కలంగా ఉన్నాయి. బ్రిటిష్ ఇండియాలో విలీనం చేయకముందు వరకు బలూచిస్తాన్ స్వతంత్ర దేశంగానే ఉండేది. బ్రిటిష్ వారి నుంచి మనకు స్వతంత్రం వచ్చిన తర్వాత దేశ విభజన తర్వాత పాకిస్తాన్‌లో భాగమైంది. ఆ తర్వాత కొంత కాలానికి స్వతంత్ర దేశం కోసం బలూచిస్తాన్ నుంచి డిమాండ్ పుట్టుకొచ్చింది. ఆ ప్రావిన్స్‌లో పాక్ సాగిస్తున్న మారణకాండ కూడా తిరుగుబాటుకు మరో కారణం. 2011 నుంచి 2024 జనవరి వరకు పాక్‌లో మొత్తం 10,078 మంది అదృశ్యం అయ్యారు. అదృశ్యమైనవారిలో 2,752 మంది బలూచ్ పౌరులే. 2001-2017 మధ్య 5,228 మంది బలూచ్ పౌరులు అదృశ్యం కావడం గమనార్హం. ప్రస్తుతం బీఎల్‌ఏ చురుకుగా వేర్పాటువాద కార్యకలాపాలు సాగిస్తోంది. బలూచిస్తాన్ స్వతంత్ర దేశం కావాలనే డిమాండ్‌తో బీఎల్‌ఏ ఏర్పాటైంది. దశాబ్ద కాలంగా పాకిస్తాన్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తోంది. అయితే పాకిస్థాన్ ప్రభుత్వం, అమెరికా బీఎల్‌ఏను ఒక ఉగ్ర సంస్థగా గుర్తించాయి. ప్రస్తుతం పాక్, ఇండియాతో యుద్ధం వస్తుందేమో అని భయపడుతున్న క్రమంలో బీఎల్‌ఏ పాకిస్థాన్‌తో పాటు చైనాకు కూడా వార్నింగ్ ఇచ్చింది. వెంటనే బలూచిస్తాన్‌ను వదిలివెళ్లిపోవాలంటూ ఆ రెండు దేశాలను హెచ్చరించింది.



## భారత వాయుసేనతో ఘర్షణ జరగొచ్చు

### పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజ ఆసీఫ్

**ఇస్లామాబాద్, మే 4:** మాపై 36 గంటల్లో భారత్ దాడి చేయడం ఖాయం అంటూ గగ్గోలు పెట్టిన పాక్ రక్షణ మంత్రి ఖవాజ ఆసీఫ్ ఇప్పుడు కొత్త పల్లవి అందుకొన్నారు. ఆయన 36 గంటలు అని చెప్పి నాలుగు రోజులు దాటినా భారత్ నుంచి ఎటువంటి ప్రతిదాడి లేకపోవడంతో కొత్త కోణం తెరపైకి తెచ్చారు. భారత్ వాయుసేనతో ఘర్షణ జరిగే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయని అంచనా వేశారు. ఆయన పాక్‌కు చెందిన ఎఆర్‌వై న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే తమ గగనతలంలోకి వచ్చేందుకు ప్రయత్నించిన రఫేల్ యుద్ధ విమానాలను అడ్డుకొన్నట్లు ఆయన చెప్పుకొచ్చారు. ఇక ఇదే మంత్రి మరో ఛానెల్‌లో మాట్లాడుతూ సింధు నదిపై భారత్ నిర్మించే ఏ కట్టడాన్నిఅయినా దాడిచేసి కూల్చేస్తామని పేర్కొన్నారు. అసలు భారత్ దీనిపై నిర్మా ణాలకు యత్నించడమే దౌర్జన్యంగా భావిస్తా మన్నారు. గత నెల చివరలో ఆసీఫ్ ఓ ప్రకటన చేశారు. భారత్ 24-36 గంటల్లో తమపై సైనిక చర్య చేపడుతుందని సంచలన ప్రకటన చేశారు. భారత్‌లో సిసిఎస్ సమావేశం ముగిసి ఉగ్రవాదులపై చర్యకు మిలటరీకి అధికారాలు ఇచ్చిన వేళ ఈ ప్రకటన వెలువడటం సంచలనం సృష్టించింది. కానీ అటువంటిది ఏమీ చోటుచేసుకోలేదు.


## జార్ఖండ్‌లో రోడ్డుపై వెళ్తున్న కారులో పేలుడు డ్రైవర్ సజీవ దహనం



**రాంచీ, మే 4:** రోడ్డుపై వెళ్తున్న కారులో మంటలు చెలరేగాయి. కొన్ని క్షణాల్లోనే ఆ కారులో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలింది. దీంతో కారులో వ్యాపించి మంటల్లో కాలి డ్రైవర్ సజీవదహనమయ్యాడు. ఇది చూసి అక్కడున్న జనం షాక్ అయ్యారు. జార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్‌లో ఈ సంఘటన జరిగింది. కద్మా ప్రాంతంలో రోడ్డుపై వెళ్తున్న కారులో మంటలు వ్యాపించాయి. దీంతో డ్రైవర్ కారును రోడ్డుపై ఆపాడు. అయితే ఆ కారు డిక్కీలో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలింది. దీంతో ఆ మంటల్లో కారు కాలిపోయింది. కారు డ్రైవ్ చేసిన వ్యక్తి సజీవ దహనమయ్యాడు. ఈ సంఘటన చూసిఅక్కడున్న జనం షాక్ అయ్యారు. కాగా, ఈ సంఘటన గురించి తెలిసిన వెంటనే పోలీసులు, ఫోరెన్సిక్ బృందం అక్కడకు చేరుకున్నారు. మృతుడిని సునీల్ అగర్వాల్‌గా గుర్తించారు. కారు పేలిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు ఈ సంఘటనకు సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# భారత్-పాక్ సరిహద్దులో పాక్ రేంజర్

## అదుపులోకి తీసుకున్న బిఎస్ఎఫ్ జవాన్లు



**జైపూర్, మే 4:** భారత్ సరిహద్దులోకి చొరబడిన పాకిస్థాన్ రేంజర్‌ను బీఎస్ఎఫ్ జవాన్లు పట్టుకున్నారు. శనివారం రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్ సమీపంలో ఉన్న భారత్‌పాక్ బోర్డర్‌లోకి ఓ పాకిస్థాన్ రేంజర్ చొరబడ్డాడు. అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో బీఎస్ఎఫ్ జవాన్లు అతడిని అదుపులోకి తీసుకున్నారు. భారత్‌పాక్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ పాకిస్థాన్ రేంజర్ భారత్‌లోకి ప్రవేశించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇటీవల అనుకోకుండా భారత్ సరిహద్దు దాటి పాక్‌లోకి ప్రవేశించిన ఓ బీఎస్ఎఫ్ కానిస్టేబుల్‌ను పాకిస్థాన్ ఆర్మీ నిర్బంధించింది. అతనిని విడుదల చేయాలని భారత్ సైనిక అధికారులు చర్చలు జరుపుతున్నప్పటికీ, ఫలితం కనిపించడం లేదు. ఉన్నతాధికారుల అనుమతి లేనిదే ఆయన్ను విడుదల చేయడం కుదరదని పాక్ ఆర్మీ వర్గాలు అంటున్నాయి. మరి ఇప్పుడు పాక్ రేంజర్‌ను అదుపులోకి తీసుకున్న భారత్ ఎలా స్పందిస్తుందో చూడాలి. పాక్ మహిళను పెళ్లాడిన విషయాన్ని రహస్యంగా ఉంచడమే కాకుండా, వీసా గడువు ముగిసినా ఆమెను ఇక్కడే ఉంచిన ఓ జవాన్‌ను సీఆర్పీఎఫ్ ఉద్యోగం నుంచి తొలగించింది. పహల్గాం ఉగ్రదాడి తరువాత ఇరు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ఈ వ్యవహారం బయటకొచ్చింది. పాక్ జాతీయులు స్వదేశానికి వెళ్లిపోవాలని భారత్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలోనే ఆమె వివరాలు ఆరా తీయగా, అసలు విషయం వెలుగులోకి వచ్చింది. సీఆర్పీఎఫ్ 41వ బెటాలియన్‌కు చెందిన మునీర్ అహ్మద్ అనే జవాన్ గతేడాది మే నెలలో పాక్‌కు చెందిన ఓ మహిళను వీడియో కాల్ మాధ్యమంలో పెళ్లి చేసుకున్నాడు. ఆ తరువాత ఆమె వీసాపై భారత్‌కు చేరుకుంది. అయితే, ఈ విషయాన్ని సదరు జవాన్ ఉన్నతాధికారుల వద్ద దాచి ఉంచాడు. పైగా వీసా గడువు ముగిసినా ఆమెను ఇక్కడే ఉంచాడు. దీంతో ఉన్నతాధికారులు మునీర్‌ను ఉద్యోగం నుంచి తొలగించారు. పాక్ జాతీయురాలితో వివాహం జరిగిన విషయాన్ని మునీర్ అహ్మద్ దాచిపెట్టాడు. అంతేకాదు ఆమె వీసా గడువు ముగిసిందని తెలిసి కూడా ఆశ్రయం కల్పించాడు. అందుకే అతన్ని తక్షణం సర్వీసు నుంచి తొలగిస్తున్నాం. నిబంధనలు ఉల్లంఘించడంతోపాటు జాతీయ భద్రతకు విఘాతం కలిగేలా ప్రవర్తించాడు. అందుకే ఈ మేరకు చర్యలు తీసుకున్నాం'అని ఆర్పీఎఫ్‌ప్రతినిధి వెల్లడించారు.

## 128 యేళ్ల యోగా గురువు స్వామి శివానంద కన్నుమూత



**వారణాసి, మే 4:** ప్రముఖ యోగా గురువు, పద్మశ్రీ అవార్డు గ్రహీత స్వామి శివానంద (128) తుదిశ్వాస విడిచారు. వారణాసిలోని నివాసంలో ఆయన కన్నుమూసినట్లు సన్నిహితులు వెల్లడించారు. శివానంద మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సహ పలువురు ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతి యోగా రంగానికి తీరని లోటుగా పేర్కొన్నారు. 1896 ఆగస్టు 8న అవిభాజ్య భారత్‌లోని సిల్హెట్ ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో ఉన్న జిల్లాలో నిరుపేద కుటుంబంలో స్వామి శివానంద జన్మించినట్లు వారి శుష్యులు వెల్లడించారు. ఆరేళ్ల వయసులోనే శివానంద తల్లిదండ్రులు మరణించారు. దీంతో ఆయన బెంగాల్‌లోని ఓ ఆశ్రమంలో పెరిగారు. గురు ఓంకారానంద గోస్వామి ఆయనను పెంచి పెద్ద చేయడమేగాక, యోగా వంటి ఆధ్యాత్మిక విషయాలను బోధించారు. ఈ క్రమంలోనే తన జీవితాన్ని సమాజసేవకు అంకితం చేశారు. 50 ఏళ్లుగా పూరిలో 4,00, 600 కుష్టు రోగులకు సేవ చేశారు. అయితే యోగా రంగానికి చేసిన కృషికి గాను 2022లో శివానంద, అప్పటి రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డును అందుకున్నారు. ఆ సమయంలో తెల్లని ధోవతి, కుర్తా ధరించి కాళ్లకు చెప్పులు లేకుండా అత్యంత సామాన్యంగా వచ్చి పురస్కారాన్ని స్వీకరించారు. దీంతో అప్పట్లో అందరి దృష్టిని ఆకర్షించారు.




## ఉక్రెయిన్‌పై అణ్వాయుధాలను వాడం: పుతిన్

**మాస్కో, మే 4:** ఉక్రెయిన్‌పై అణ్వాయుధాలను ఉపయోగించే అవసరం తలెత్తదని రష్యా అధ్యక్షుడు పుతిన్ వెల్లడించారు. ఆ పరిస్థితి ఏర్పడదని తాను ఆశిస్తున్నట్లు స్పష్టం చేశారు. రష్యా అధికారిక టివికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్ వివాదానికి తాత్కాలిక ముగింపు తీసుకురావడానికి రష్యా వద్ద బలం ఉందన్నారు. మరోవైపు రష్యా నిర్వహిస్తున్న 'విక్టరీడే' కవాతుకు హాజరయ్యే విదేశీ ప్రముఖుల ప్రాణాలకు తాను హామీ ఇవ్వలేనంటూ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ హెచ్చరిక జారీ చేశారు.

# తెరుచుకున్న బద్రీనాథ్ దేవాలయం

## ప్రధాని మోడీ పేరిట ఉత్తరాఖండ్ సిఎం మహాభిషేకం



**డెహ్రాడూన్, మే 4:** ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథుడి ఆలయ ద్వారాలు ఆరు నెలల తర్వాత తెరుచుకోగా, ప్రధాని నరేంద్ర మోదీ పేరిట సీఎం పుష్కర్ సింగ్ ధామి తొలి మహాభిషేక పూజను నిర్వహించారు. ఆ తర్వాత దేశ ప్రజల శ్రేయస్సు కోసం ప్రార్థించారు. లక్ష్మీ దేవి, వినాయకుడు సహా ఆలయ ప్రాంగణంలోని అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆ సమయంలో ఆయనతోపాటు పలువురు పండితులు కూడా ఉన్నారు. కొన్ని నెలలపాటు ఉన్న కఠిన వాతావరణ పరిస్థితులు తగ్గడంతో ఆదివారం ఉదయం ఆరు గంటలకు భక్తుల జయ జయ ధ్వానాలు, అర్చకుల వేద మంత్రోచ్చారణల మధ్య మత పెద్దల సమక్షంలో బద్రీనాథ్ ఆలయ ప్రధాన ద్వారాలను అధికారులు తెరిచారు. ఆ సమయంలో భారత సైనికులు ప్రత్యేక సంగీతాన్ని ఆలపించారు. అంతకుముందు 15 టన్నుల రకరకాల అందమైన పుష్పాలతో ఆలయాన్ని ముస్తాబు చేశారు. దేశం నలుమూలలతోపాటు నేపాల్ నుంచి వచ్చిన వందలాది మంది భక్తులు బద్రీనాథుడిని దర్శించుకున్నారు. బద్రీనాథ్ ధామ్ తలుపులు తెరిచిన సందర్భంగా మానా, బామ్ని గ్రామానికి చెందిన మహిళలు ఆలయ ప్రాంగణంలో నృత్యం చేశారు. సీఎం పుష్కర్ సింగ్ ధామి బద్రీనాథ్‌లోని యాత్రికుల నుంచి ప్రయాణ ఏర్పాట్లపై అభిప్రాయాలను తీసుకున్నారు. సురక్షితమైన చార్‌ధామ్ యాత్ర, భక్తులకు సౌకర్యాల కోసం ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. ఆలయ సమీపంలో జరుగుతున్న నిర్మాణ పనులను కూడా ఆయన పరిశీలించారు. ప్రయాణికుల భద్రత, సౌకర్యా లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పోలీసు సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. గోవింద్ ఘాట్ వద్ద అలకనంద నదిపై నిర్మాణంలో ఉన్న వంతెన నిర్మాణ పనుల గురించి ఆయన ఆరా తీశారు. జిల్లా మేజిస్ట్రేట్‌ను వంతెన నిర్మాణాన్ని నాణ్యతతో పూర్తి చేయాలని కోరారు. గతనెల 30న గంగోత్రి, యమునోత్రి ఆలయాల తలు పులు తెరవడం వల్ల చార్‌ధామ్ యాత్ర ప్రారంభమైంది. ఈనెల 2న, భక్తుల కోసం కేదార్‌నాథ్ ధామ్ తలుపులు తెరుచుకోగా, బుధవారం బద్రీనాథ్ ధామ్ తలుపులు భక్తుల కోసం తెరుచుకున్నాయి. దీంతో ఛార్‌ధామ్ యాత్ర సంపూర్ణంగా ప్రారంభమైనట్లైంది.



## రాంబన్‌జిల్లాలో లోయలోకి పడిన ఆర్మీ వాహనం

### ముగ్గురు సైనికులు మృతి

**శ్రీనగర్, మే 4:** జమ్ము కశ్మీర్‌లోని రాంబన్ జిల్లాలో సైనిక వాహనం అదుపుతప్పి లోయలో పడింది. ఈ దుర్ఘటనలో వాహనంలో ఉన్న ముగ్గురు సైనికులు ప్రాణాలు కోల్పోయారు. చనిపోయిన సైనికులను అమిత్ కుమార్, సుజీత్ కుమార్, మన్ బహదూర్‌గా గుర్తించారు. ఆర్మీ వాహనం పడిన లోయ ఏకంగా 700 అడుగుల లోతు ఉండటం ప్రమాద తీవ్రతను తెలియజేస్తోంది. ప్రమాద స్థలిలో సైనికుల మృతదేహాలతో పాటు వారికి సంబంధించిన కొన్ని వస్తువులు కొన్ని పత్రాలు దొరికినట్లు సమాచారం. జమ్మూ నుంచి శ్రీనగర్‌కు వెళ్తున్న సైనిక వాహన శ్రేణిలో ఆవాహనం ఒక భాగమని సైనిక వర్గాలు తెలిపాయి. బ్యాటరీ చష్మా ప్రాంతంలో వాహనం లోయలో పడింది. వెంటనే అక్కడకు చేరుకున్న సైన్యం, జమ్ముకశ్మీర్ పోలీసులు, రాష్ట్ర విపత్తు నిర్వహణ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. కాన్వాయ్‌లో భాగమైన ఆర్మీ వాహన డ్రైవర్ నియంత్రణ కోల్పోవడం వల్ల ప్రమాదం జరి గింది. వాహనంలో ముగ్గురు వ్యక్తులు ఉన్నారు. దురదృష్టవశాత్తు వారు ముగ్గురూ మరణించారు. పోలీసు బృందం, ఆర్మీ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని చర్యలు నిర్వహించాయి. మృతదేహాలను వెలికితీసి పైకి తీసుకురావడానికి చర్యలు చేపట్టాం. ఘటనాస్థలానికి వెళ్లగా అక్కడ ఒక నట్‌బోల్ట్ కనిపించింది.

అది బహుశా స్టీరింగ్ వీల్స్ నుంచి వచ్చి ఉండవచ్చు. కాబట్టి ఆ నట్‌బోల్ట్ కారణంగా డ్రైవర్ స్టీరింగ్ వీల్స్‌పై నియంత్రణ కోల్పోయాడని భావిస్తున్నాం. అదే ప్రమాదానికి ప్రాథమిక కారణంగా తెలుస్తోంది. దర్యాప్తు తర్వాతే విషయాలు స్పష్టంగా తెలుస్తాయి అని రమ్బాన్ ఎస్ఎస్పీ కుల్బీర్ సింగ్ తెలిపారు.

# శివయ్యకు ధారా పాత్ర

**శ్రీకాళహస్తి,మే 4 ప్రభాతవార్త:** సంప్రదాయాలు, సంస్కృతికి నిదర్శనమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం నుంచి డొల్లు కత్తెర ప్రారంభం కానున్నట్లు ఆలయాధికారి డి.బాపిరెడ్డి తెలిపారు. విశ్వసునామ సంవత్సరం వైశాఖ చిత్త శుద్ధి సప్తమి ఆదివారం రాత్రి 12.23 గంటలకు డొల్లు కత్తెర ప్రారంభం అయినట్లు వివరించారు. మండుటెసవిలో స్వామి వారికి ఉపశమనం కల్గించుటకు ఈ ఏర్పాట్లు చేసేటట్లు ఆది నుంచి వస్తుందని తెలిపారు. ఈ సంప్రదాయాన్ని అమలు చేస్తున్నట్లు ఇఓ వివరించారు. ఈ మేరకు ఆలయ అర్చకులు, వేదపండితులతో చర్చించిన మీదట నిర్ధారణ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వాయులింగేశ్వరుని మూల విరాట్టుకు పై భాగాన ధారా పాత్ర నెలకొల్పబడిందని వివరించారు. ఆలయంలోని వాయులింగేశ్వరుని మూల విరాట్టు మీద అలాగే ఆలయ ప్రధాన ద్వారం పక్కనే ఉన్న అష్టోత్తర లింగం ,పట్టణంలోని జెట్టిపాళెం లో వెలసిన చక్రేశ్వరస్వామి ఆలయంలోనూ, అలాగే అర్ధనారీశ్వరాలయంలో కూడా ఈ ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఆదివారం రెండవ కాలాబిషేకం తరువాత స్వామి విగ్రహంపై ధారాపాత్రను ఏర్పాటు చేసారు. ఈ నెల 11 నుంచి నిజ కత్తెర ప్రారంభమౌతుందన్నారు. ఈ నిజ కత్తెర మే నెల 28 వరకు కొనసాగుతుందన్నారు. 28న రాత్రి 1.28గంలకు కత్తెర త్యాగం జరుగుతుందని ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి, వివరించారు. ఈ సమయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.



అష్టోత్తర లింగంపై ధారా పాత్ర ఏర్పాటు

**6 నుంచి శివయ్యకు చిన్న కొటాయ్ ఉత్సవం**


శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే ఉత్సవాలు, సేవలు భిన్నంగా ఉంటాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 6నుంచి స్వామి అమ్మవార్లకు చిన్న కొటాయ్ ఉత్సవం నిర్వహించబడుతుందని ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి ఆదివారం వివరించారు. ఆలయంలో స్వామి అమ్మవార్లతోపాటు అనుంబంధంగా ఉన్న పరివార దేవతలకు కూడా నిత్యం ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. శ్రీరామ నవమి సందర్భంగా ఆలయంలో పెద్దకొటాయ్ ఉత్సవాలను పది రోజుల పాటు నిర్వహిస్తారు. వేసవిలో స్వామి అమ్మవార్లకు వారం రోజుల పాటు చిన్న కొటాయ్ ఉత్సవం నిర్వహిస్తారు. ఈ ఏడాది విసువాశ్వ నామ సంవత్సరం చిన్న కోటాయ్ ఉత్సవం ఈ నెల 6 నుంచి 12 వరకు నిర్వహించబడుతుందన్నారు. సాయంత్రం ప్రతి రోజూ 5.30గంటలకు ఈ ఉత్సవం నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నామని వివరించారు. స్వామి అమ్మవార్లను అలంకార మండపంలో చక్కగా అలంకరించి గ్రామోత్సవంగా ఆలయ ఆవరణలోని పొగడ చెట్టు కిందకు తీసుకువస్తారు. అక్కడ వట్టివేళ్ళతో పందిళ్ళు, పరదాలు ఏర్పాటు చేస్తారు. అక్కడ స్వామి అమ్మవార్లకు సేవలందించి అభిషేకాలు, అనంతరం మూడు ప్రదక్షిణలు జరిపి దీపారాధన, హారతులు అందించి ఆలయానికి చేర్చబడుతుందన్నారు. మే 5న గ్రామోత్సవం నిర్వహిస్తామని ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి వివరించారు.

# భగీరథ మహర్షికి ఘన నివాళి

**అనంతపురం న్యూటౌన్, మే 4 ప్రభాతవార్త:** భగీరథ మహర్షి జయంతి సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురం నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ దగ్గర గల కేర్ క్యూర్ హాస్పిటల్ ఎదురుగా వున్న భగీరథ మహర్షి విగ్రహానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్ తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మానవ ప్రయత్నంతో చాలా పెద్ద సాధనను చేయొచ్చు అనేదానికి భగీరథ మహర్షి ఒక ఉదాహరణ అని అన్నారు. మన జిల్లాకు అది వర్తిస్తుందని, కరువు జిల్లా, తక్కువ వర్షంపడే ప్రాంతం అయినా కూడా ప్రభుత్వం నుంచి చేస్తున్న ప్రయత్నాలు ఉపాధి హామీ పథకం, జల్ శక్తి అభియాన్, లాంటి పథకాలను జిల్లాలో సజావుగా అమలు చేస్తున్నామన్నారు. అందరూ మంచినీరు, తాగనీటిపై జవాబుదారీగా ప్రవర్తించాలన్నారు.

**భగీరథ ప్రయత్నం చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ:** భగీరథ జయంతి సందర్భంగా భారతదేశ వ్యాప్తంగా ఉన్న సగర ఆత్మీయ బంధువులకు శుభాకాంక్షలు తెలిపారు. భగీరథుడు ఎలాంటి ప్రయత్నాలు చేపట్టారు అనేది గుర్తుంచుకోవాలని, కరువు సీమలో నీటి కోసం తన శక్తి వంచన లేకుండా ధారపోసి భూమి లోపల నుంచి నీటిని తీసుకువచ్చి అపర భగీరథ ప్రయత్నం గురించి మనం మాట్లాడుకుంటామని, ఎంత కష్టంతో కూడుకున్నదైనా సాధించేందుకు మొక్కవోని దీక్షతో ప్రపంచంలోనే మానవాళికి ఉపయోగపడేటువంటిది భగీరథ ప్రయత్నంగా మనం భావించాలన్నారు. అలాంటి నీటి వనరులను గుర్తించి బయటకు తీసుకువచ్చి మనందరికీ స్ఫూర్తిదాయకమైనటువంటి, కఠోరమైనటువంటి శక్తిని చూపించిన మహానుభావుడుగా భగీరథ మహర్షి మనందరి హృదయాలలో నిలిచిపోయారన్నారు. భగీరథ మహర్షి ప్రయత్నాలను ఎలా సఫలీకృతం చేసారో అలాంటి ప్రయత్నాలను రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు చేస్తున్నారని, భగీరథ ప్రయత్నంతో పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి నీటి సదుపాయాన్ని రాష్ట్రానికి కల్పించే ఆలోచనతో పనిచేస్తున్నారన్నారు. భగీరథ మహర్షి ఆశీస్సులు రాష్ట్ర ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి, మనందరికీ ఉండాలని ఆశిస్తున్నామన్నారు.

రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు : అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ రాష్ట్రంలో సాగు తాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు భగీరథ ప్రయత్నం చేస్తున్నారన్నారు. భగీరథుడు కేవలం ఉప్పర కులస్తులకు మాత్రమే దైవం కాదని, ఏ పని తలపెట్టినా ఆయన పూర్తిగా నిలిచే దైవమని అన్నారు. భువి నుంచి దివికి గంగను తీసుకొచ్చేందుకు భగీరథుడు చేసిన కృషి చరిత్రలో ఎప్పటికీ నిలిచే ఉంటుందన్నారు. లక్ష్యసాధనలో ఆయన తీరు అందరికీ ఆదర్శనీయమన్నారు. విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్లో కష్టాల నుంచి గట్టెక్కించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న ప్రయత్నం భగీరథ ప్రయత్నంలా ఉందని అన్నారు. భగీరథ మహర్షి స్ఫూర్తితోనే రాష్ట్రంలో ప్రాజెక్టులన్ని పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిసి వెల్ఫేర్ డిడి కుష్బూ కొఠారి, అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్లు సుభాషిని, రంగమ్మ, గంగాద్రి, బీసీ హాస్టల్ వార్డెన్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మస్తాన్, జిల్లా అధ్యక్షులు మారుతి ప్రసాద్, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కుల సంఘాల నాయకులు, బీసీ హాస్టల్స్ వార్డెన్లు, జిల్లా కార్యాలయం ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.



భగీరథ వవిగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్, ఎంపి అంబిక లక్ష్మీనారాయణ



## వేసవి సెలవులతో జనసంద్రంగా కాణిపాకం

### సర్వ దర్శనానికి నాలుగైదు గంటలు

**కాణిపాకం, మే 4 ప్రభాతవార్త:** వరుస సెలవుల కారణంగా సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి అలయం భక్తుల రద్దీతో ఆదివారం భక్తజన సంద్రంగా మారింది సాధారణంగా ఆలయంలో వారంతపు రోజులు శని, ఆదివారాలు, సెలవు రోజుల్లో భారీ స్థాయిలో రద్దీ వుంటుంది. ఈమేరకు శని, ఆదివారాలు వారంతపు రోజులు కావడంతో పాటు విద్యాసంస్థలకు వేసవి సెలవులు రావడం, ఆదివారం ప్రభుత్వ సెలవు రోజు రావడంతో కాణిపాకం ఆలయ దర్శనార్థం వివిధ ప్రాంతాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో పాటు తిరుమల వెళ్ళే భక్తులు కూడా కాణిపాకం ఆలయ దర్శనానికి భారీగా తరలి రావడంతో ఉదయం నుండి ఆలయంలోని క్యూలైన్లన్ని భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలోని క్యూలైన్లుతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల బారులు తీరి నిలబడ్డారు. దీనితో కాణిపాకం ఆలయం భక్తజన సంద్రంగా మారింది. రీద్దతో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్ర దర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లులో సుమారు మూడు గంటలకు పైగా వేచి వుండాల్సిన పరిస్థితి

# హైదరాబాద్లో మొదలైన ప్రపంచ సుందరీమణుల సందడి

### మిస్ బ్రెజిల్ జెస్సికా, మిస్ సౌత్ఆఫ్రికా జోయలైజ్ రాక

### మిస్ వరల్డ్ పోటీలకు ముస్తాబవుతున్న హైదరాబాద్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 4:** హైదరాబాద్లో ప్రపంచ సుందరీమణుల సందడి మొదలైంది. ఈ నెల 10న హైదరాబాద్లో మిస్ వరల్డ్ పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో ప్రపంచ అందగత్తెలు ఒక్కొక్కరుగా హైదరాబాద్కు చేరుకుం టున్నారు. మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొననున్న మిస్ బ్రెజిల్ జెస్సికా స్కెన్డియుజ్య్ పెడ్రోసో శంషాబాద్ ఎయిర్ పోర్ట్కు ఆదివారం ఉదయం చేరుకున్నారు. శంషాబాద్కు చేరుకున్న మిస్ బ్రెజిల్ కు తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాల ప్రకారం అధికారులు ఘన స్వాగతం పలికారు. కాగా, మిస్ వరల్డ్ సీఈవో, చైర్ పర్సన్ జూలియా ఈవేలిన్ మోర్లి, మిస్ కెనడా మిస్ ఎమ్మా డయన్నా క్యాథరీన్ మొర్రిసన్ లు ఇప్పటికే చేరుకున్నారు. కాగా, మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు మిస్ సౌత్ ఆఫ్రికా జోయలైజ్ జన్సెన్ వాన్ రెన్స్ బర్గ్ ఆదివారం సాయంత్రం హైదరాబాద్కు చేరుకున్నారు. ఇప్పటివరకు కెనడా, బ్రెజిల్, సౌత్ ఆఫ్రికా కు చెందిన ప్రతినిధులు హైదరాబాద్ వచ్చారు. శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకున్న మిస్ సౌత్ ఆఫ్రికాకు తెలంగాణ ప్రభుత్వ అధికారుల బృందం స్వాగతం పలికింది. ఈ మిస్ వరల్డ్ పోటీల కంటెస్టెర్లు ఈ నెల 6 వ తేదీ నుండి హైదరాబాద్కు మరింత మంది చేరుకుంటారు. మే 10 నుంచి 31 వరకు పోటీలు జరగనున్నాయి. మూడు వారాల పాటు 120 దేశాలకు చెందిన అందగత్తెలు హైదరాబాద్లో సందడి చేయనున్నారు. ఈ పోటీలను ప్రతిష్మాత్మకంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. తొలిసారి హైదరాబాద్లో మిస్ వరల్డ్ పోటీలు జరుగుతున్నాయి. గచ్చిబౌలి స్టేడియంలో మిస్ వరల్డ్ పోటీలు జరగనున్నాయి. మే 31న ఫైనల్స్ ఉంటాయి. ఈ పోటీల్లో పాల్గొనే బ్యూటీలు మే 8లోపు హైదరాబాద్ చేరుకోనున్నారు. ఈ నేపథ్యంలో మహానగరం ప్రపంచ సుందరీమణుల పోటీలకు ముస్తాబవుతోంది. రహదారులు, కూడళ్లు, పర్యాటక కేంద్రాలు, ముఖ్యమైన భవాలను అందంగా తీర్చిదిద్దేందుకు జీహెచ్ఎంసీ నడుం బిగించింది. అందాల భామలు,అతిథులు తిరిగే రహదారులపై గుంతల్లేకుండా చూసుకోవడం, లేన్ మార్కింగ్, కాలిబాటలు, కూడళ్ల సుందరీకరణ, పచ్చదనం ఏర్పాట్లను యుద్ధప్రాతిపదిన పూర్తి చేయాలని కమిషనం ఆర్వి.కర్ణన్ ఆ దిశగా యంత్రాంగానికి ఆదేశాలు సైతం జారీ చేశారు. ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొనేవారు ఇప్పటికే నగరానికి చేరుకోవడం ప్రారంభించారు. పోటీదారులు, అతిథులు శంషాబాద్ విమానాశ్రయం నుంచి నగరంలోకి చేరుకునే అన్ని రోడ్లను బల్దియా చక్కదిద్దుతోంది. అటువైపు వెళ్లే రోడ్లు, చుట్టుపక్కల ప్రాంతాలను ముస్తాబు చేయాలని నిర్ణయం తీసుకుంది. రోజంతా పారిశుధ్య నిర్వహణకు జోనల్, సర్కిళ్ల స్థాయిలో కమిటీలు వేసింది. 151 కి.మీ. రోడ్లను కేంద్ర కార్యాలయం మ్యాపింగ్ చేసి, పర్యవేక్షణకు ఉన్నతాధికారులను బాధ్యులుగా నియమించింది. ప్రపంచ సుందరి పోటీలకు సంబంధించిన ప్రచార కార్యక్రమాలను సైతం జీహెచ్ఎంసీ చేపట్టబోతోంది. నగరంలో ఉన్న 250 బస్టాపులపై ఫ్లెక్సీ బోర్డులు, పలు వారసత్వ కట్టడాలు, రహదారుల్లో రూ.1.8 కోట్లతో ఎల్ఈడీ విద్యుద్దీపాల ఏర్పాటు, సెల్ఫీ పాయింట్లు, ఇతరత్రా ఏర్పాట్లు పురోగతిలో ఉన్నాయి. పోటీదారులు, అతిథులు ఆ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో విహరించే అవకాశం ఉండటంతో రూ.1.89 కోట్లతో వంతెనలపై క్రాష్ బారియర్లు, రోడ్ల డివైడ్లు, కాలిబాటలకు రంగులు సైతం వేస్తున్నారు. యూటర్న్లు, రహదారులకు మరమ్మతులు, లేన్ మార్కింగ్ చేస్తున్నారు. చౌమహల్లా ప్యాలెస్,చార్మినార్, తదితర ప్రాంతాలనూ అతిథులు సందర్శిస్తారని అధికారులు చెబుతున్నారు. అక్కడా మరమ్మతులు చేస్తున్నట్లు జీహెచ్ఎంసీ వెల్లడించింది.




**మిస్ వరల్డ్ బ్యూటీలపై టాలీవుడ్ కన్ను**

ప్రస్తుతం టాలీవుడ్ పాన్ వరల్డ్ సినిమాలు తీసే స్థాయికి ఎదిగింది. ఈ క్రమంలో హైదరాబాద్లో జరగబోయే మిస్ వరల్డ్ పోటీలపై టాలీవుడ్ దర్శక నిర్మాతలు దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఈ పోటీల్లో తమ అందం, అభినయంతో అలరించే అందగత్తెలతో సినిమా ఒప్పందాలు చేసుకోవడానికి వారు ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. టైటిల్ గెలవని అందమైన ముద్దుగుమ్మలను సైతం తమ సినిమాల్లో నటింపజేసేందుకు మేకర్స్ సిద్ధమైనట్లు తెలుస్తోంది.

# బకాయిల చెల్లింపునకు రూ.6వేల కోట్లు విడుదల

### ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు

**శ్రీ సత్యసాయి జిల్లా , మే 4, ప్రభాతవార్త ప్రతినిధి:** విడతలవారీగా ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ లు హామీ ఇచ్చినట్లు ఉత్తరాంధ్ర టీచర్ల ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు పేర్కొన్నారు. ఆదివారం అయన ఎమ్మెల్సీగా మూడోసారి ఎన్నికవడంతో భగవాన్ సత్యసాయి బాబా దర్శనార్థం విచ్చేసి మహాసమాధిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై తాను ఇప్పటికే ముఖ్యమంత్రితో పాటు విద్యా శాఖమంత్రి నారాలోకేష్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. దీనికి వారు సానుకూలంగా స్పందించారని, అందులో భాగంగానే మొదటి విడతలో బకాయిల చెల్లింపులకు రూ.6 వేలకోట్ల నిధులను విడుదలచేసి వారి సమస్యల పరిష్కా రంలో ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. త్వరలో రెండో విడత నిధులను విడుదల చేసి డిఏ బకాయిలతో పాటు ఈ ఎల్ సి తదితర గత ప్రభుత్వ హయాంలో ఉన్నబకాయిలను సైతం విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్న ట్లు ఆయన తెలియజేశారు. ప్రధానంగా ప్రభుత్వ ఉద్యోగస్తులు కోరుకుంటున్నట్లుగా ఐఆర్ తో పాటు పిఆర్సి కమిటీవేసి ఉత్తమమైన రీతిలో పిఆర్సి అందివ్వాలన్నారు. ప్రస్తుత వేసవికాలంలో 10వతరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు రెమిడియల్ క్లాసులు ఉదయం నుండి సాయంత్రం వరకు నిర్వహిస్తున్నారని, ఇదిసరైనది కాదని వేసవిని దృష్టిలో ఉంచుకొని రోజుకు 6 గంటల సమయం క్లాసులు బోధిస్తే చాలన్నారు. గత ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన 117 జీవోను రద్దుచేసి తరగతిగదిలో 40 మందిమాత్రమే ఉండేలా చూడాలని అప్పర్ ప్రైమరీ పాఠశాలలో అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులను కేటాయించాలన్నారు. వేసవికాలంలో క్లాసులు బోధించిన ఉపాధ్యాయులకు పనిచేసిన కాలానికి ఈయల్స్ మంజూరు చేయాలని, డీఎస్సీ రిక్రూట్మెంట్ నందు పరీక్షపేపరు జిల్లాల వారిగా కాకుండా రాష్ట్రమంతటా ఒకటే పరీక్ష పేపర్ ఉండేలా చూడాలన్నారు. విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ ఆధ్వర్యంలో విద్యావ్యవస్థ కొత్తపుంతలు తొక్కుతోందని, మెరుగైన విద్యా విధానాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం వివిధ రకాల ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలియజేశారు. వీటిలో కూడ కొన్ని ఇబ్బందికర అంశాలు ఉన్నాయని వాటినిసరిచేసి మంచివిద్యను అందిస్తే ఉత్తమమైన ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. చాలాకాలం తర్వాత డీఎస్సీ నిర్వహిస్తున్నారని నిరుద్యోగులకు టెట్ లో ఉత్తీర్ణులు కావడానికి మరో అవకాశం ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. డీఎస్సీ దరఖాస్తులలో పర్సెంటేజీ విధానాన్ని రద్దుచేయాలని, ప్రస్తుతం బీఈడీ, డీఎడ్ పరీక్షలు రాస్తున్న అభ్యర్థులకు కూడా ప్రస్తుత డీఎస్సీలో అవకాశం కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ప్రైమరీ మోడల్ పాఠశాలను నిర్వహించాలన్నారు. పదోన్నతులకు సంబంధించి ఉన్నత పాఠశాలలో గ్రేడ్ వన్ హెచ్ఎంలు నియమించాలని, స్కూల్ అసిస్టెంట్లకు జేఎల్స్ గా పదోన్నతులు కల్పించాలని, సర్వీస్ రూల్స్ పై ప్రత్యేక దృష్టి పెట్టి అన్ని కేటగిరీల ఉపాధ్యాయులకు పదవి విరమణ వయసు 62 కు పెంచాలన్నారు. ఈహెచ్ఎస్ ద్వారా దేశంలో ఎక్కడికెళ్ళిన వైద్యం సేవలు పొందేటట్లు ఇన్సూరెన్స్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు శక్తివంచనలేకుండాకృషి చేస్తానన్నారు.

ఈ కార్యక్రమంలో వైయస్ఆర్టీఏ జిల్లా అధ్యక్షులు పివి .రమణారెడ్డి , అపుష్ జిల్లా అధ్యక్షులు సురేష్ బాబు, పిఆర్టియు నాయకులు రామకృష్ణారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లాగౌరవాధ్యక్షులు రజనీకాంత్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, దామోదర్ రెడ్డి, రామాంజనేయులు, రామకృష్ణారెడ్డి, నారాయణస్వామి, సౌధామణి, చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# గొర్రెల పంపిణీ స్కాంపై యేడాదిన్నరగా సాగుతున్న ఎసిబి విచారణ

### ఇంకా పట్టుబడని ఇద్దరు అసలు నిందితులు

### రూ.2.10 కోట్లతో మొదలై రూ.700 కోట్లకు చేరిన కుంభకోణం

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త:** గత బిఆర్ఎస్ సర్కారు ఏలుబడిలో వెలుగు చూసిన గొర్రెల పంపిణీ స్కాంపై ఎసిబి విచారణ ఏడాదిన్నరగా సాగుతున్నా పెద్దగా పురోగతి లేదనే విమర్శలు వున్నాయి. ఈ గోల్మాల్లో అసలు నిందితులు కాంట్రాక్టర్ మొయినుద్దీన్ అలియాస్ మొయిద్ అతని కుమారుడు ఇక్రముద్దీన్ ఇప్పటి వరకు పట్టుబడలేదు. రూ.2.10 కోట్ల రూపాయల స్కాంగా మొదలైన ఈ కుంభకోణం 700 కోట్ల రూపాయలకు చేరడం ఎసిబి అధికారులనే ఆశ్చర్యప రిచింది. ఈ కేసులో 15 మంది నిందితులు అరెస్టయినా అసలైన వారు ఇద్దరు ఇంకా దొరక్క పోవడంతో విచారణ ముందుకు సాగడం లేదని ఎసిబి అధికారులు చెబుతున్నారు. ఈ కేసులో పెద్ద తలకాయలు వుండడం వల్లే విచారణ ముందుకు సాగడం లేదనే విమర్శ బలంగా వుంది.

పెద్దపెద్ద కుంభకోణాలు కూడా చిన్నస్థాయిలో జరిగే పొరపాట్ల వల్లే వెలుగు చూస్తాయనడానికి గొర్రెల పంపిణీ స్కాం ఒక ఉదాహరణగా చెప్పాలి. రాష్ట్రంలో 2023 నవంబర్లో వెలుగు చూసిన గొర్రెల నిధుల గోల్మాల్ కేసులో కేవలం రెండు కోట్ల పది లక్షల రూపాయల చెల్లింపుల వద్ద జరిగిన పేచీ మొత్తం గోల్ మాల్ను రట్టు చేసింది. ఎపిలోని కొందరు రైతుల వద్ద గొర్రెలు ఖరీదు చేసి వారికి రెండు కోట్ల పది లక్షల రూపాయలను ఎగ్గొట్టినందుకు నమోదైన చీటింగ్ కేసు ఆ తరువాత భారీ స్కాంగా మారి గచ్చిబౌలి పోలీసు స్టేషన్ నుంచి ఎసిబికి బదిలీ అయ్యింది. అప్పటి సర్కారు ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ పథకం వాస్తవంలో గొర్రెలు, మేకల పెంపకం దారులకు ఎంతగానో ప్రయోజనకరంగా వుందని రైతుల నుంచి ప్రశంసలు వచ్చాయి. రాష్ట్రంలో మాంసం వినియోగం పె రగడంతో దానికి తగినట్లుగా గొర్రెలు, మేకల ఉత్పత్తి పెరగాలని భావించి అప్పటి సర్కారు ఈ పథకాన్ని ప్రవేశపెట్టినా అధికారులు, కొందరు నాయకుల చేతివాటం వల్ల ఏకంగా 700 వందల కోట్ల రూపాయల స్కాంగా మారింది. 2024 జనవరిలో రట్టయిన గొర్రెల పంపిణీ నిధుల స్వాహా కేసు అంతకు ముందే గచ్చిబౌలి, నాంపల్లి పోలీసు స్టేషన్లలో వేరు వేరుగా నమోదయ్యాయి. తెలంగాణలో మంచి బ్రీడ్ గొర్రెలను రైతులకు అందించేందుకు ఈ పథకం ప్రవేశపెట్టగా ఇందులో భాగంగా దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాలకు పశు సంవర్ధక శాఖ అధికారులు వెళ్లి మేలు రకమైన గొర్రెలను కొని ఇక్కడి రైతులకు సబ్సిడీగా అందించాల్సి వుంది. ఈ క్రమంలో పశు సంవర్ధక శాఖ అధికారులు ఎపి సహా పలు రాష్ట్రాలకు వెళ్లి మేలు రకమైన గొర్రెలను కొనుగోలు చేసి వాటిని వాహనాలలో తెలంగాణ కు తరలించి ఇక్కడి రైతులకు సబ్సిడీ రూపంలో అందించామని అప్పట్లో అధికారులు ప్రచారం చేసుకున్నారు. అయితే ఇక్కడే స్కాంకు తెరలేచిందని ఎసిబి అధి కారులు గుర్తించారు. గొర్రెల కొనుగోలు సమయంలో ఆయా రాష్ట్రాలకు చెందిన అధికారులతో ఇక్కడి పశు సంవర్ధక శాఖ అధికారులు మాట్లాడకుండా మధ్యవర్తు లు, దళారులతో మాట్లాడి వారిని గొర్రెల రిసైక్లింగ్కు ముందుగానే ఒప్పించి కొంత కమీషన్ ఇచ్చి, వారి ద్వారా తమకు నచ్చిన జీవాలను కొన్నారు. ఇందులో మేలు రకం జీవాలు ఎన్నీ, సాధారణ రకం ఎన్నీ అనేదానిపై లెక్కలు లేవని ఎసిబి అధికారుల విచారణలో తేలింది. దీని తరువాత వీటిని తెలంగాణలో తాము ఎంపిక చేసిన లబ్దిదారులకు ఇచ్చి ఫోటోలు దిగిన తరువాత వాటిని మరో బృందం లబ్దిదారులకు, ఆ తరువాత ఇంకో బృందం లబ్దిదారులకు ఇలా పది అంత కు ఎక్కువ సంఖ్యలో లబ్దిదారులకు ఇవ్వడం ద్వారా పశు సంవర్ధక శాఖ అధికారులు స్కాంకు పాల్పడినట్లు ఎసిబి అధికారులు తేల్చారు. ఈ క్రమంలో లబ్దిదా రులకు కొంతమేర నగదు ఇచ్చి వారు ఎవరికీ చెప్పకుండా చూసినట్లు తేలింది. గొర్రెల కోసం గట్టిగా కోరిన కొందరు లబ్దిదారులకు మాత్రమే గొర్రెలు, మేకలు ఇచ్చారని, నగదుకు సరే అన్నవారికి కొంత మేర డబ్బులు ఇచ్చేసి ఎవరు మాట్లాడకుండా చేయగలిగారని, ఈ క్రమంలోనే దళారులు, మధ్యవర్తులతో పశు సంవర్ధ క శాఖ అధికారులు కుమ్మక్కయ్యారని ఎసిబి గుర్తించింది. ఇందుకోసం సర్కారుకు ఇచ్చిన బిల్లులన్నీ నకిలీవని, వాహనాల నంబర్లు కూడా నకిలీవని ఎసిబి విచా రణలో తేలింది. ఈ పథకం కోసం సర్కారు అప్పట్లో నాలుగు వేల కోట్ల రూపాయలకు పైగా వెచ్చించగా ఇందులో 700 కోట్ల రూపాయలు దారి మళ్లినట్లు ఎ సిబి తేల్చింది. కొన్నిచోట్ల ముసలి జీవాలు, అనారోగ్యంతో వున్న జీవాలను లబ్దిదారులకు అంటగట్టారని ఎసిబి గుర్తించింది. ఈ వ్యవహారమంతా అప్పట్లో గొర్రె లు, మేకల కొనుగోలుకు సంబంధించి సర్కారు ఏర్పాటు చేసిన కార్పొరేషన్కు ఛైర్మన్గా వున్న పశు సంవర్ధక శాఖ సిఈఓ సభావత్ రాంచందర్ నాయక్తో పాటు ఆ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ ఓఎస్డీ కల్యాణ్ కుమార్లకు తెలిసే జరిగిందని ఎసిబి అధికారులు తేల్చారు. రైతులకు గొర్రెలు, మేకలు అందించకు ండానే సరఫరా చేసినట్లు, సర్కారుకు తప్పుడు లెక్కలు ఇచ్చి 700 కోట్ల రూపాయల సర్కారు నిధులకు దళారులు, మధ్యవర్తులు, దళారులు, కొందరు పశు స ంవర్ధక శాఖ అధికారులతో కలిసి ఈ స్కాంలో నిధులను వీరిద్దరితో పాటు కాంట్రాక్టర్ మొయినుద్దీన్, అతని కుమారుడు ఇక్రముద్దీన్లు కాజేశారని ఎసిబి అధి కారులు భావిస్తున్నారు. ఈ కేసులో నిందితులుగా వున్న కల్యాణ్, రాంచందర్ సహా అప్పటి పశుసంవర్ధక శాఖ అధికారులు, దళారులు మొత్తం 15 మందిని ఎ సిబి అరెస్టు చేసింది. ఈ కేసులో పలువురు నాయకులను ఎసిబి అరెస్టు చేయనుందని వార్తలు వచ్చాయి. వారిని విచారించనున్నారని ప్రచారం జరిగినా అలా జరగలేదు. ఎసిబి విచారణలో ఇప్పటి వరకు ఎలాంటి ఆస్తులను జప్తు చేయలేదు, నిందితుల బ్యాంకు ఖాతాలను కొన్నింటిని జప్తు చేసినా వాటిలో పెద్దగా నగ దు లేదని సమాచారం. ఈ కేసులో అసలు నిందితులుగా చెబుతున్న మొయినుద్దీన్, ఇక్రముద్దీన్లు అరెస్టయితే కానీ విచారణ ముందుకు సాగేలా లేదు. మరో వై పు ఇదే కేసులో మనీలాండరింగ్ కోణంలో ఈడీ కూడా విచారణ చేబట్టి పలువురిని విచారించి వాంగ్మూలం తీసుకుంది. మొత్తం మీద గొర్రెల పంపిణీ స్కాంపై ఏడాదిన్నరగా సాగుతున్న విచారణలో పెద్దగా పురోగతి లేదనే విమర్శలు వున్నాయి. ఈ కేసులో పెద్ద తలకాయలు వుండడం వల్లే విచారణ సవ్యంగా సాగడం లేదని ఆరోపణలు వస్తున్నాయి.

## క్షణికావేశంలో ప్రేమజంట ఆత్మహత్య

**రాజాపూర్, మే 4, ప్రభాతవార్త :** క్షణికావేశంలో ఓ ప్రేమ జంట ఆత్మహత్య చేసుకున్న సంఘటన మహబూబ్ నగర్ జిల్లా రాజాపూర్ మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్నరేపల్లి గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం జరిగింది. ఎస్సై శివానంద్ వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఎట్టి జంగయ్యకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. కుమారుడు ఎట్టి శివప్రసాద్ (17) గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమించాడు. వీరిద్దరికీ వయస్సు లేకపోవడంతో తల్లిదండ్రులు నచ్చజెప్పి, వచ్చే సంవత్సరం పెళ్లి చేస్తామని బుజ్జగించారు. ఆదివారం మధ్యాహ్నం ఏమైందో తెలియదు కానీ యువతీ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయం తెలుసుకున్న ఎట్టి శివప్ర సాద్ ఓ వ్యవసాయ పొలం పశువుల కొట్టంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

## విరిగిపడిన టోల్గేట్.. నిలిచిపోయిన వాహనాలు

**కొండపాక, మే 4, ప్రభాతవార్త:** రాజీవ్ రహదారిపై దుద్దెడ శివారులోని టోల్గేట్ గాలివానకు విరిగిపోయి ట్రాఫిక్కు అంతరయం కలిగిన సంఘటన అదివారం చోటు చేసుకుంది. సిద్దిపేట జిల్లా కొండపాక మండల పరిధిలోని రాజీవ్ రహదారిపై ఉన్న టోల్గేట్ రాత్రి బలంగా వీచిన గాలివానకు టోల్ గేట్కు ఇరువైపు ఏర్పాటు చేసిన క్యాష్ కౌంటర్లపై వేసిన రేకులు, సిగ్నల్ బోర్డులు, ఈ ట్యాగ్ పరికరాలు విరిగి పడిపోయాయి. దాంతో వాహనాలు భారీగా నిలిచిపోయి ట్రాఫిక్కు కొంత సేపు అంతరాయం ఏర్పడింది.



5-5P□g7exHMNWJQE.qxd:5-5P□g7exHMNWJQE.qxd 05/05/25 1:09 AM Page 1



# పర్యాటక ప్రదేశాల షోకేస్‌కు ప్రభుత్వ ప్రత్యేక కార్యాచరణ

## రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాలను సందర్శించనున్న మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌లు

## ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ పర్యాటక ప్రదేశాలకు దక్కనున్న విశేష ప్రచారం

## దేశీయ పర్యాటకులతోపాటు విదేశీ టూరిస్టులను పెద్దఎత్తున ఆకర్షించనున్న రాష్ట్రం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 4:** అద్భుత చారిత్రక, సాంస్కృతిక నేపథ్యం కలిగిన తెలంగాణను దేశంలో ప్రధాన పర్యాటక గమ్యస్థానంగా రూపదిద్దడం, పర్యాటక రంగంలో రూ.15వేల కోట్ల పెట్టుబడుల్ని ఆకర్షించడం లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే తెలంగాణ తొలి టూరిజం పాలసీని రూపొందించింది. ఇందుకోసం మిస్ వరల్డ్ పోటీలను సరైన వేదికగా వినియోగించు కునేందుకు కార్యాచరణ రూపొందించింది. 120 దేశాల ప్రతినిధులు హాజరయ్యే 150కి పైగా దేశాల్లో ప్రత్యక్ష ప్రసారం అయ్యే మిస్ వరల్డ్ ఈవెంట్‌లో తెలంగాణకు ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం కల్పించి తెలంగాణ పర్యాటకంను ప్రముఖంగా ప్రమోట్ చేసేందుకు తద్వారా ప్రపంచ పర్యాటకంలో తెలంగాణను ప్రముఖంగా నిలిపేందుకు, పెద్ద ఎత్తున విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తోంది. 2024 సంవత్సరంలో తెలంగాణను 1,55,113 మంది విదేశీ పర్యాటకులు సందర్శించారు. వీరి సంఖ్య గణనీయంగా పెరిగేందుకు ఈ మిస్ వరల్డ్ ఈవెంట్‌ను ఉపయోగించుకుంటోంది. మిస్ వరల్డ్ పోటీలలో భాగంగా హైదరాబాద్, వరంగల్ వెయ్యి స్తంభాల గుడి, ఖిలా వరంగల్, భద్రకాళి, రామప్ప, నాగార్జున సాగర్, పోచంపల్లి, పిల్లలమర్రి వృక్షం ప్రముఖ పర్యాటక ప్రదేశాలను మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌లు సందర్శించనున్నారు.

ఈ నెల 12న హైదరాబాద్ సాంస్కృతిక వారసత్వం గొప్పదనం ప్రపంచానికి తెలియజేసేలా చార్మినార్, లాడ్ బజార్‌లలో మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌లు 'హెరిటేజ్ వాక్' నిర్వహిస్తారు. 13న హైదరాబాద్‌కే తలమానికంగా నిలుస్తున్న చౌమల్ల ప్యాలెస్‌ను సందర్శించి ఓల్డ్ సిటీ ఘనమైన వారసత్వాన్ని ప్రపంచానికి తెలియ చేస్తారు. 14న చారిత్రక, ఆధ్యాత్మిక నగరం వరంగల్ లోని వెయ్యి స్థంభాల గుడి, వరంగల్ పోర్ట్ ను సందర్శిస్తారు. ఇదే రోజు యునెస్కో వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప ఆలయంను సందర్శిస్తారు. కాకతీయులు యుద్ధ రంగానికి వెళ్లే ముందు ప్రదర్శించే పేరిణి నృత్యంను రామప్పలో తిలకిస్తారు. 15న మిస్ వరల్డ్ కాంటెస్టెంట్‌లు ఆధ్యాత్మిక టూరిజంలో భాగంగా యాదగిరిగుట్ట ఆలయాన్ని సందర్శిస్తారు. హ్యాండ్లూమ్ ఎక్స్పీరియన్సల్ టూర్ లో భాగంగా పోచంపల్లిలో చేనేత వస్త్రాల తయారీని, ప్రదర్శనను ప్రత్యక్షంగా తిలకిస్తారు. ఈ నెల 16న మెడికల్ టూరిజం పరిచయ కార్యక్రమంలో భాగంగా మెడికల్ టూరిజంను చేపడతారు.

మహబూబ్‌నగర్ లోని పిల్లలమర్రి వృక్షాన్ని, హైదరాబాదు నగరానికే ప్రత్యేక ఆకర్షణగా ఉన్న ఎక్స్పీరియం పార్కును సందర్శిస్తారు. ఈ నెల 17న ప్రపంచంలోనే పెద్ద ఫిలిం సిటీలలో ఒకటిగా గుర్తింపు పొందిన ప్రఖ్యాత రామోజీ ఫిలిం సిటీని మిస్ వరల్డ్ కాంటెస్టెంట్ లు సందర్శిస్తారు. 18న మిస్ వరల్డ్ కాంటెస్టెంట్ లు తెలంగాణ పోలీస్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ను సందర్శించి తెలంగాణ ప్రభుత్వం పౌరుల భద్రతకు తీసుకుంటున్న చర్యలను, ప్రభుత్వం సేఫ్టీ టూరిజం ఇనిషియేటివ్స్ ను పరిశీలిస్తారు.

ఇదే రోజు సాయంత్రం మిస్ వరల్డ్ కాంటెస్టెంట్‌లకు అధికారులు తెలంగాణ రాష్ట్ర గ్రోత్ స్టోరీ, చరిత్రను తెలియజేస్తారు. ట్యాంక్ బండ్ పైన ప్రతి ఆదివారం ఏర్పాటు చేసే సండే ఫండే కార్నివాల్ ను సందర్శిస్తారు. ఈ నెల 20 లేదా 21న ఉప్పల్ లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరగనున్న ఐపీఎల్ మ్యాచ్‌కు కంటెస్టెంట్లు హాజర వుతారు. 21న శిల్పారామం లో తెలంగాణ కళాకారులచే నిర్వహించే ఆర్ట్స్, క్రాఫ్ట్స్ వర్క్ షాప్ హాజరవుతారు.

స్వయంగా వాటి తయారీలో భాగమై ప్రత్యక్షంగా తయారీ గురించి తెలుసుకుంటారు. మిస్ వరల్డ్ పోటీల నిర్వహణతో ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణ పర్యాటక ప్రదేశాలకు విశేష ప్రచారం దక్కనుంది. తెలంగాణ సాంస్కృతిక వైభవం, చారిత్రక గాథలు, ఆధునిక అభివృద్ధి, పర్యాటక ప్రాముఖ్యత ను ప్రపంచానికి తెలుపడంతో పాటు రాష్ట్రాన్ని ప్రపంచ పటంలో ఒక "మల్టీడైమెన్షనల్ టూరిజం హబ్"గా నిలిపే అవకాశం లభిస్తుందని అధికారులు పేర్కొన్నారు.

# మెరుగైన కనెక్టివిటీ కోసం రూ.5,413 కోట్ల ప్రాజెక్టులు

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రహదారి మౌలిక సదుపాయాల కల్పనకు అతిపెద్ద ముందడుగు పడిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఎక్స్ వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఈ నెల 5 వ తేదీన రూ. 5,413 కోట్ల విలువైన వివిధ రహదారి ప్రాజెక్టులను ప్రారంభించనున్నారని, భూమిపూజ చేయనున్నారని తెలిపారు. ఈ రహదారి ప్రాజెక్టులు తెలంగాణ రాష్ట్రంలో కనెక్టివిటీని మెరుగుపరుస్తాయని, ఆర్థిక వృద్ధిని పెంపొందిస్తాయని, ఉపాధి అవకాశాలను కల్పిస్తాయని వివరించారు. దృఢమైన, భవిష్యత్ అవసరాలను తీర్చగలిగే మౌలిక సదుపాయాల కల్పన ద్వారా నరేంద్ర మోడీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి నిరంతర సహకారాన్ని అందిస్తూనే ఉంటుందని వివరించారు. సిర్పూర్‌కాగజ్‌నగర్ ప్రాజెక్టు విలువ రూ.3,862 కోట్లు ఉంటుందని తెలిపారు. రూ.3694 కోట్ల వ్యయంతో 123 కిలోమీటర్ల పొడవున నిర్మించిన రహదారుల ప్రారంభోత్సవం, రూ.168.47 కోట్ల వ్యయంతో 8.1 కిలోమీటర్ల పొడవున నిర్మించనున్న రహదారికి భూమిపూజ నిర్వహించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ ప్రాజెక్టు విలువ రూ. 1,552.91 కోట్లు అని తెలిపారు. రూ.895.64 కోట్ల వ్యయంతో 22.57 కిలోమీటర్ల పొడవున నిర్మించిన రహదారుల ప్రారంభోత్సవం, రూ.657.27 కోట్ల వ్యయంతో 20.87 కిలోమీటర్ల పొడవున నిర్మించనున్న రహదారికి భూమి పూజ చేయనున్నట్లు పేర్కొన్నారు.



తల్లికి అంత్యక్రియలు నిర్వహించడానికి శ్మశానానికి వెళుతున్న కూతురు

# తల్లికి తలకొరివి పెట్టిన కూతురు

**చిన్నశంకరంపేట, మే 4, ప్రభాతవార్త:** ఓ కుమార్తె తన తల్లికి తలకొరివి పెట్టి రుణం తీర్చుకుంది. చిన్నశంకరంపేట మండలం జంగరాయి గ్రామానికి చెందిన బాలమణి, నాగయ్య దంపతులు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కూతురు ఒక కూతురు. కాగా బాలమణి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నది. ఈ క్రమంలో గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. బాలమణి, నాగయ్య దంపతులకు కుమారులు లేకపోవడంతో కూతురు సుజాత తలకొరివి పెట్టి అంతిమ సంస్కారాలు పూర్తి చేసింది. కాగా నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

# మురునీటి వ్యవస్థ మరింత బలోపేతానికి చర్యలు

## అధునాతన ఎస్‌టిపిల నిర్మాణాలు

## ప్రతిరోజు 1,650 మిలియల్ గ్యాలన్ల మురుగునీరు

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త:** హైదరాబాద్ మహానగరంలో మురుగు నీటి వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. హైదరాబాద్ అర్బన్ ఆగ్లోమెరేషన్ పరిధిలో ప్రస్తుతం రోజూ 1950 మిలియన్ గ్యాలన్ల మురుగు నీరు వస్తుంది. ఇందులో జిహెచ్‌ఎంసి ప్రాంతంలో 1650 మిలియన్ గ్యాలన్లు వస్తుంది. ఇప్పటికే 25 ఎస్‌టిపిల ద్వారా 772 మిలియన్ గ్యాలన్ల మురుగు నీటిని శుద్ధి చేస్తున్నారు. ఇక మిగిలిన 878 మిలియన్ గ్యాలన్ల మురుగు నీటిని శుభ్రం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 31 నూతన మురుగు నీటి శుద్ధి కేంద్రాల నిర్మాణాలు చేపట్టింది. వీటిని నిర్మించే బాధ్యతను జలమండలిపై పెట్టింది. రూ.3,866.21 కోట్ల వ్యయంతో 3 ప్యాకేజీల్లో 5 సర్కిళ్లలో నిర్మిస్తున్నారు. వీటి నిర్మాణం ద్వారా 100 శాతం మురుగును శుద్ధి చేయడమే కాకుండా పరివాహక ప్రాంతాల్లో మురుగు ప్రవాహాన్ని నిరోధించడం, శుద్ధి చేసిన నీటిని మానవేతర అవసరాలకు వినియోగించవచ్చు. అంతేకాకుండా భూగర్భ జలాలు కలుషితం కాకుండా.. పర్యావరణం, ప్రజారోగ్యం పై ఎలాంటి దుష్ఫలితాలు ఉండవు. ఇవి పూర్తయి అందుబాటులోకి వస్తే రోజూ ఉత్పత్తయ్యే మురుగును 100 శాతం శుద్ధి చేసే తొలి నగరంగా దక్షిణాసియాలోనే హైదరాబాద్ ఖ్యాతికెక్కుతుంది. ఈ 31 ఎస్‌టిపిలు అందుబాటులోకి వస్తే నగరంలో మురుగు సమస్యకు పరిష్కారం లభిస్తుంది. వీటి ద్వారా రోజూ 1259.50 మిలియన్ లీటర్ల మురుగు నీటిని శుద్ధి చేయవచ్చు. అధునాతన సీక్వెన్సింగ్ బ్యాచ్ రియాక్టర్ టెక్నాలజీతో కొత్త ఎస్‌టిపిల నిర్మాణం జరుగుతుంది. జలమండలి ఎస్‌టిపి ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న వాటిల్లో ఇప్పటికే 11 ఎస్‌టిపిలు(దుర్గం చెరువు 7 ఎంఎల్‌డి, కోకాపేట15 ఎంఎల్‌డి, మిరాలం 141.5 ఎంఎల్‌డి, పెద్ద చెరువు 17.5 ఎంఎల్‌డి, నల్లచెరువు 86.5 ఎంఎల్‌డి, నాగోల్ 320ఎంఎల్‌డి, మియాపూర్ పటేల్ చెరువు7ఎంఎల్‌డి, సఫిల్‌గూడ 5.5 ఎంఎల్‌డి, ఖాజాకుంట 20ఎంఎల్‌డి, ఫతేనగర్ 133ఎంఎల్‌డి, వెన్నెలగడ్డ 10ఎంఎల్‌డి,) ప్రారంభమయ్యాయి. మరో 6 ఎస్‌టిపిలు నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. వీటిలో శివాలయనగర్14 ఎంఎల్‌డి, నల్లగండ్ల 7ఎంఎల్‌డి, ముల్లకతువ చెరువు 25ఎంఎల్‌డి, అత్తాపూర్ 164ఎంఎల్‌డి, అంబర్‌పేట్212.50 ఎంఎల్‌డి, పాలపిట్ట పార్క్ 7ఎంఎల్‌డి, ఎస్‌టిపిలున్నాయి. మిగిలిన 3 ఎస్‌టిపిలను రైన్బో విస్టా 43.5 ఎంఎల్‌డి, రామచెరువు 30 ఎంఎల్‌డి, అత్తాపూర్వార్ 240ఎంఎల్‌డి, ఎస్‌టిపిలను జూన్ 2025 నాటికి నిర్మాణం పూర్తి చేస్తారు. సీక్వెన్సింగ్ బ్యాచ్ రియాక్టర్ టెక్నాలజీ : అధునాతన సీక్వెన్సింగ్ బ్యాచ్ రియాక్టర్ టెక్నాలజీతో కొత్త ఎస్‌టిపిల నిర్మాణం జరుగుతోంది. మెట్రో నగరాల్లో స్థలాభావం ఉంటుంది కాబట్టి ఎస్బీఆర్ టెక్నాలజీతో నిర్మాణం అనువుగా ఉంటుంది. వీటి వల్ల ఒకే ఛాంబర్లో ఐదు స్టేజీల మురుగునీటి శుద్ధి ప్రక్రియ జరిగి తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ నీటిని శుద్ధి చేయవచ్చు.

# అనుమానస్పదంగా నవవధువు ఆత్మహత్య

## పోలీసులు, పాత్రికేయులపై దాడి..

## గ్రామంలో తీవ్రఉద్రిక్త పరిస్థితులు

**చిన్నశంకరంపేట, మే 4,ప్రభాతవార్త:** పెళ్లయిన మూడు నెలలకే నవ వధువు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం అగ్రహారం గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. వెల్దుర్తి మండలం శేరిలా గ్రామానికి చెందిన సాయిలు, మంజుల కూతురు పూజ(24)తో చిన్న శంకరంపేట మండలం అగ్రహారం గ్రామానికి చెందిన వట్టెం రాజయ్య కుమారుడు మహేశ్‌తో ఫిబ్రవరి 2న వివా హం జరిగింది. పెళ్లయిన మూడు నెలలకే నవవధువు పూజ శనివారం అత్తింట్లో అనుమానస్పదంగా ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయాన్ని మృతురాలి కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో పూజ తల్లిండ్రులు, గ్రామస్తులు భర్త ఇంటిపై దాడికి పాల్పడి ఇంటిని ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న చిన్నశంకరంపేట ఎస్ఐ నారాయణగౌడ్ సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకొని కుటుంబసభ్యులకు నచ్చచెప్పడానికి ప్రయత్నించినప్పటికీ వినకుండా పోలీసులను, వార్త సేకరణకు వచ్చిన పాత్రి కేయులపై దాడి చేయగా ఒక పాత్రికేయునికి తీవ్రగాయాలయ్యాయి. తమ కూతురిని హత్యచేసి, ఆత్మహత్యగా చిత్రికరిస్తున్నారని మృతురాలి తల్లి దండ్రులు ఆరోపించారు. దీంతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్తపరిస్థితులు నెల కొనడంతో రామాయంపేట సిఐ వెంకటరాజాగౌడ్ సంఘటన స్థలానికి చేరు కొని బంధువులకు నచ్చచెప్పారు. మెదక్ నుండి వచ్చిన క్లూస్‌టీం సభ్యులు వివరాలను సేకరించారు. కుటుంబసభ్యులకు నచ్చచెప్పి తహశీల్దార్ మన్నన్ ఆధ్వర్యంలో శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసుల బందోబస్తు మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. సంఘటన స్థలాన్ని తూప్రాన్ డిఎస్పీ వెం కటరెడ్డి పరిశీలించి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు చిన్నశంకరంపేట ఎస్ఐ నారాయణగౌడ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



పూజ (ఫైల్)

# పంట రుణాల్లో కోత.. రైతులకు గుండెకోత

## యేటా మారని బ్యాంకుల తీరు

## ఖరీఫ్, రబీలో రూ.90,715 కోట్ల లక్ష్యం..

## ఇచ్చింది రూ.67,183 కోట్లు

## పెట్టుబడి కోసం అన్నదాతల అవస్థలు

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త :** వ్యవసాయంలో అత్యంత కీలకమైన వానాకాలం, యాసంగి సీజనుకు సంబంధించి రుణాల విషయంలో తెలంగాణ రైతుల పట్ల బ్యాంకులు ఉదాసీన వైఖరి అవలం బిస్తున్నాయి. రిజర్వ్ బ్యాంకు మార్గదర్శకాల మేరకు ప్రధానంగా సన్న, చిన్నకారు రైతులకు రుణాలు అందించడంలో బ్యాంకులు ఘోరంగా విఫలమవుతున్నాయి. వార్షిక లక్ష్యాలను గొప్పగా ప్రకటిస్తున్నా వాటిని పూర్తి స్థాయిలో చేరుకోవడం లేదు. ఈ నేపథ్యంలో బ్యాంకుల నుండి అన్నదాతలకు సహకారం నామమాత్రంగానే ఉంటోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుత యాసంగితో పాటు, వానాకాలం సీజనులో రైతులకు పంట రుణాలు ఇవ్వడంలో బ్యాంకులు మొండి చెయ్యి చూపించాయి. లక్ష్యాలు ఘనంగా ఉన్నా, వాటి ఆచరణలో మాత్రం వెనుకబడిపోతున్నాయి. ఈ సీజన్లలో కలిపి ఎస్‌ఎల్ బీసీ (స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ) రూ.90,795.19 కోట్ల పంట రుణాలు ఇవ్వాలని లక్ష్యాలను నిర్ధారించింది. ఇందులో వానాకాలంలో 60 శాతం, యాసంగిలో 40 శాతం చొప్పున రైతులకు పంట పంపిణీ చేయాలని బ్యాంకర్లకు నిర్దేశించింది. అయితే గడచిన వానాకాలంలో రూ.54,480 కోట్ల లక్ష్యం పెట్టుకోగా, బ్యాంకులు 24 లక్షల 5 వేల 419 మంది రైతులకు రూ.44,438 కోట్ల రుణాలు మాత్రమే అందించాయి. దీంతో ఆ సీజన్లో లక్ష్యాల కంటే రూ.10 వేల కోట్లను కోత పెట్టింది. ఇక ప్రస్తుత యాసంగి సీజనులో రూ.36,315.19 కోట్ల లక్ష్యం పెట్టుకోగా, ఇప్పటి వరకూ 15 లక్షల 84 వేల 772 మంది రైతులకు రూ.22,744.92 కోట్ల రుణాలు మాత్రమే ఇచ్చాయి. ఇలా 2 సీజన్లలో 39 లక్షల 90 వేల191 మంది రైతులకు రూ.67,182.92 కోట్ల రుణాలు(74 శాతం) అందించాయి. అయితే ఈ మేరకు రుణాలు ఇచ్చినట్లు బ్యాంకులు చెబుతున్నా, వ్యవసాయ పెట్టుబడికి కొత్తగా రుణాలు ఇవ్వక, వడ్డీలు కట్టించుకుని ఎక్కువగా బుక్ అడ్జిష్‌మెంట్లు చేయడం విశేషం.

ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పట్టాదారుల సంఖ్య సుమారు 65 లక్షలు ఉండగా, బ్యాంకులు మాత్రం 33.85 లక్షల మంది రైతులకు మాత్రమే పంట రుణాలు అందచేస్తున్నాయి. ఇంకా 31 లక్షల మంది రైతుల పంట రుణాలు దూరంగా ఉంటున్నారు. ఇక జనవరి చివరి నాటికే జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు) కొత్త ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రుణ ప్రణాళికను విడుదల చేస్తోంది. అయితే బ్యాంకర్ల కమిటీ రుణ ప్రణాళికలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

అలాగే రాష్ట్ర బ్యాంకర్ల కమిటీ రాష్ట్ర రుణ ప్రణాళికను ఆలస్యంగా విడుదల చేస్తున్నా, జిల్లాల్లో లీడ్ బ్యాంకుల ఆధ్వర్యంలో జిల్లా రుణ ప్రణాళికలు నఆమోదించడంలో మరింత తీవ్ర జాప్యమవుతోంది. దీంతో పంట రుణాలు ఇవ్వడం ఆలస్యంగా ప్రారంభమవడమే కాకుండా నిర్దేశించిన లక్ష్యాలను చేరక వెనుకబడి పోతున్నాయి. ఈ పరిస్థితుల్లో రైతులకు సాగు పెట్టుబడి ఖర్చుల కోసం అధిక వడ్డీలకు ప్రైవేటు అప్పులు చేయక తప్పడం లేదు. వరి, పత్తి లాంటి ఏ పంటలు సాగు చేయాలన్నా ఎకరానికి 40 వేల రూపాయలకు మించిన పెట్టుబడి అవుతోందని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం రైతు భరోసా కింద ఎకరానికి 12 వేల రూపాయలు మాత్రమే ఇవ్వడంతో సాగు పెట్టుబడి ఖర్చుల కోసం అధిక వడ్డీలకు ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల వద్ద అప్పులు చేస్తున్నారు. ఫలితంగా రైతులు మరింత అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

# విద్యుత్ డిమాండ్‌పై కార్యాచరణ

## ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త :** భవిష్యత్ విద్యుత్ డిమాండ్‌కు తగ్గట్టుగా కార్యాచరణను రూపొందించాలని ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా సూచించారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతోందని, దీన్ని దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ఈ మేరకు హైదరాబాద్ విద్యుత్ సౌధలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ అందుకు తగినట్లుగా రాబోయే ఐదు సంవత్సరాల వరకు పెరిగే డిమాండ్‌ను అంచనా వేయాలన్నారు. అంతేకాకుండా ఆమేరకు పెరిగే కరెంట్‌ను సమర్థవంతంగా సరఫరా చేసేందుకు వీలుగా నెట్వర్క్‌ను బలోపేతం చేయాలని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో అత్యధిక డిమాండ్ 16877 మెగావాట్లకు చేరుకుంటుందని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ అంచనా వేసిందని తెలిపారు, కానీ వాస్తవంగా గరిష్ట డిమాండ్ 17162 మెగా వాట్లుగా అంచనాలకు మించి నమోదయ్యిందని తెలిపారు. అలాగే 2026 లో గరిష్ట డిమాండ్ 18138 మెగా వాట్లకు పెరుగుతుందని అంచనా వేసిందని వివరించారు. రాష్ట్రంలో పారిశ్రామిక, ఇతర రంగాల అభివృద్ధి నేపథ్యంలో గరిష్ట డిమాండ్ 19000 19500 మెగావాట్లకు మించే అవకాశం ఉన్నందున అధికారులు దానికి తగినవిధంగా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలకు సైతం నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు సమర్థవంతమైన ఏర్పాట్లు చేపట్టాల్సిందిగా అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో దక్షి ణ తెలంగాణ విద్యుత్‌పంపిణి సంస్థ సిఎండి ముషారఫ్ ఫరూఖీ, ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# పెన్షనర్ల సమస్యలను తీర్చకుంటే ఉద్యమం ఉధృతం

## కార్యాచరణ ప్రకటించిన పెన్షనర్ల జెఎసి

**హైదరాబాద్ (చిక్కడపల్లి), మే 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు ఉద్యమ కార్యాచరణ ప్రకటించారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడి ఒకటిన్నర సంవత్సరాల కావస్తున్న కూడా తమకు సంబంధించిన పెండింగ్ సమస్యలను నేటికీ పరిష్కరించక పోవడాన్ని నిరసిస్తూ తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల గెజిటెడ్ అధికారుల ఉపాధ్యాయుల కార్మికుల పెన్షనర్స్ ఐక్య కార్యాచరణ సమితి ఉద్యమ కార్యాచరణను ప్రకటించింది. ఆదివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల గెజిటెడ్ అధికారుల ఉపాధ్యాయుల కార్మికుల పెన్షనర్స్ ఐక్య కార్యాచరణ సమితి చైర్మన్ మారం జగదీశ్వర్ అధ్యక్షతన సదస్సు జరిగింది. సదస్సులో అందరి అభిప్రాయాలు, సూచనలు తీసుకున్న అనంతరం ప్రభుత్వంపై ఉద్యమ కార్యాచరణ ప్రకటించారు. 15న రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాల వద్ద భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శ నలు చేయాలని, అదే విధంగా జూన్ 9న ఇందిరా పార్క్ వద్ద మహ ధర్నా చేపట్టారు నిర్ణయిం చారు. ప్రభుత్వం గనుక స్పందించకపోతే రాష్ట్రం లోని అన్ని ప్రభుత్వ కార్యా లయాల్లో పని వేలల్లో మాత్రమే పని చేయడం, ప్రభుత్వ కార్యాలయం నుండి మానవహారాలు, సాంఘిక భోజనాలు చేయడం, పెండౌన్, సామూహిక సెలవులు పెట్టాల్సి వస్తుందని హెచ్చరిం చారు. రాష్ట్ర ప్రభుత్వం కనిపిస్తుంది విస్తృత విశాల ఉద్యమాన్ని నిర్మించడానికి వెనుకాడే ప్రసక్తి లేదని, ప్రత్యక్ష కార్యచరణ ప్రకటించాల్సి వస్తుందని హెచ్చరించారు. తెలంగాణ సమాజం ఎల్లకాలం అణిచివేతను, సాచివేతను, అలచాట్లను, అవమా నాన్ని పరిచిన చరిత్ర లేదని చైర్మన్ జగదీశ్వర్ అన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగులకు సంబంధించిన అన్ని సమస్యల పరిష్కారం అవుతాయని భావించామని, కాని అవి అపరిష్కృతంగానే మిగిలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న ఉద్యోగసంఘాల ప్రతినిధులు డిమాండ్లను ఆమోదించారు. యుద్ధ ప్రాతిపదికన పెండింగ్ బిల్స్ ను క్లియర్ చేయాలని, 5 డిఎలను వెంటనే విడుదల చేయాలి, ఉద్యోగుల (ఈహెచ్‌ఎస్) ఆరోగ్యం రక్షణ పథకాన్ని పూర్తి స్థాయిలో అమలుచేయాలి, సిపియస్ ను రద్దు చేయాలి, వేతన సవరణ కమిటీ నివేదికను వెంటనే తెప్పించుకుని 51శాతం ఫిట్‌మెంట్ తో అమలు చేయాలి, స్థానికత ప్రాతిపదికగా అదనపు పోస్టులు సృష్టించి 317 జిఓ ను అమలు చేయాలి, అన్ని ప్రభుత్వ శాఖలలో పదోన్నతుల కమిటీలను సకాలంలో ఏర్పాటు చేసి పదోన్నతులను ఇవ్వాలి, ఎన్నికల సమయంలో నిర్వహించిన బదలీ చేసిన ఉద్యోగులను తిరిగి వారి పూర్వ స్థానాలకు చేర్చాలి, 2025 సంవత్సరానికి సాధారణ బదలీలు మే, జూన్ లోనే చేయాలి అని సమావేశం డిమాండ్ చేసింది. ఈ సదస్సులో సెక్రటరీ జనరల్ ఏలూరు శ్రీనివాసరావు, అదనపు కార్యదర్శి పి దామోదర్ రెడ్డి, కో చైర్మన్లు చావా రవి, రవీందర్ రెడ్డి, జి సదానందం గౌడ్, దాస్య నాయక్, తిరుపతి, మహిపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, లింగారెడ్డి, వైస్ చైర్మన్లు ఎస్ఏ హుసేని (ముజీబ్), చంద్రమోహన్, అంజిరెడ్డి, శ్రీధర్, నరహరి, చంద్రశేఖర్ గౌడ్, సత్యనారాయణ రెడ్డి, తిప్పర్తి యాదయ్య, దామోదర్ రెడ్డి, రామారావు తదితరులు పాల్గొన్నారు.




తెలంగాణ ఉద్యోగుల గెజిటెడ్ అధికారుల ఉపాధ్యాయుల కార్మికుల పెన్షనర్ల జెఎసి సమావేశంలో పాల్గొన్న ఉద్యోగ సంఘాల ముఖ్యనాయకులు

# కేంద్రం నిధులిచ్చినా మొండిచేయి ఆరోపణలు..

# కెసిఆర్, రేవంత్‌లకు అలవాటుగా మారింది

## మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్‌ఎస్ ప్రభాకర్

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త :** కేంద్రానికి ఎన్నిసార్లు నిధులు కావాలని విజ్ఞప్తులు చేసినా కేంద్రం మొండిచేయి చూపుతుందని ఆరోపించడం మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అలవాటుగా మారిందని మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్‌ఎస్ ప్రభాకర్ మండిపడ్డారు. శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాల కోసం లక్షల కోట్ల రూపాయలు తెలంగాణకు మంజూరు చేసిందన్నారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభించిన చర్లపల్లి రైల్వే టర్మినల్ కోసం గతంలో మాజీ సిఎం కెసిఆర్‌ను భూమి కేటాయించాలని నేను పలుమార్లు కోరడం జరిగింది. అయినా భూములు ఇవ్వలేదన్నారు. అదే రైల్వే భూమిలో నిర్మాణం పూర్తయి ప్రజలకు అంకితమయిన తర్వాత కూడా ఈ నాలుగు నెలల కాలంలో అదనంగా కొత్తగా ఒక్క వీధిలైట్ కూడా వేయలేదని అన్నారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ కోసం నరేంద్ర మోడీ ప్రభుత్వం రూ.600 కోట్లు కేటాయించినా, అక్కడ స్తంభాలు మార్చడానికి, పైపులైన్లు మార్చడానికి గత బిఆర్‌ఎస్ సర్కారు ఆరు సంవత్సరాలు జాప్యం చేసిందన్నారు. కేంద్ర పథకాలు, ప్రాజెక్టుల అమలుకు సహకరించకుండా పనిచేయడం స్థానిక సంస్థలు నిర్వీర్యం అయ్యాయి. కేంద్రం నిధులు ఇస్తుంటే కూడా రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించడంలో విఫలమవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రభుత్వ పథకాల అమలుకు, వివిధ ప్రాజెక్టులకు సహాయనిరాకరణ చేస్తూ, అభివృద్ధి అడ్డంకిగా మారుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు.



# విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వరా?

## బడా కాంట్రాక్టర్లకు వేల కోట్ల బిల్లులు చెల్లిస్తారు..

## మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 4:** కాంగ్రెస్ ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్య వైఖరి విద్యార్థుల పాలిట శాపంగా మారిందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. బడా కాంట్రాక్టర్లకు వేల కోట్ల బిల్లులు చెల్లిస్తారు కానీ, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వారా అని ప్రశ్నించారు. విద్యార్థుల చదువును, వారి జీవితాలను కాంగ్రెస్ సర్కార్ ప్రశ్నార్థకం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిగ్రీ కాలేజీలకు ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో ఆరు లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తును, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రారంభించిన పథకాన్ని ఎలాంటి మార్పు లేకుండా కేసీఆర్ అమలు చేసి గొప్ప మనసు చాటుకున్నారని తెలిపారు. బీఆర్‌ఎస్ హాయంలో కరోనా వంటి ఆర్థిక సంక్షోభ కాలం సహా, ఏనాడు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఆపలేదని ఆదివారం ఆయన ఎక్స్ వేదికగా వెల్లడించారు. బడా కాంట్రాక్టర్లకు వేలకోట్ల బిల్లులు చెల్లిస్తారు కానీ, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించరా?. కాంగ్రెస్ ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్య వైఖరి, విద్యార్థుల పాలిట శాపంగా మారింది. వారి చదువును, జీవితాలను ప్రశ్నార్థకం చేస్తున్నదన్నారు. డిగ్రీ కళాశాలలకు దాదాపు రూ.800 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో 6 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ఆగమ్యగోచడంలో పడింది. డిగ్రీ పరీక్షలు నిర్వహించాలని విద్యార్థులు ప్రభుత్వాన్ని వేడుకునే దుస్థితి రావడం ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమన్నారు.

సకాలంలో పరీక్ష నిర్వహించకపోవడంతో పీజీసెట్, లా సెట్, ఇతర పోటీ పరీక్షలు రాయడానికి మూడో సంవత్సరం విద్యార్థులు అర్హత కోల్పోతున్నారు. ఏప్రిల్ నెలలో జరగాల్సిన డిగ్రీ పరీక్షలను కాకతీయ, శాతవాహన, తెలంగాణ, మహాత్మా గాంధీ, పాలమూరు యూనివర్సిటీ పరిధిలో ఇప్పటికీ నిర్వహించకపోవడం ప్రభుత్వ చేతగాని తనమే. మరోవైపు ప్రైవేటు కళాశాల యాజమాన్యాలు డిగ్రీ పరీక్షలు నిర్వహించకుండా నిరసనలు తెలుపుతున్నప్పటికీ ప్రభుత్వం మొద్దు నిద్ర నటిస్తున్నదని దుయ్యబట్టారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో యాజమాన్యాలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయి. కళాశాల యాజమాన్యాలు అప్పులు తెచ్చి బోధన, బోధనేతర సిబ్బందికి జీతాలు చెల్లిస్తున్న పరిస్థితి. అద్దెలు, అప్పులు పెరిగిపోవడంతో ఈ ఏడాది డిగ్రీ అడ్మిషన్లను నిలిపివేయగా, కొన్నిచోట్ల కళాశాలలకు తాళం వేసి ఇప్పటికే సెలవులు ప్రకటించారు.ఇంత జరుగుతుంటే తమకేమీ పట్టనట్లు సీఎం, మంత్రులు వ్యవహరిస్తుండడం సిగ్గుచేటు అని తప్పుపట్టారు. విద్యార్థుల భవిష్యత్తును, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని దివంగత సీఎం వైఎస్ ప్రారంభించిన పథకాన్ని ఎలాంటి మార్పు లేకుండా కేసీఆర్అ మలు చేశారు. గొప్ప మనసు చాటుకున్నారు.

కరోనా వంటి ఆర్థిక సంక్షోభ కాలం సహా, ఏనాడు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఆపలేదని తెలిపారు. ప్రతి ఏటా సగటున రూ. రెండు వేల కోట్లు, తొమ్మిదిన్నరేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో మొత్తం రూ.19 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేశాం. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం 17 నెలల్లో 17 పైసలు కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద విడుదల చేయలేదు.

ఈ ప్రభుత్వ ప్రాధాన్యాల్లో విద్య అనేది మిథ్య అని స్పష్టమవుతున్నదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఇంకా మెరుగైన రీతిలో కొనసాగిస్తామని మేనిఫెస్టోలో చెప్పి, పథకాన్ని మరుగునపడేలా చేశారని ఆరోపించారు. పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లిస్తామని మొన్న నిండు అసెంబ్లీలో ముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి చెప్పిన మాటలు గాలి మాటలే అయ్యాయి. రెండు నెలల్లో మొత్తం బకాయిలు క్లియర్ చేస్తామని, కళాశాల యాజమాన్యాలకు ఆర్థిక మంత్రి భట్టివిక్రమార్క ఇచ్చిన హామీ నీటి మూటలే అయ్యాయి. మాటమీద నిలబడేది లేదు, ఇచ్చిన హామీలు నెరవేర్చేది లేదు. ముఖ్యమంత్రి నుంచి మంత్రుల వరకు అందరిదీ అదే దారిఅని దుయ్యబట్టారు.

ఆట



## మహిళల హాకీలో.. ఆస్ట్రేలియా చేతిలో
# భారత్ చిత్తు

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న భారత మహిళల హాకీ జట్టు వైఫల్య ప్రదర్శన కొనసాగుతున్నది. మహిళల హాకీ సిరీస్ చివరి మ్యాచ్‌లో భారత్ 2–3 తేడాతో ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోయింది. పెర్త్ హాకీ స్టేడియంలో జరిగిన నాల్గవ మ్యాచ్‌లో భారత మహిళల హాకీ జట్టు ఉత్సాహభరితమైన పోరాటాన్ని ప్రదర్శించినా, ఆస్ట్రేలియా చేతిలో ఓటమి తప్పలేదు. భారత్ తరపున నవనీత్ కౌర్ (35వ నిముషం), లాల్రెమ్సియామి (59వ నిముషం) గోల్స్ చేయగా, గ్రేస్ స్టీవర్ట్ (2వ నిముషం), జాడే స్మిత్ (36వ నిముషం), మరియు గ్రెటా హేస్ (42వ నిముషం) గోల్స్ చేయడంతో ఆస్ట్రేలియా ఆతిథ్య జట్టును ఓడించింది. మొదటి క్వార్టర్ ప్రారంభంలోనే ఆస్ట్రేలియా గోల్ చేసి, రెండో నిమిషంలోనే 1–0 ఆధిక్యంలోకి వెళ్ళింది. క్వార్టర్‌లో మిగిలిన సమయంలో భారత్ ఈక్వలైజర్ కోసం తీవ్రంగా ప్రయత్నించింది కానీ గోల్ చేయలేకపోయింది. ఇక రెండవ క్వార్టర్‌లో, భారత్ బాగా ఆడుకుంది. ప్రారంభంలోనే లభించిన పెనాల్టీ కార్నర్‌ను మరియు చివరిలో వచ్చిన మరో సెట్‌పీస్ ముప్పును విజయవంతంగా తిప్పికొట్టింది, హాఫ్ టైమ్‌లో లోటును ఒకే గోల్‌కు పరిమితం చేసింది. మూడో క్వార్టర్‌లో నవనీత్ 35వ నిమిషంలో పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి 1–1తో భారత్‌ను ముందుకు తీసుకెళ్లింది. అయితే, 36వ నిమిషంలో స్మిత్ ఫీల్డ్ గోల్ చేయడంతో ఆస్ట్రేలియా వెంటనే ఆధిక్యాన్ని పునరుద్ధరించింది. ఆస్ట్రేలియా మరో రెండు పెనాల్టీ కార్నర్‌లను గెలుచుకున్న తర్వాత 42వ నిమిషంలో హేస్ ఆతిథ్య జట్టు ఆధిక్యాన్ని పెంచాడు. చివరి క్వార్టర్ చివరిలో లాల్రెమ్సియామి గోల్ చేయడంతో భారతదేశం ఆధిక్యాన్ని తగ్గించింది, కానీ ఆస్ట్రేలియా విజయాన్ని ఖాయం చేసుకోవడానికి దృఢంగా నిలబడి సత్తా చాటి చివరకు విజయం సాధించింది.



## కెకియావో డైమండ్ లీగ్‌లో..
# సాబ్లెకు 8వ స్థానం

**న్యూఢిల్లీ:** కెకియావో డైమండ్ లీగ్‌లో 3000 మీటర్ల స్టీపుల్ చేజ్‌లో భారత్ యువ అథ్లెట్ అవినాష్ సాబుల్ 8వ స్థానంతో సరిపెట్టుకున్నాడు. కెకియావో వేదికగా జరిగిన పురుషుల 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్ ఈవెంట్‌లో సాబ్లె 8 నిమిషాల 23.85 సెకన్లలో లక్ష్యాన్ని పూర్తిచేశాడు. అయితే ఇది అతని వ్యక్తిగత ఉత్తమ సమయం మరియు జాతీయ రికార్డు 8:09.91 కంటే చాలా దూరంగా ఉంది. కాగా గత వారం జియామెన్‌లో జరిగిన ఈ సంవత్సరం తన మొదటి ఢిల్లీ మీట్‌లో సాబుల్ పాల్గొని, దాన్ని 8:22.59 సమయంతో ముగించాడు. దీనికి ముందు, 30 ఏళ్ల అతను చివరిసారిగా సెప్టెంబర్ 2024లో జరిగిన డైమండ్ లీగ్ ఫైనల్‌లో పాల్గొన్నాడు, అక్కడ అతను 8:17.09 సమయంతో తొమ్మిదో స్థానంలో నిలిచాడు. అయితే, సేబుల్ తన అర్హత ర్యాంక్ 12ని మెరుగుపరుచుకున్నాడు, అది అతనికి ఒక అర్హత పాయింట్‌ను తెచ్చిపెట్టింది. 2024 పారిస్ ఒలింపిక్ క్రీడల్లో 8:14.18 సమయంతో 11వ స్థానంలో నిలిచిన సాబుల్, తన పారిస్ 2024 ప్రదర్శన ఆధారంగా సెప్టెంబర్‌లో టోక్యోలో జరిగే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లకు ఇప్పటికే అర్హత సాధించాడు. ఇక అబ్రహం సిమ్ 8:07.92 సమయంలో అందరికంటే ముందు నిలిచాడు. ఇథియోపియన్ 2000 మీటర్ల మార్కు ద్వారా ఆధిక్యాన్ని నెలకొల్పాడు. కెన్యాకు చెందిన ఎడ్మండ్ సెరెమ్ (8:08.68) మరియు సైమన్ కిప్రోప్ కోచ్ (8:09.05) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. మొరాకోకు చెందిన అబ్దేరాఫియా బౌసెల్ దీవినీగా ట్యాగ్ చేయబడటానికి ముందు కిలోమీటర్ మార్కు వరకు ఆధిక్యంలో ఉన్నాడు. స్పెయిన్‌కు చెందిన డేనియల్ ఆర్స్, కెన్యాకు చెందిన చెమియాట్ విల్బర్‌ఫోర్స్ కోన్స్ రేసును పూర్తి చేయలేకపోయారు. జియామెన్‌లో మొరాకోకు చెందిన ప్రస్తుత ఒలింపిక్ మరియు ప్రపంచ ఛాంపియన్ సోఫియానే ఎల్ బక్కాలిని ఆశ్చర్యపరిచిన సిమ్ స్వదేశీయుడు శామ్యూల్ ఫై రేవు 8:11.18తో ఆరో స్థానంలో నిలిచాడు. గత శనివారం ఫైర్వే 8:05.61 సమయంతో ఆరో స్థానంలో నిలిచాడు. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతక విజేత అబ్రహం కిబివోట్ ఏడో స్థానంలో నిలిచాడు.

# ఐపిఎల్‌లో ఖరీదైన ఓవర్

## టాప్ 5లో జడేజా.. ఒక ఓవర్ 37 రన్స్‌తో అగ్రస్థానంలో క్రిస్ గేల్







**న్యూఢిల్లీ:** రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ), చెన్నై సూపర్ కింగ్స్‌ను వారి సొంత మైదానంలో 2 పరుగుల తేడాతో ఓడించి ఐపిఎల్ –2025లో ఎనిమిదో విజయాన్ని నమోదు చేసింది. ఈ సీజన్‌లో చెన్నైకి ఇది తొమ్మిదో ఓటమి. ఇక ఆర్‌సీబీ తరపున ఆడిన ఈ మ్యాచ్‌లో రొమారియో షెపర్డ్ 14 బంతుల్లో 53 పరుగులు చేశాడు. ఖలీల్ అహ్మద్ వేసిన ఒక ఓవర్లో అతను 33 పరుగులు చేశాడు. ఐపిఎల్ 2025లో ఇదే అత్యంత ఖరీదైన ఓవర్‌గా నిలిచింది. ఇలాగే ఐపిఎల్ చరిత్రలో టాప్5 అత్యంత ఖరీదైన ఓవర్ల గురించి తెలుసుకుంటే ఆర్‌సీబీ ఇన్నింగ్స్ 19వ ఓవర్‌లో ఖలీల్ అహ్మద్ చెన్నై తరపున బౌలింగ్ చేయడానికి వచ్చాడు. అతను 33 పరుగులు ఇచ్చాడు. ఐపిఎల్ 2025లో అత్యంత ఖరీదైన ఓవర్ బౌలింగ్ వేశాడు. అంతేకాకుండా, ఐపిఎల్ చరిత్రలో చెన్నై సూపర్ కింగ్స్ తరపున ఒకే ఓవర్లో అత్యధిక పరుగులు ఇచ్చిన బౌలర్ అయ్యాడు. అతను 4 సంవత్సరాల రికార్డును బద్దలు కొట్టాడు. 2020లో రాజస్థాన్ రాయల్స్ పై లుంగీ న్గిడి, 2021లో కోల్‌కతా నైట్ రైడర్స్ పై సామ్ కుర్రాన్ తలా 30 పరుగులు ఇచ్చాడు. 2019లో, డ్వేన్ బ్రావో వేసిన ఓవర్‌లో ముంబై ఇండియన్స్ బ్యాట్స్‌మెన్ 29 పరుగులు చేశారు. ఖలీల్ 3 ఓవర్లలో 65 పరుగులు ఇచ్చాడు. ఒక మ్యాచ్‌లో అత్యధిక పరుగులు ఇచ్చిన చెన్నై బౌలర్‌గా కూడా అతను నిలిచాడు. కాగా ఐపిఎల్ చరిత్రలో అత్యంత ఖరీదైన ఓవర్ గూర్చి తెలుసుకుంటే 8 మే 2011న ఆర్‌సీబీ బ్యాట్స్‌మన్ క్రిస్ గేల్, కొచ్చి టస్కర్స్ కేరళ బౌలర్ పి. పరమేశ్వరన్‌పై ఒక ఓవర్‌లో 37 పరుగులు చేశాడు. పరమేశ్వర్ ఒక ఓవర్లో అత్యధిక పరుగులు ఇచ్చిన బౌలర్ అయ్యాడు. తన ఓవర్లో గేల్ 6, 6 (నోబాల్), 4, 4, 6, 6, 4 పరుగులు చేశాడు. అలాగే ఐపిఎల్ 2021లో, చెన్నై సూపర్ కింగ్స్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా ఆర్‌సీబీ ఆటగాడు హర్షల్ పటేల్ వేసిన ఓవర్‌లో 37 పరుగులు చేశాడు. హర్షల్ వేసిన ఓవర్‌లో జడేజా 6, 6, 6 (నోబాల్), 6, 2, 6, 4 పరుగులు చేశాడు. ఐపిఎల్ 2022లో కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ బౌలర్ డేనియల్ సామ్స్ ఒకే ఓవర్‌లో 35 పరుగులు ఇచ్చాడు. సామ్స్ ఓవర్‌లో కోల్‌కతాకు చెందిన పాట్ కమ్మిన్స్ 6, 4, 6, 6, 2 (నోబాల్), 4, 6 పరుగులు చేశాడు. తాజాగా 2025 ఐపిఎల్‌లో ఖలీల్ అహ్మద్ వేసిన ఓవర్‌లో రొమారియో షెపర్డ్ 33 పరుగులు చేశాడు. తన ఓవర్లో రొమారియో 6, 6, 6, 4, 6, 6 (నోబాల్), 0, 4 పరుగులు చేశాడు. 2014లో కింగ్స్ ఎలెవన్ పంజాబ్ (ఇప్పుడు పంజాబ్ కింగ్స్) తరపున పర్వీందర్ అవానా ఒక ఓవర్‌లో 33 పరుగులు ఇచ్చాడు. చెన్నై సూపర్ కింగ్స్‌కు చెందిన సురేష్ రైనా అవానా ఓవర్‌లో 6, 6, 4, 4, 4 (నోబాల్), 4, 4 పరుగులు చేశాడు.



## ఉత్కంఠ పోరులో.. కోల్‌కతా నైట్ రైడర్స్ గెలుపు

**న్యూఢిల్లీ:** ఐపిఎల్ 18వ సీజన్ ప్లే ఆఫ్స్ రేసులోకి కోల్‌కతా నైట్ రైడర్స్ దూసు కొచ్చింది. ఆదివారం ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన ఉత్కంఠ పోరులో రాజస్థాన్ రాయల్స్‌ను ఒక్క పరుగు తేడాతో ఓడించింది. రియాన్ పరాగ్(95) పవర్ హిట్టింగ్‌తో భయపెట్టినా, హర్షిత్ రానా(241) రెండు వికెట్లతో మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. అయితే 20వ ఓవర్లో శుభమ్ దూబె(25) 6, 4, 6 బాదడంతో కోల్‌కతా శిబిరంలో కలవరం మొదలైంది. కానీ, రెండో పరుగు తీసే క్రమంలో జోఫ్రా ఆర్చర్(12) రనౌటయ్యాడు. ఇక ఆఖరి ఓవర్ థ్రిల్లర్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ సమిష్టి ప్రదర్శనతో రాజస్థాన్ రాయల్స్‌ను చిత్తు చేసింది. ఆండ్రూ రస్సెల్(57 నాటౌట్) మెరుపులతో భారీ స్కోర్ కొట్టిన కోల్‌కతా ప్రత్యర్థిని 2025 పరుగులకే కట్టడి చేసింది. ఛేదనలో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ(4)మరోసారి నిరాశపరిచాడు. వైభవ్ అరోరా బౌలింగ్‌లో టైమింగ్‌కు కుదరక.. అజింక్యా రహానే చేతికి చిక్కాడు. వరుసగా వికెట్లు పడినా కెప్టెన్ రియాన్ పరాగ్(32 నాటౌట్) మాత్రం పట్టువిడవ లేదు. ఒంటరి పోరాటం చేసిన అతడు సిక్సర్లతో రెచ్చిపోయాడు. మోయిన్ అలీని ఉతికేస్తూ ఏకంగా ఐదు సిక్సర్లు బాది మ్యాచ్‌ను రాజస్థాన్‌ను వైపు తిప్పాడు. ఇంప్యాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన హర్షిత్ రానా(241) ఈ ఇద్దరిని ఔట్ చేయడంతో కోల్‌కతా పోటీలోకి వచ్చింది. ఆ తర్వాత ఇంప్యాక్ట్ ప్లేయర్ శుభమ్ దూబె(25) వైభవ్ ఆరోరా వేసిన 20వ ఓవర్లో 6, 4, 6 బాదాడు. దాంతో, ఆఖరి బంతికి 3 పరుగులు అవసరమయ్యాయి. అయితే రెండో పరుగు తీసే క్రమంలో ఆర్చర్ రనౌట్ కావడంతో కోల్‌కతా ఒక్క రన్ తేడాతో గెలిచి ఊపిరి పీల్చుకుంది.

# టీమిండియాకు శ్రీలంక షాక్

## ఉత్కంఠ పోరులో 3 వికెట్ల తేడాతో గెలుపు

**న్యూఢిల్లీ:** మహిళల వన్డే వరల్డ్ కప్ సన్నాహకాల్లో ఉన్న భారత జట్టుకు శ్రీలంక ఝలక్ ఇచ్చింది. ముక్కోణపు వన్డే సిరీస్‌లో అజేయంగా దూసుకెళ్తున్న హర్మన్ ప్రీత్ సేనను ఓడించింది. తొలి పోరులో కంగుతిన్న అనూహ్యంగా పుంజుకొని ఈసారి టీమిండియాకు షాకిచ్చింది. శ్రీలంక వేదికగా జరుగుతున్న ముక్కోణపు వన్డే సిరీస్‌లో జోరుమీదున్న భారత మహిళల జట్టుకు దీంతో కోలుకోలేని దెబ్బతిన్నట్లయింది. వరుసగా రెండు విజయాలతో టేబుల్ టాపర్‌గా ఉన్న హర్మన్ ప్రీత్ కౌర్ సేన ఎట్టకేలకు శ్రీలంక చేతిలో చిత్తయింది. ఆదివారం శ్రీలంక వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో భారీ స్కోర్లతో ఆఖరి ఓవర్ వరకూ ఉత్కంఠ నెలకొనగా, లంక 3 వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ ప్రారంభించిన భారత్ ప్లేయర్లు రీచా ఘోష్ (58) అర్ధ శతకానికి జెమీమా రోడ్రిగ్స్ (37) మెరుపులు తోడవ్వగా, భారత్ 275 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించి




ఛేదనలో నీలాక్షి డిసిల్వా (56), హర్షిత సమర విక్రమ (53)లు హాఫ్ సెంచరీలతో చెలరేగి జట్టుకు అద్భుత విజయాన్ని అందించారు. ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (24), కష్వీ గౌతమ్ (17)లు ధనాధన్ ఆడడంతో ప్రత్యర్థికి భారత్ పెద్ద లక్ష్యాన్ని నిర్దేశించగలిగింది. ఇక టీమిండియా నిర్దేశించిన 279 పరుగుల ఛేదనలో లంక ఓపెనర్లు హాసిని పెరీరా (22), విష్మి గుణరత్నే (33)లు అదిరే ఆరంభం ఇచ్చారు. తొలి వికెట్‌కు 30 రన్స్ జోడించిన హాసిని దీప్తి శర్మ త్రోకు రనౌట్‌గా వెనుదిరిగింది. ఆ తర్వాత హర్షిత సమరవిక్రమ (53), కెప్టెన్ చమరి ఆటపట్టు (23) భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ స్కోర్ బోర్డును ఉరికించారు. టెయిలెండర్లు అనుష్క సంజీవని(23 నాటౌట్), సుగంధిక కుమారి(19 నాటౌట్)లు అజేయంగా నిలబడి జట్టుకు 3 వికెట్ల విజయాన్ని అందించారు. ఇక గత పోరులో దక్షిణాఫ్రికాను చిత్తు చేసిన లంకకు ఇది రెండో విక్టరీ.

# వాణిజ్యం

# పాక్ రూపీతో పోలిస్తే భారత్ కరెన్సీ మెరుగు

**న్యూఢిల్లీ, మే 4:** ట్రంప్ సుంకాల భయం ఆసియాదేశాలలో ఎక్కువగా ఉన్న ప్రస్తుత సమయంలో భారత రూపాయి డాలర్‌తో పోటీ పడే సామర్థ్యం కలిగి ఉందని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. ముఖ్యంగా చైనా అయినా, వియత్నాం అయినా, పాకిస్తాన్ అయినా లేదా ఇతర దేశాల సుంకాలు కూడా భారతదేశం కంటే ఎక్కువగా ఉన్నాయి. గత 10 సంవత్సరాల గురించి మాట్లాడుకుంటే డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి పనితీరు పాకిస్తాన్ కంటే చాలా మెరుగ్గా ఉంది. ప్రస్తుత సంవత్సరంలో డాలర్‌తో పోలిస్తే పాకిస్తాన్ రూపాయి దాదాపు ఒక శాతం తగ్గింది. మరో వైపు, ప్రస్తుత సంవత్సరంలో భారత రూపాయి దాదాపు ఒక శాతం లాభంతో ట్రేడవుతోంది. గత 10 సంవత్సరాల్లో అంటే 2015 నుంచి ఇప్పటివరకు భారత రూపాయి డాలర్‌తో పోలిస్తే తగ్గింది. 2016 సంవ



త్సరంలో డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి 6 శాతం పెరిగింది. అదే సమయంలో ప్రస్తుత సంవత్సరంలో భారత రూపాయి డాలర్‌తో పోలిస్తే ఎక్కువగా ట్రేడవుతోంది. అయితే గత 10 సంవత్సరాల్లో డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి రెండంకెల క్షీణతను చూసిన సంవత్సరం ఒకటుంది. 2022 సంవత్సరంలో డాలర్‌తో పోలిస్తే రూపాయి 11 శాతం క్షీ ణతతో ముగిసింది. 5శాతం కంటే ఎక్కువ క్షీణత కనిపించిన సందర్భాలు మూడు ఉన్నాయి. సాజ్ 2022 కాకుండా 2018 సంవత్సరంలో దాదాపు 9 శాతం తగ్గుదల కనిపించింది. అయితే 2015 సంవత్సరంలో దాదాపు 5 శాతం తగ్గుదల కనిపించింది. మరోవైపు భారత రూపాయితో పోలిస్తే పాకిస్తాన్ రూపాయి పరిస్థితి చాలా దారుణంగా ఉంది. గణాంకాలను పరిశీలిస్తే పాకిస్తాన్ కరెన్సీ విధ్వంస స్థితిలో ఉన్నట్లు అనిపిస్తుంది. గత దశాబ్దంలో డాలర్‌తో పోలిస్తే పాకిస్థాన్ రూపీ పెరిగిన సందర్భం ఒక్కటే ఉంది. 2024 సంవత్సరంలో పాకిస్థాన్ రూపాయి 1.22 శాతం పెరుగుదల ఉంది. 2016 సంవత్సరంలో డాలర్‌తో పోలిస్తే పాకిస్థాన్ రూపాయి స్థిరంగా కనిపించింది. ప్రత్యేకత ఏమి టంటే గత పదేళ్లలో డాలర్‌తో పోలిస్తే పాకిస్తాన్ రూపాయి రెండంకెల క్షీణతను చూసిన 5 సంవత్సరాలు ఉన్నాయి. డేటా ప్రకారం 2022 సంవత్సరంలో 28.34 శాతం అతిపెద్ద క్షీణత కనిపించింది. దీనికి ముందు 2018లో పాకి స్థాన్ రూపాయి 25.62 శాతం తగ్గింది. 2023 సంవత్సరంలో 24.54 శాతం తగ్గుదల కనిపించింది. 2019 సంవత్సరంలో 11.60 శాతం, 2021లో 10.12 శాతం తగ్గుదల కనిపించింది. ప్రస్తుత సంవత్సరంలో ఇప్పటివరకు పాకిస్తాన్ కరెన్సీ దాదాపు ఒక శాతం తగ్గుదల కనిపించింది. భారత కరెన్సీ, పాకిస్తాన్ కరెన్సీ మధ్య చాలా తేడా ఉంది. భారతదేశం, పాకిస్తాన్ మధ్య రాకపోకలు ఆగిపోయినప్పటికీ ఎవరైనా పాకిస్తానీ భారతదేశానికి రావాల్సి వస్తే, పాకిస్తాన్‌లోని రూ.10లక్షలు భారతదేశంలో రూ. 3,03,049.50గా మారతాయి. దీని అర్థం పాకిస్తాన్ కరెన్సీ భారతదేశం కంటే 3రెట్లు ఎక్కువ బలహీనంగా ఉంది. అలాంటి పరిస్థితిలో భారత రూపాయి పాకిస్తాన్ రూపాయికి నిరం తరం నష్ట పోతోందని చెప్ప వచ్చు.

# పతంజలి సూపర్ సక్సెస్‌కు మూలం డిమాండ్

**ముంబై, మే 4:** 2024 ఆర్థిక సంత్సవరంలో పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆహార తినదగిన నూనెల విభాగం దాదాపు 70శాతం అత్యధిక ఆదాయ వాటాను సాధించింది. ఆ తర్వాత ఆహారం, ఇతర ఎఫ్‌ఎంజిసి విభాగాలు వచ్చాయి. వారి ఆదాయ వాటా దాదాపు 30 శాతంగా కనిపించింది. పతంజలి ఫుడ్స్ అనేది భారతదేశంలో వినియోగదారు ఉత్పత్తులు, తినదగిన నూనె ఉత్పత్తులను తయారు చేసే ఒక భారతీయ ఎఫ్‌ఎంజిసి కంపెనీ. ప్రత్యేక విషయం ఏమిటంటే పతంజలి ఫుడ్స్ ఉత్పత్తులకు డిమాండ్ నిరంతరం పెరుగుతుండటం వల్ల, ఆదాయం, లాభం కూడా పెరుగు తోంది. ముందుగా ఆదాయం గురించి మాట్లాడు కుంటే.. పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆదాయం 2025 ఆర్థిక సంవత్సరం నాల్గవ త్రైమాసిక ఫలితాలను కంపెనీ ఇంకా విడుదల చేయలేదు. కానీ మూడవ త్రైమాసికంలో ఆదాయం రూ.9,103.13 కోట్లుగా కనిపించింది. గత ఏడాది ఇదే త్రైమా సికంలో కంపెనీ ఆదాయం రూ.7,910.70 కోట్లు. దీని అర్థం కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన రూ.1,192.43 కోట్లు పెరిగింది. లాభం గురించి మాట్లా డుకుంటే, గత 4 త్రైమాసికాలలో కంపెనీ లాభం నిరంతరం పెరుగుతూనే ఉంది. 2023 డిసెంబర్ త్రైమాసికంలో కంపెనీ లాభం రూ.216.54 కోట్లు. ఒక సంవ త్సరం తర్వాత, అంటే డిసెంబర్ 2024 లో కంపెనీ లాభం రూ.370.93 కోట్లకు పెరిగింది. దీని అర్థం కంపెనీ లాభం రూ.154.39 కోట్లు పెరిగింది. రాబోయే రోజుల్లో కంపెనీ ఆదాయం, లాభం మరింత పెరిగే అవకాశం ఉందని పతంజలి అధికారులు భావిస్తున్నారు. పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ మార్కెట్ క్యాప్ గురించి మాట్లాడు కుంటే, అది చాలా ఎక్కువగా ఉంది. ప్రస్తుతం, పతంజలి ఫుడ్స్ మార్కెట్ క్యాప్ దాదాపు రూ.69 వేల కోట్లు. ఇటీవల, కంపెనీల షేర్లలో క్షీణత కనిపించింది. దీని కారణంగా కంపెనీ మార్కెట్ క్యాప్ కూడా తగ్గింది. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. రాబోయే రోజుల్లో పతంజలి ఫుడ్స్ మార్కెట్ క్యాప్ రూ.1 లక్ష కోట్ల కు మించి ఉండవచ్చు. పతంజలి తమ ఉత్పత్తులు పూర్తిగా హానిచేయనివని, ఎటువంటి రసాయనా లను కలిగి ఉండవని పేర్కొంది. అలాగే, వారి ఉత్పత్తులన్నీ సహజమైనవి, దీని కారణంగా వారి ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతోంది. దీని ప్రభావం స్టాక్ మార్కెట్‌పై కూడా కనిపిస్తుంది. పెట్టుబడిదారుల ఆదాయాల గురించి మాట్లాడుకుంటే, పతంజలి ఫుడ్స్ షేర్లు గత ఒక నెలలో 4 శాతానికి పైగా పెరిగాయి. కాగా, పతంజలి షేర్లు 6 నెలల్లో 6 శాతానికి పైగా పెరిగాయి. బిఎస్ఇ డేటా గురించి మాట్లాడుకుంటే, ప్రస్తుత సంవత్సరంలో కంపెనీ షేర్లు 5 శాతం పెరిగాయి.




# రియల్ ఎస్టేట్‌లోకి పెట్టుబడుల వరద..

**ముంబై, మే 4:** దేశంలోని రియల్ ఎస్టేట్ రంగంలోకి ప్రత్యామ్నాయ పెట్టుబడులు (ఎఐఎఫ్) వెల్లువెత్తుతున్నాయి. 2024 డిసెంబర్ చివరి నాటికి రూ.73,903 కోట్లకు చేరాయి. గతేడాది డిసెంబరు నాటికి అన్ని రంగాల్లో ఎఐఎఫ్‌లు కలిపి రూ.5,06,196 కోట్లు రాగా, ఇందులో 15శాతం వాటా రియల్ ఎస్టేట్ రంగాలోకి వచ్చాయని ఒక నివేదిక వెల్లడించింది. నిధుల లేమీతో ఇబ్బందులు పడుతున్న ప్రాజెక్ట్‌లకు ఎఐఎఫ్ పెట్టుబడులు జీవాన్నిస్తున్నాయని, డెవలపర్లకు కొత్త అవకాశాలను కల్పిస్తున్నాయని నివేదిక వెల్లడించింది. రియల్ ఎస్టేట్ తర్వాత అత్యధికంగా ఐటి, ఐటిఇఎస్ రంగంలోకి రూ.30,279 కోట్ల ఎఐఎఫ్ పెట్టుబడులు వెళ్లాయి. ఆతర్వాత ఫైనాన్షియల్ సర్వీసెస్ రూ.26,807 కోట్లు, ఎన్‌బిఎఫ్‌సి రూ.21,929 కోట్లు, బ్యాంకులు రూ.21,273 కోట్లు, ఫార్మా రూ.18,309 కోట్లు, ఎఫ్‌ఎంజిసి రూ.12,743 కోట్లు, రిటైల్ రూ.11,550 కోట్లు,

పునరుత్పాదక ఇంధన రంగం రూ.11,433 కోట్ల చొప్పున ఎఐఎఫ్ పెట్టుబడులు ఆకర్షించగా, ఇరతర రంగాల్లోకి రూ.2,77,970 కోట్లు, ఫార్మా

రూ.18,309 కోట్లు, ఎఫ్‌ఎంసిజి రూ.12,743 కోట్లు, రిటైల్ రూ.11,550 కోట్లు, పునరుత్పాదక ఇంధన రంగం రూ.11,433 కోట్ల చొప్పున ఎఐఎఫ్ పెట్టుబడులు ఆకర్షించగా, ఇతర రంగాల్లోకి రూ.2,77,970 కోట్ల పెట్టుబడులు వెళ్లాయి. రియల్ ఎస్టేట్ అభివృద్ధి పరంగా వివిధ దశల్లో ఉన్న నిధుల సమస్యకు ఎఐఎఫ్ రూపంలో పరిష్కారం లభించినట్లయింది. దేశంలో సంపన్నులైన పెట్టుబడిదారులు ముఖ్యంగా కనీసం రూ.కోటి పెట్టుబడి పెట్టగల హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్, సంస్థల కోసం ఉద్దేశించిన ప్రైవేట్ పెట్టుబడి సమీకరణ సాధనాలే ఈ ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్. 2012 ఎఐఎఫ్ నిబంధనల ప్రకారం సెక్యూరిటీస్ అండ్ ఎక్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి) వీటిని నియంత్రిస్తుంది. స్టాక్స్, బాండ్లు, మ్యూచువల్ ఫండ్స్ వంటి సంప్రదాయ పెట్టుబడులకు భిన్నంగా ప్రైవేట్ ఈక్విటీ, వెంచర్ కేపిటల్, హెడ్జ్ ఫండ్స్, రియల్ ఎస్టేట్, కమోడిటీస్, డెరివేటివ్స్ వంటి సంప్రదాయేతర ఆస్తుల తరగతులలో ఎఐఎఫ్ పెట్టుబడులు పెడతారు.



# ఐపిఒకు అర్బన్ కంపెనీ

**ముంబై, మే 4:** అర్బన్ కంపెనీ పెట్టిన ఈ ప్రతిపాదన కారణంగా ఆక్సెల్, ఎలివేషన్ కేపిటల్, టైగర్ గ్లోబల్, వైక్యాపిటల్ వంటి కంపెనీ పెట్టుబడిదారులు తమ వాటాలను విక్రయిస్తున్నందున ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా రూ.429 కోట్ల కొత్త ఇష్యూ, రూ.1,471 కోట్ల సెకండరీ షేర్ అమ్మకం జరుగుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అర్బన్ కంపెనీ కొత్త టెక్నాలజీ అభివృద్ధితో పాటు క్లౌడ్ మౌలిక సదుపాయాల కోసం కంపెనీ రూ.190 కోట్లు ఖర్చు చేయనుంది. మిగిలిన డబ్బును ఆఫీస్ రెంట్, మార్కెటింగ్ కార్యకలాపాలలో పెట్టుబడి పెట్టనుంది. గతంలో అర్బన్ కంపెనీ రూ.3,000 కోట్ల ఐపీఓ తీసుకురాబోతుందని వార్తలు హల్‌చల్ చేశాయి. కానీ ఇప్పుడు దానిని రూ.1,900 కోట్లకు తగ్గించారు. ఈ ఐపీఓ కోసం అర్బన్ కంపెనీ కోటక్ మహీంద్రా క్యాపిటల్, మోర్గాన్ స్టాన్లీ, గోల్డ్‌మన్ సాచ్స్, జేఎం ఫైనాన్షియల్‌లను తన బ్యాంకర్లుగా నియమించింది. ఈ కంపెనీ వ్యవస్థాపకులు అభిరాజ్ సింగ్ భాల్, వరుణ్ ఖైతాన్, రాఘవ్ చంద్ర, కంపెనీలో దాదాపు 21 శాతం వాటాను కలిగి ఉన్నారు. వారు ఈ ఐపీఓలో తమ వాటాను విక్రయించడం లేదు. 2025 ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల్లో అర్బన్ కంపెనీ రూ. 846 కోట్ల నిర్వహణ ఆదాయాన్ని నమోదు చేసింది. ఇది గత సంవత్సరం కంటే 41 ఎక్కువగా ఉంది. ఈ కాలంలో కంపెనీ రూ.242 కోట్ల నికర లాభాన్ని నమోదు చేయగా గత ఏడాది ఇదే సమయానికి రూ.58 కోట్ల నష్టాన్ని చవిచూసింది.

# క్రికెట్‌తో యూట్యూబ్ వేల కోట్ల ఆదాయం

**ముంబై, మే 4:** యూట్యూబ్‌లో వీడియోలు చేస్తూ డబ్బులు సంపాదించవచ్చు అనే విషయం చాలా మందికి తెలుసు. అయితే భారతీయ కంటెంట్ క్రియేటర్లు, యూబ్యూబర్లు ఎన్ని వేల కోట్ల ఆదాయం పొందారో తెలిస్తే మాత్రం నోరెళ్లబెట్టడం ఖాయం. ముంబైలో జరిగిన వేవ్ 2025 సమ్మిట్‌లో యూట్యూబ్ సిఇఒ నీల్ మోహన్ ఈ విషయం వెల్లడించారు. భారతదేశంలోని కంటెంట్ క్రియేటర్లకు యూట్యూబ్ ఇప్పటివరకు రూ.21,000 కోట్లు చెల్లించిందని, స్థానిక ప్రతిభను ప్రోత్సహించడం, సమర్థించడంలో యూట్యూబ్ పాత్రను మోహన్ పేర్కొన్నారు. భారతీయ క్రియేటర్ల వృద్ధిని, ప్రపంచవ్యాప్తంగా వారి పరిధిని మరింత పెంచడానికి రాబోయే రెండు సంవత్సరాలలో అదనంగా రూ.850 కోట్ల పెట్టుబడి పెడుతున్నట్లు కూడా ఆయన ప్రకటించారు. భారతదేశంలోని తదుపరి తరం సృష్టికర్తలకు మద్దతు ఇవ్వడానికి యూట్యూబ్ ఇక్కడ ఉంది అని మోహన్ అన్నారు. కొత్త పెట్టుబడి ప్రతిభకు శిక్షణ ఇవ్వడం, సృజనాత్మకతకు మద్దతు ఇవ్వడం, భారతీయ సృష్టికర్తలు ప్రపంచ ప్రేక్షకులను చేరుకోవడంలో సహాయపడటంపై దృష్టి సారిస్తుందని ఆయన వివరించారు. ప్రపంచవ్యాప్తంగా యూట్యూబ్‌లో 25 మిలియన్లకు పైగా సబ్‌స్క్రైబర్‌లతో అత్యధికంగా ఫాలోవర్లు ఉన్న నాయకుడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అని కూడా ఆయన పేర్కొన్నారు. భారతదేశంలో కంటెంట్ క్రియేటర్ల సంఖ్య వేగంగా అభివృద్ధి చెందుతోంది. గత సంవత్సరంలో 100 మిలియన్లకు పైగా భారతీయ యూట్యూబ్ ఛానెల్‌లు కంటెంట్‌ను ప్రచురించాయి. 1 మిలియన్ కంటే ఎక్కువ మంది సబ్‌స్క్రైబర్‌లను కలిగి ఉన్న ఛానెల్‌లు 11,000 నుండి 15,000కి పెరిగాయి.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14